Sangeetha.com
Buy a Smart TV & Get Sound Bar worth ₹6999 Only @ ₹1999*
COMBO Offer

ANDHRAJYOTHI
ఆంధ్రజ్యోతి
సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

సంగీత
MIVI R120 SOUNDBAR 120 WATTS
@₹5999*
Exclusively available only at Sangeetha

గురువారం | 10-10-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 176 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి మ. 12.32 తదుపరి అష్టమి; నక్షత్రం: పూర్వాషాఢ ఉ. 5.41 తదుపరి ఉత్తరాషాఢ; వర్జ్యం: మ.3.01-4.39; దుర్ముహూర్తం: ఉ.10.04-10.51, మ.2.45-3.32; అమృతఘడియలు: రా.12.47-2.25; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.10; సూర్యాస్తమయం: 5.53 | హైదరాబాద్ సిటీ

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

|| దసరా మరియు దీపావళి శుభాకాంక్షలు ||

Celebrating 50 Years

అద్భుతమైన ధరలు
అత్యద్భుతమైన ఆఫర్లు

₹3000 Instant Discount

iPhone 13 128GB — ~~₹49,900~~ EFFECTIVE PRICE ₹21,900*
iPhone 15 — ~~₹69,900~~ EFFECTIVE PRICE ₹39,900*
iPhone 16 128GB — ~~₹79,900~~ EFFECTIVE PRICE ₹48,900*

SAMSUNG
Galaxy S24 Ultra (12GB + 256GB) — ~~₹1,29,999~~ EFFECTIVE PRICE ₹1,09,999*
Galaxy S24 (8GB + 256GB) — ~~₹79,999~~ EFFECTIVE PRICE ₹64,999*

vivo
V40e (8GB + 128GB) — ~~₹33,999~~ EFFECTIVE PRICE ₹26,499*
Y58 (8GB + 128GB) — ~~₹23,999~~ EFFECTIVE PRICE ₹17,499*

oppo
Reno 12 Pro 5G (12GB + 256GB) — ~~₹53,999~~ EFFECTIVE PRICE ₹33,399*
F27 Pro+ 5G (8GB + 128GB) — ~~₹32,999~~ EFFECTIVE PRICE ₹25,999*

FREE Travel Bag worth ₹3000
itel P55 (6GB +128GB) POWER 5G

mi
Redmi Note 13 5G — ~~₹20,999~~ EFFECTIVE PRICE ₹14,999*
Redmi 13C 5G — ~~₹13,999~~ EFFECTIVE PRICE ₹11,050*

PARTY SPEAKER ₹15000 @₹2999* On the purchase of select smartphones
MIVI Soundbar with Woofer 10% OFF
Tabs EMI Starts @₹1,417
Laptops Only @₹15,999
Smartwatches Only @₹999
Televisions Only @₹10,499
Air Conditioners Available

30 Min. SUPER FAST DELIVERY
Phone broken? New phone @30%
Win 10 Lakh Cash & Many More EXCITING PRIZES with every Smartphone
Own a Smartphone @₹37/day
Up to ₹15000 EXCHANGE BONUS

5% INSTANT DISCOUNT* SBI card
*Min. Trxn.: ₹20,000; Max. Discount: ₹6,000 per card. Validity: 05 Oct - 03 Nov 2024. T&C Apply.

EASY EMI OPTIONS ▸ BAJAJ FINANCE | HDB FINANCIAL SERVICES | HDFC BANK | TVS CREDIT | SAMSUNG Finance+ | IDFC FIRST Bank | kotak | ICICI Bank

*T&C apply. Select offers applicable on Samsung products.

సంగీత | Sangeetha.com PIONEER THEN, LEADER NOW.

50 YEARS ▪ 7 STATES ▪ 800+ STORES ▪ 60 MILLION DELIGHTED CUSTOMERS

Feedback/suggestions: support@sangeethamobiles.com | SangeethaMobilesIndia | Sangeetha.since1974 | T & C: www.sangeethamobiles.com | Customer Care No.: 080-69246924.



సాంప్రదాయానికి
సౌందర్యానికి వారధి
వారాహి
సిల్క్స్
బంగారు మనసున్న
తెలుగుదనాల నిలువెత్తు రూపం
శ్రీ బాలయ్యబాబు గారి
చేతుల మీదుగా
నేడే
ప్రారంభం
సమయం: మధ్యాహ్నం 1:44 ని॥లకు
#1604 మెట్రో పిల్లర్ ఎదురుగా, రోడ్ నెం.36,
జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్, హైదరాబాద్
బ్రాండ్ అంబాసిడర్
మీనాక్షి చౌదరి సినీ నటి
ప్రారంభోత్సవ సందర్భంగా గ్రాండ్ ఆఫర్స్
GOLD OFFERS
2 Gm గోల్డ్ కాయిన్ On Purchase of Rs. 1,00,000/-
1 Gm గోల్డ్ కాయిన్ On Purchase of Rs. 50,000/-
0.5 Gm గోల్డ్ కాయిన్ On Purchase of Rs. 25,000/-
ప్రత్యేక లక్కీడ్రా
రూ. 50,000/- కంటే ఎక్కువ కొనుగోలు చేసే ముగ్గురుకి
అన్‌కట్ డైమండ్ నెక్లెస్ గెలుచుకునే అద్భుత అవకాశం.
షరతులు వర్తిస్తాయి.
1వ బహుమతి రూ.5 లక్షల అన్‌కట్ డైమండ్ నెక్లెస్
2వ బహుమతి రూ.3 లక్షల అన్‌కట్ డైమండ్ నెక్లెస్
3వ బహుమతి రూ.2 లక్షల అన్‌కట్ డైమండ్ నెక్లెస్
ఈ ఆఫర్స్ అక్టోబర్ 10 నుండి అక్టోబర్ 30, 2024 వరకు
Contact: +91 91 0000 3343

ప్రొటీన్లపై పరిశోధనలకు పట్టం

దేవిడ్ బేకర్, హస్సాబిస్, జంపర్‌కు రసాయన శాస్త్రం నోబెల్ బహుమతి

కంప్యుటేషనల్ ప్రొటీన్లను రూపొందించిన బేకర్

వాటి నిర్మాణాన్ని అంచనా వేసిన హస్సాబిస్, జంపర్ 14

ANDHRAJYOTHI

ఆంధ్రజ్యోతి

సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు



గురువారం | 10-10-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 176 | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | హైదరాబాద్ సిటీ

స్వతంత్ర భారత పారిశ్రామిక రంగంలో ఒక శకం ముగిసింది.


విలువలతో కూడిన వ్యాపారానికి చిరునామాగా నిలిచిన ఓ మహనీయుడిని మన దేశం కోల్పోయింది.

సూది నుంచి విమానం దాకా ఆకాశమే హద్దుగా విస్తరించిన వాణిజ్య విశ్వరూపం తనువు చాలించింది.

సంపదను సృష్టిస్తూనే... ధార్మిక, ఆధ్యాత్మిక, సామాజిక సేవలో తరించిన ఆ జీవితంలో చివరి అధ్యాయం ముగిసింది.

ప్రపంచం మెచ్చిన పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా ఇకలేరు.

ఎన్నటికీ చెరగని తన ఇంటి పేరును ఈ దేశానికి వదిలేసి... తాను మాత్రం వెళ్లిపోయారు!



1937 - 2024

పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా

కన్నుమూత

అనారోగ్యంతో ముంబై బ్రీచ్‌క్యాండీ ఆస్పత్రిలో తుదిశ్వాస

టాటా గ్రూపును 10 వేల కోట్ల డాలర్ల సామ్రాజ్యంగా విస్తరింపజేసిన సమర్థ వ్యాపారవేత్త.. దాతృత్వంలో మేటి

భారత ఆటోమొబైల్ సంస్థలకు కార్లు తయారు చేసే సత్తా లేదన్న అపప్రథకు 'ఇండికా' కారు తయారీతో అడ్డుకట్ట

నష్టాల్లో ఉన్న బ్రిటన్ కంపెనీలు జాగ్వార్, లాండ్‌రోవర్‌లను కొని లాభాల బాటలోకి నడిపించిన నాయకుడు

ముంబై, అక్టోబరు 9: భారత దేశ పారిశ్రామిక చరిత్రలో ఒక శకం ముగిసింది! జాతీయ, అంతర్జాతీయ వాణిజ్య యవనికపై తనదైన ముద్ర వేసిన పారిశ్రామిక వేత్త, చైర్మన్ ఎమెరిటస్ ఆఫ్ టాటా సన్స్.. రతన్ నావల్ టాటా (86) ఇక లేరు. వంటగదిలో వాడే ఉప్పు నుంచి.. ఆకాశంలో ఎగిరే విమానాల దాకా.. ఎన్నెన్నో ఉత్పత్తులు, సేవలతో భారతీయుల నిత్యజీవితంలో భాగమైన టాటా సామ్రాజ్యాన్ని రెండు దశాబ్దాలపాటు నడిపించిన ఆ పారిశ్రామిక దిగ్గజం.. మరలిరాని లోకాలకు తరలిపోయారు! రక్త పోటు స్థాయిలు అకస్మాత్తుగా పడిపోవడంతో మూడు రోజుల క్రితం ముంబైలోని బ్రీచ్‌క్యాండీ ఆస్పత్రిలో చేరిన రతన్ టాటా ఆరోగ్య పరిస్థితి విషమించి.. బుధవారం రాత్రి తుది శ్వాస

మిగతా 2వ పేజీలో...

నోటిఫికేషన్లకు బ్రేక్!

ఎస్సీ వర్గీకరణపై కమిషన్ నివేదిక వచ్చాకే కొత్తవి జారీ

హైకోర్టు మాజీ జడ్జితో ఏకసభ్య జ్యుడీషియల్ కమిషన్.. 60 రోజుల్లో నివేదిక సమర్పించేలా చర్యలు చేపట్టాలి

బీసీ సామాజిక, ఆర్థిక, కుల సర్వేకూ 2 నెలల గడువు.. బీసీ కమిషన్‌కు, ప్రణాళిక విభాగానికి సమన్వయకర్త

డిసెంబరు 9లోపు సర్వే పూర్తయితే వెంటనే స్థానిక ఎన్నికలు.. మంత్రులు, అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్



ఉపాధ్యాయ పోస్టుకు ఎంపికైన ఓ అభ్యర్థికి ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాన్ని అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ. చిత్రంలో మంత్రులు సీతక్క, పొన్నం, దుద్దిళ్ల, పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉద్యోగ నోటిఫికేషన్లకు రెండు నెలలపాటు బ్రేక్ పడనుంది. ఎస్సీ కులాల వర్గీకరణకు సంబంధించి ఏకసభ్య జ్యుడీషియల్ కమిషన్ నివేదిక వచ్చాకే కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా ఎస్సీ కులాల వర్గీకరణ అమలుకు ఏకసభ్య జ్యుడీషియల్ కమిషన్‌ను నియామకాన్ని వెంటనే చేపట్టడంతోపాటు 60 రోజుల్లోనే కమిషన్ నివేదిక సమర్పించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. దీంతోపాటు బీసీల సామాజిక, ఆర్థిక, కుల సర్వే నివేదికను కూడా 60 రోజుల్లో ప్రభుత్వానికి సమర్పించేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. ఈ మేరకు బుధవారం సచివాలయంలో ఎస్సీ కులాల వర్గీకరణ అమలు, బీసీ సామాజిక, ఆర్థిక, కుల సర్వేపై మంత్రులు, అధికారులతో ముఖ్యమంత్రి

మిగతా 13వ పేజీలో...

ప్రజా ప్రభుత్వాన్ని పడగొడతామంటున్నారు 12

తెలంగాణ సమాజంపై ఎందుకింత కోపం?

మేం నోటిఫికేషన్లు వేస్తే అడ్డుకుంటున్నారు

తెలంగాణ పునర్నిర్మాణంలో టీచర్లే కీలకం

నిరుపేదల పిల్లలూ ప్రైవేటు స్కూళ్లకు వెళ్తున్నరు

ఈ పరిస్థితులు మారాలి.. ప్రభుత్వ టీచర్లు ఆ బాధ్యత తీసుకోవాలి: సీఎం రేవంత్‌రెడ్డి

కొత్త టీచర్లకు నియామక పత్రాల అందజేత

ఎమ్మార్పీఎస్ ర్యాలీ ఉద్రిక్తం 12

ఎస్సీ వర్గీకరణ చేయకుండా టీచర్ల నియామక పత్రాలు ఇవ్వడంపై నిరసన

కార్యకర్తలు, పోలీసుల మధ్య వాగ్వాదం, తోపులాట

మందకృష్ణ మాదిగ సహా పలువురి అరెస్టు

సన్నబియ్యం 67% ఇవ్వలేం!

58% ఔట్ టర్న్‌పై రూ.300 నష్టపరిహారం ఇవ్వాలి 14

క్యాబినెట్ సబ్‌కమిటీకి రాష్ట్రరైస్‌మిల్లర్ల స్పష్టీకరణ

మిగిలిన అర్హులందరికీ వారంలో రుణమాఫీ

మంత్రి కోమటిరెడ్డి 13



సహారా ఎడారిలో వరదలు

మొరాకోలో భారీ వర్షం

ఎడారిలో ప్రవహించిన వరద

గత 50 ఏళ్లలో ఇదే తొలిసారి

కరువు ప్రాంత ప్రజలకు ఊరట

అరుదైన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ 14

దీపావళికి 2 డీఏలు!

ఉద్యోగులకు ఇచ్చే యోచనలో సర్కారు

ఇప్పటికే పెండింగ్‌లో 4.. ఈ ఏడాది జూలైతో జత కలిసిన ఐదో డీఏ

కనీసం 3 ఇవ్వాలంటున్న ఉద్యోగులు.. ఒక్కో డీఏ చెల్లింపునకు ఏటా 1200కోట్లు

ఎరియర్స్‌తో కలిపి 4 డీఏలు ఇస్తే ప్రభుత్వంపై ఏటా రూ.7900 కోట్ల భారం

హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏల్లో రెండింటిని దీపావళి నాటికి ఇవ్వాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ ఏడాది జూలై 1న ఐదో డీఏ కూడా జత కలవడంతో.. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే ఇవ్వాల్సిందేనని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. ఇందు కోసం సంఘాల ప్రతినిధులు నిత్యం ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నారు. తమ సమస్యలు పరిష్కరించాల్సిందిగా కోరుతూ పది నెలలుగా ప్రభుత్వం



మిగతా 13వ పేజీలో...

'ధరణి' పోర్టల్‌తో తహసీల్దార్ దగా

36 ఎకరాల ప్రభుత్వ భూమి బదలాయింపు 13

ఆపరేటర్‌తో కలిసి అక్రమాలు

'రైతుబంధు' రూ.14 లక్షలను పంచుకున్న ఇరువురు

జైలులో ఆపరేటర్.. తహసీల్దార్‌కు 14 రోజుల రిమాండ్



నేడు, రేపు భారీ వర్షాలు 12

పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ

2028 డిసెంబరు వరకూ పోషక బియ్యం

17,082 కోట్ల వ్యయంతో సరఫరా

లోథాల్‌లో ఎన్‌ఎంహెచ్‌సీ అభివృద్ధి

కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలు

13

స్వయంకృతం

హరియాణాలో కాంగ్రెస్ ఓటమిపై ఇండియా కూటమి పార్టీల విమర్శలు

విజయాన్ని అపజయంగా ఎలా మల్చుకోవచ్చో కాంగ్రెస్‌ను చూసి నేర్చుకోవాలి

అతివిశ్వాసం, వర్గపోరు ఓడించింది: శివసేన

వ్యూహాల్ని కాంగ్రెస్ సమీక్షించుకోవాలి: సీపీఐ

అహంకారంతోనే ఓటమి: తృణమూల్

కలిసి పోటీ చేస్తే ఫలితం వేరుగా ఉండేది

ఢిల్లీలో కాంగ్రెస్‌తో పొత్తు ఉండదు: ఆప్

ఈవీఎంల హ్యాకింగ్.. ఈసీతో కాంగ్రెస్ భేటీ

న్యూఢిల్లీ, అక్టోబరు 9: హరియాణాలో గెలుస్తుందనుకున్న కాంగ్రెస్ ఓడిపోవటం ఆ పార్టీ స్వయంకృతమని ఇండియా కూటమి పార్టీలు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించాయి. మిత్రపక్షాలతో పొత్తు పెట్టుకొని ఉంటే గెలుపు సాధ్యమయ్యేదని పేర్కొన్నాయి. శివసేన (యూబీటీ) స్పందిస్తూ.. విజయాన్ని అపజయంగా ఎలా మల్చుకోవచ్చో కాంగ్రెస్‌ను చూసి నేర్చుకోవాలని ఎద్దేవా చేసింది. చేతికందివచ్చిన విజయాన్ని చేజేతులా దూరం చేసుకుందని దుయ్యబట్టింది. ఈ మేరకు పార్టీ


మిగతా 2వ పేజీలో...



Hero MotoCorp Ltd. Regd. Office: The Grand Plaza, Plot No.2, Nelson Mandela Road, Vasant Kunj Phase - II, New Delhi - 110070, India. | CIN: L35911DL1984PLC017354 | For further information, contact your nearest Hero MotoCorp authorised outlet visit us on www.HeroMotoCorp.com. Accessories and features shown may not be a part of standard fitment. Always wear a helmet while riding a two-wheeler. **As per the cumulative dispatch number till March 2023. #Highest sales for any 2 Wheeler Corporate Entity in the world for Calendar Year 2022 - Data source: DNA Consult & Advisory's report Assessment of Global Two Wheelers Market (CY22). ^^Based on offers from empanelled dealers on Wheels of Trust platform. ^Finance offer is at the sole discretion of the Financier, subject to its respective T&Cs. Available at select dealerships. *Offer amount and combination of offer may vary for model/variant and states and it is applicable on select models only. For more details, please visit your nearest authorised Hero outlet. ##Available on purchase of Hero Good Life membership. Applicable on select models only.

AUTHORISED DEALERS – HYDERABAD: GEETHA HERO, SUCHITRA - PH: 9289923134. TADUBAND - PH: 9515408055. MALAKPET, SRI LAKSHMI HERO - PH: 9289922155. SAROORNAGAR - PH: 9246223479. VANASTHALIPURAM - PH: 9246223423. ERRAGADDA, BHANU HERO - PH: 9289922148. KUKATPALLY - PH: 9392525885. MIYAPUR - PH: 8790667999. R.P. ROAD, MODY HERO - PH: 9289922146. HABSIGUDA, PHOENIX HERO - PH: 9289922515. RAMANTHAPUR - PH: 9246394475. NAGOLE - PH: 9246394476. KUSHAIGUDA - PH: 9246824193. NAMPALLY, DEALWEL HERO - PH: 9289922827. ASIFNAGAR - PH: 9110704727. NARSINGI - PH: 97054 27429. BIBINAGAR - PH: 6305974768. ATTAPUR- PH: 9177888606. PATANCHERU, SRI VENKANNA HERO - PH: 9289922150. SERILINGAMPALLY- PH: 9640515185. BAHADURPURA, SOWJANYA HERO - PH: 9289923133. HI-TECH CITY, PHOENIX HERO - PH: 9289922759. HAFEEZPET - PH: 7799017976. GOPANNAPALLI - PH: 7093947427. MALKAJGIRI, KRISHNA SAI HERO - PH: 9289922972. SOMAJIGUDA, LAKSHMI HERO - PH: 9289922147. NARAYANGUDA, VENKATESHWARA HERO - PH: 9289922145, 7799884320. PRAGNAPUR - PH: 8886642271. SANGAREDDY, PRUDHVI HERO - PH: 9821697396.


రతన్ టాటా కన్నుమూత




రతన్ టాటా 1937 - 2024

(మొదటి పేజీ తరువాయి)

విడిచారు. తన ఆరోగ్యంపై సోషల్ మీడియాలో ఆందోళన వ్యక్తం కావడంతో.. 'నేను బాగానే ఉన్నా.. ఆందోళన వద్దు' అంటూ ప్రకటన చేసిన మూడురోజులకే ఆయన కన్నుమూశారు. టాటా గ్రూప్ వ్యవస్థాపకుడు జంషెట్జీ టాటాకు ముని మనవడైన రతన్ టాటా 1937 డిసెంబరు 28న ముంబైలో జన్మించారు. తల్లిదండ్రులు సూని టాటా, నావల్ టాటా.. ఆయన పుట్టిన పదేళ్లకు విడిపోవడంతో, రతన్ టాటా తన నాయనమ్మ అయిన నవాజ్‌బాయ్ టాటా వద్ద పెరిగారు. ముంబై, సిమ్లాల్లో కొంతకాలం చదివిన అనంతరం.. ఉన్నత విద్యాభ్యాసం నిమిత్తం అమెరికాకు వెళ్లారు. అమెరికాలోని రివర్‌డేల్ కంట్రీ హైస్కూల్‌లో పట్టా పుచ్చుకున్న అనంతరం కార్నెల్ యూనివర్సిటీలో ఆర్కిటెక్చర్ అండ్ స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ విద్యను అభ్యసించారు. 1959లో డిగ్రీ పట్టా పుచ్చుకున్న రతన్ టాటా.. 2008లో అదే కార్నెల్ యూనివర్సిటీకి 50 మిలియన్ డాలర్ల విరాళం ఇచ్చారు. ఆ విశ్వవిద్యాలయ చరిత్రలోనే అతిపెద్ద అంతర్జాతీయ దాతగా నిలిచారు. అమెరికాలో పట్టభద్రుడైన అనంతరం.. 1961లో ఆయన టాటా గ్రూపులో చేరారు. తొలుత టాటా స్టీల్‌లో చిరుద్యోగిగా చేరిన ఆయన గ్రూపులోని వివిధ కంపెనీల్లో విభిన్న హోదాల్లో పనిచేశారు. 1971లో నేషనల్ రేడియో అండ్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ డైరెక్టర్ ఇన్‌చార్జిగా.. 1981లో టాటా ఇండస్ట్రీస్ చైర్మన్‌గా.. ఇలా పలు బాధ్యతలు నిర్వర్తించారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండే విద్యార్థిలాగా నిరంతరం ఏదో ఒకటి నేర్చుకుంటూ ఉండేవారు. ఈ క్రమంలోనే 1975లో అమెరికాలోని హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ పూర్తిచేశారు. 1991లో జేఆర్‌డీ టాటా అనంతరం టాటా సన్స్ చైర్మన్‌గా పగ్గాలు చేపట్టి.. 2012 డిసెంబరు 28వ తేదీన రిటైరయ్యేదాకా సంస్థను సమర్థంగా నడిపారు. ఆ తర్వాత మళ్లీ 2016 అక్టోబరు నుంచి 2017 ఫిబ్రవరి దాకా తాత్కాలిక చైర్మన్‌గా ఉన్నారు. 1991లో ఆయన పగ్గాలు చేపట్టే సమయానికి టాటా గ్రూప్‌లో ఉన్న కంపెనీల సంఖ్య దాదాపు 250 దాకా ఉండేది. కానీ, ఆయన వాటిని 98కి తగ్గించి సంస్థ సామర్థ్యాన్ని పెంచారు. టాటా గ్రూపు.. హై టెక్నాలజీ వ్యాపారాల్లో ప్రవేశించేందుకు బీజం వేశారు. టాటా గ్రూప్ ఆయన హయాంలోనే 10 వేల కోట్ల డాలర్ల వ్యాపార సామ్రాజ్యంగా అవతరించింది. తన సమర్థ నాయకత్వంలో ఆయన టాటా మోటార్స్ టాటా స్టీల్, టీసీఎస్, టాటా పవర్, టాటా గ్లోబల్ బెవరేజెస్, టాటా కెమికల్స్, ఇండియన్ హోటల్స్, టాటా టెలీ సర్వీసెస్ సంస్థలను అగ్రశ్రేణి సంస్థలుగా తీర్చిదిద్దారు. టీసీఎస్‌ను.. దేశంలో వెయ్యి కోట్ల డాలర్ల వార్షిక ఆదాయం మైలురాయి దాటిన తొలి భారత ఐటీ కంపెనీగా నిలిపారు. వ్యాపారవేత్తగానే కాదు.. తన ఆదాయంలో 60 నుంచి 65 శాతం మేర వివిధ దాతృత్వ కార్యక్రమాలకు కోసం ఉదారంగా ఇచ్చేసి ప్రజల హృదయాల్లో నిలిచిపోయారు. భారత ప్రభుత్వం ఆయనను 2000 సంవత్సరంలో పద్మభూషణ్‌తో, 2008లో పద్మవిభూషణ్‌తో గౌరవించింది. మరెన్నో జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలను, గౌరవ డాక్టరేట్లను రతన్ టాటా అందుకున్నారు.



యుక్త వయస్సులో..



ఎఫ్17 యుద్ధ విమానంలో..



పద్మ విభూషణ్ అందుకుంటూ..



శ్రీవారి సన్నిధిలో..

బహుముఖ విస్తరణ

రతన్ టాటా హయాంలో టాటా గ్రూపు దేశ, విదేశాల్లో అనేక కొత్త వ్యాపారాల్లోకి విస్తరించింది. అన్నిటి కంటే ముఖ్యంగా 'ఇండికా' కారును దేశీయంగా అభివృద్ధి చేయడం ద్వారా, భారత ఆటోమొబైల్ కంపెనీలకు సొంతంగా కార్లను అభివృద్ధి చేసే సత్తా లేదన్న ప్రచారానికి ఆయన తెరదించారు. నానో కారు ద్వారా రతన్ టాటా లక్ష రూపాయలకే మిడిల్ క్లాసుకు సొంత కారు భాగ్యం కల్పించారు. అలాగే తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న బ్రిటిష్ లగ్జరీ కార్ల కంపెనీ జాగ్వార్, ల్యాండ్ రోవర్‌ను కొనుగోలు చేయడం ద్వారా, టాటా మోటార్స్ కంపెనీని అంతర్జాతీయ బ్రాండ్‌గా తీర్చి దిద్దారు. బ్రిటన్‌కు చెందిన టెట్లీ టీ బ్రాండ్ కొనుగోలు రతన్ టాటా హయాంలోనే జరిగింది. టాటా స్టీల్ ఉత్పత్తి సామర్థ్యాన్ని భారీగా విస్తరించడంతో పాటు, బ్రిటిష్ స్టీల్ కంపెనీని కొనుగోలు చేసి, టాటా స్టీల్ కంపెనీ కార్యకలాపాలను యూరప్‌కూ విస్తరించారు. ఆయన ప్రారంభించిన వ్యాపారాల్లో నానో కారు, టెలికం వెంచర్లు మాత్రమే అంతగా కలిసి రాలేదు.

సైరస్ మిస్త్రీతో వైరం

తన తర్వాత టాటా గ్రూప్‌ను సమర్థుడైన వారసునికి అప్పగించాలన్న ఆలోచనతో సైరస్ మిస్త్రీని ఆ పదవికి ఎంపిక చేశారు. కాని వారి బంధం ఎంతో కాలం కొనసాగలేదు. ఆర్థికంగా కంపెనీకి గుదిబండలా మారిన 'నానో' కారు ప్రాజెక్టు ఆపేయాలని మిస్త్రీ చేసిన ప్రయత్నాలకు రతన్ టాటా అడుగడుగునా అడ్డుతగిలారు. తన మానస పుత్రిక అయిన నానో ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లో ఆపకూడదని రతన్ పట్టుబట్టడం వల్లే, మిస్త్రీ టాటా గ్రూప్‌కు దూరమయ్యారని చెబుతారు. టాటా గ్రూప్ చరిత్రలో మొదటిసారిగా పార్సీయేతర వ్యక్తి ఎన్ చంద్రశేఖరన్ టాటా గ్రూప్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించడం వెనక రతన్‌టాటా మద్దతు ఉంది.

50కి పైగా స్టార్టప్‌ల్లో పెట్టుబడులు

రతన్ టాటా సమర్థుడైన పారిశ్రామికవేత్త మాత్రమే కాదు.. తెలివైన పెట్టుబడిదారుడు కూడా. యువ, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల్ని ప్రోత్సహించే విషయంలో ఆయన ఎప్పుడూ ముందుండేవారు. వ్యక్తిగత హోదాలో ఆయన పేటీఎం, ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ, స్నాప్‌డీల్, లెన్స్‌కార్ట్ సహా 50కి పైగా స్టార్టప్‌ల్లో ఆయన ఇన్వెస్ట్ చేశారు. అవన్నీ అద్భుత విజయాలు సాధించిన సంస్థలే!

ఎయిరిండియా కొనుగోలు

టాటా గ్రూప్ నుంచి ప్రభుత్వ పరమైన ఎయిరిండియాను మళ్లీ టాటాల పట్టులోకి తేవాలన్నది రతన్ టాటా చిరకాల వాంఛ. ఇందుకు అడ్డంకులు ఎదురవడంతో సింగపూర్ ఎయిర్‌లైన్స్, మలేషియా ఎయిర్‌లైన్స్‌తో కలిసి విమానయాన రంగంలోకి ప్రవేశించారు. ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణకు అడ్డంకులు తొలగడంతో 2022లో ఆ సంస్థను మళ్లీ టాటా గ్రూప్ కొనుగోలు చేసింది. పీకల్లోతు నష్టాలతో ఉన్న ఎయిరిండియాను కొనేందుకు ఏ ప్రైవేటు సంస్థా ముందుకు రాలేదు. అయినా తమ గ్రూప్ వ్యవస్థాపకుడు జేఆర్‌డీ టాటా ప్రారంభించిన ఎయిర్ ఇండియాను మళ్లీ తమ పట్టులోకి తేవాలనే ఏకైక లక్ష్యంతోనే ఎయిర్ ఇండియాను రతన్ టాటా కొనుగోలు చేశారు. ఇపుడు ఈ సంస్థ అన్ని బాలారిష్టాలను అధిగవిస్తూ పెద్ద ఎత్తున విస్తరణకు సిద్ధమైంది.

రతన టాటా మరణంతో భారత్ ఓ గొప్ప దిగ్గజాన్ని కోల్పోయింది. దాతృత్వం, సేవా కార్యక్రమాల్లో ఆయన భాగస్వామ్యం నిరుపమానం.
- ద్రౌపది ముర్ము, రాష్ట్రపతి

రతన్ టాటా దార్శనిక వ్యాపారవేత్త. దయార్ద్ర హృదయుడు. మానవీయత మూర్తీభవించిన అసాధారణ మనిషి. సమాజాన్ని మెరుగుపరిచేందుకు నిరంతరం యత్నించారు.
- నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి

వ్యాపార రంగంలో రతన్ టాటా పాటించిన విలువలు, సామాజిక సంక్షేమం కోసం ఆయన పడిన తపన స్ఫూర్తిదాయకం. సేవకు ఆయన ప్రతిరూపం.
- రేవంత్ రెడ్డి, తెలంగాణ సీఎం

వ్యాపార దిగ్గజాన్నే కాదు గొప్ప మానవతావాదిని కూడా కోల్పోయాం. రతన్ టాటా దార్శనికత, సమైక్య భావనతో ఈ ప్రపంచంలో తమదైన ముద్ర వేశారు.
- నారా చంద్రబాబు నాయుడు, ఏపీ సీఎం

దిగ్గజ పారిశ్రామికవేత్త, నిజమైన జాతీయవాది. దేశ అభివృద్ధి కోసం ఆయన నిస్వార్థంగా అంకితమయ్యారు. మెరుగైన భారత్ కోసం ఆయన నిరంతరం తపనపడేవారు.
- అమిత్ షా, కేంద్ర హోం మంత్రి

రతన్ దార్శనికత ఉన్న మనిషి. వ్యాపారంలోనూ, దాతృత్వంలోనూ ఆయన తనదైన ముద్ర వేశారు.
- రాహుల్ గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత

ఆధునిక భారత్‌కు బాటలు పరిచిన దార్శనికుడు. రతన్ టాటా కేవలం వ్యాపారవేత్త కాదు. భారత సమగ్రతను నిలువెల్లా నింపుకున్న దిగ్గజం.
- గౌతం అదానీ, పారిశ్రామికవేత్త

రతన్ టాటా మార్గదర్శకత్వం వెలకట్టలేనిది. మహనీయులకు మరణం లేదు.
- ఆనంద్ మహీంద్రా, పారిశ్రామికవేత్త

రతన్ టాటా విఫల ప్రేమగాథ!

వ్యాపార దిగ్గజంగా ఎన్నో విజయాలు సాధించిన రతన్ టాటా కూడా ఎంతోమందిలా ఓ లవ్ ఫెయిల్యూరే.. 1962లో భారత్, చైనా దేశాల మధ్య జరిగిన యుద్ధం రతన్ టాటా ప్రేమ విఫలం కావడానికి కారణమైంది. రతన్ టాటా 25 ఏళ్ల వయస్సులో ఉన్నప్పుడు చదువు పూర్తి చేసుకుని అమెరికాలోని లాస్‌ఏంజెల్స్‌లో ఓ ఆర్కిటెక్చర్ కంపెనీలో ఉద్యోగంలో చేరారు. ఆ సమయంలో అక్కడి ఓ మహిళతో ప్రేమలో పడ్డారు. ఆమెను పెళ్లి చేసుకుని అక్కడే స్థిరపడిపోవాలని నిర్ణయించుకున్నారు. అదే సమయంలో ఏడేళ్లుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న నాయనమ్మతో కొద్ది రోజులు గడపడం కోసం ఆయన స్వదేశానికి వచ్చారు. తన కోసం తన ప్రేయసి కూడా భారత్ వస్తుందని ఆశించారు. కానీ, భారత్- చైనా యుద్ధంతో ఆ మహిళ తల్లిదండ్రులు ఆమె భారత్ వెళ్లేందుకు అంగీకరించలేదు. దీంతో వారి ప్రేమకథ ముగిసింది. ఈ తొలి ప్రేమ ఆయనకు ఓ జ్ఞాపకంగా మిగిలిపోయింది. తన ప్రేమకథను పలుమార్లు బయటపెట్టిన రతన్ టాటా ఆ మహిళ ఎవరనేది ఎప్పుడూ చెప్పలేదు. ఆ తర్వాత 1970ల్లో హిందీ చిత్రసీమలో ప్రముఖ నటీమణిగా వెలుగొందిన సిమీ గరేవాల్‌కు రతన్ దగ్గరయ్యారు. వారి అనుబంధం పెళ్లిపీటల వరకు వెళుతుందని ఆశించినా అది జరగలేదు. సిమీ మరొకరిని పెళ్లాడగా రతన్ టాటా ఒంటరయ్యారు. ఇలా మొత్తం నాలుగు సందర్భాల్లో ఆయన పెళ్లిపీటలు ఎక్కేందుకు సిద్ధమైనా వేర్వేరు కారణాలతో అవేవి జరగక ఆజన్మబ్రహ్మచారిగానే ఉండిపోయారు.

టాటా వారసులెవరు?

రతన్ టాటా మరణంతో ఈ సామ్రాజ్యం పగ్గాలు చేపట్టేందుకు అవకాశాలు, అర్హతలున్న టాటా కుటుంబ వారసుల జాబితాలో నోయెల్ టాటా పేరు ప్రధానంగా చెప్పుకోవాలి. రతన్ టాటా సవతి సోదరుడు నోయల్ టాటా. గ్రూప్ రిటైల్ వర్తక విభాగమైన ట్రెంట్‌తోపాటు పలు వ్యాపారాల్లో ప్రస్తుతం ఆయన క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. నోయెల్ సంతానమైన మాయ, నెవిల్లే, లేహ్ టాటా సైతం పలు టాటా కంపెనీల్లో మేనేజ్‌మెంట్ బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

మధ్య తరగతి కారు కల నానో

కారులో ప్రయాణించాలనే భారతీయ మధ్య తరగతి కుటుంబాల కల నెరవేర్చాలని దిగ్గజ పారిశ్రామికవేత్త రతన్ టాటా సంకల్పించారు. ఆయన ఈ సంకల్పమే 'నానో' కారు రూపకల్పనకు దారితీసింది. ఈ కారును 2008లో మార్కెట్‌లోకి తెచ్చారు. కేవలం రూ. 1,00,000 ధరే నిర్ణయించి ప్రపంచంలోనే చౌకైన కారుగా ప్రకటించారు. ఇలా అప్పటికి ధనిక వర్గాలకే పరిమితం అయిన కారును మధ్య తరగతి ప్రజలకూ అందుబాటులోకి తెచ్చి వారి కల నెరవేర్చారు. ఈ కారు బయటకు వచ్చాక ఆరంభ కష్టాలు ఎదుర్కొన్నా.. ఆటోమొబైల్ మార్కెట్లో సంచలనం సృష్టించింది. ఆటోమొబైల్ పరిశ్రమ కేవలం ఉన్నత వర్గాల కోసమే కార్లను తయారుచేయడం కాకుండా మధ్య తరగతి, దిగువ వర్గాలనూ దృష్టిలో ఉంచుకుని వాహనాలను తయారుచేయాలన్న చర్చకు దారితీసింది. ఈ విషయంలో రతన్ టాటా విజన్ స్పష్టంగా ఉంది... అదేమిటంటే మధ్య తరగతి స్థోమతకు తగ్గ కారును వారి ముందుంచడం... 'నానో'తో ఆయన అది పూర్తిచేశారు.



నానో కారు ప్రారంభోత్సవంలో అప్పటి గుజరాత్ సీఎం మోదీతో రతన్ టాటా

స్వయంకృతం

(మొదటి పేజీ తరువాయి)



అధికార పత్రిక సామనాలో బుధవారం సంపాదకీయంలో తీవ్ర విమర్శలు చేసింది. 'హరియాణాలో కాంగ్రెస్ అపజయానికి కారణం ఆ పార్టీ ప్రదర్శించిన అతి విశ్వాసం. రాష్ట్రంలో బీజేపీ వ్యతిరేక వాతావరణం ఏ స్థాయిలో ఉందంటే.. పలు గ్రామాల్లోకి ఆ పార్టీకి చెందిన అభ్యర్థులు, మంత్రులు వెళ్లటానికి కూడా సాహసించలేదు. స్థానికులు వారు రాకుండా అడ్డుకున్నారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని ఎవరూ అనుకోలేదు. ఇటువంటి సానుకూల పరిస్థితి ఉన్నా కూడా కాంగ్రెస్ విజయం సాధించలేకపోయింది' అని పేర్కొంది. హరియాణా కాంగ్రెస్‌లో ఉన్న వర్గపోరు కూడా ఆ పార్టీ కొంప ముంచిందని తెలిపింది. కీలకనేతగా ఉన్న కుమారి షెల్జాను భూపీందర్‌సింగ్ హుడా, ఆయన అనుచరులు బహిరంగంగా అవమానిస్తున్నా కూడా పార్టీ అధిష్ఠానం అడ్డుకోలేదని వెల్లడించింది. ఇతర కాంగ్రెస్ నేతలతో హుడా సహాయనిరాకరణ, అభ్యర్థులను తన ఇష్టానుసారం ఎంపిక చేయటం కాంగ్రెస్ ఓటమికి ప్రధాన కారణాలని తెలిపింది. కాంగ్రెస్‌లో ఎప్పుడూ ఇలాగే ఉంటుందని పేర్కొంటూ గత ఏడాది జరిగిన ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలను సామనా ప్రస్తావించింది. ఆ రాష్ట్రాల్లో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని ఎవరూ అనుకోలేదని, కానీ, ముఠా రాజకీయాల కారణంగా కాంగ్రెస్ విజయాన్ని జారవిడుచుకుందని విశ్లేషించింది. శివసేన (యూబీటీ) నాయకుడు సంజయ్‌రౌత్ కూడా హరియాణా ఫలితంపై స్పందిస్తూ.. ఇండియా కూటమి పార్టీలైన ఎస్పీ, ఆప్‌లతోపాటు ఇతర చిన్న పార్టీలతో పొత్తు పెట్టుకొని ఉంటే కాంగ్రెస్ గెలిచి ఉండేదన్నారు. ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయాలనుకుంటే ఆ విషయాన్ని కాంగ్రెస్ ప్రకటించాలని, అప్పుడు ఇండియా కూటమి పార్టీలు కూడా తమ రాష్ట్రాల్లో తమవైన వ్యూహాలను సిద్ధం చేసుకుంటాయన్నారు. బీజేపీ బాగా పోరాడిందని, ఓడిపోయే యుద్ధాన్ని కూడా గెల్చుకుందని అభినందనలు తెలిపారు.

ఏ ఎన్నికనూ తేలిగ్గా తీసుకోవద్దు: కేజ్రీవాల్

ఏ ఎన్నికనూ తేలిగ్గా తీసుకోవద్దని, ప్రతి నియోజకవర్గంలోనూ విజయం కోసం శాయశక్తులా పోరాడాలని.. హరియాణా ఎన్నికల పలితం నేర్పే పాఠం ఇదేనని ఆమ్‌ఆద్మీపార్టీ అధినేత, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ చెప్పారు. ఇండియా కూటమి పార్టీలతో పొత్తు పెట్టుకోకుండా ఒంటరిగా పోటీ చేయటం వల్లనే కాంగ్రెస్ పరాజయం పాలైందని సీపీఐ ప్రధాన కార్యదర్శి డీ రాజా పేర్కొన్నారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే కాంగ్రెస్‌పై విమర్శలు సంధించారు. 'ఈ రకమైన అహంకారమే ఎన్నికల్లో ఓటమికి కారణమవుతుంది. ఏదైనా రాష్ట్రంలో గెలిచే పరిస్థితులు ఉంటే అక్కడి స్థానిక పార్టీతో పొత్తు పెట్టుకోం. పార్టీ బలంగా లేని రాష్ట్రాల్లో మాత్రం స్థానిక పార్టీ మనకు సీట్లు ఇవ్వాలి. నేర్చుకోండి' అంటూ కాంగ్రెస్ తీరును ఎద్దేవా చేశారు.

మా పోరాటాన్ని కొనసాగిస్తాం: రాహుల్

న్యూఢిల్లీ, హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జమ్ము, కశ్మీర్‌లో ఇండియా కూటమి గెలుపుని భారత రాజ్యాంగ, ప్రజాస్వామ్య, ఆత్మగౌరవ విజయంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అభివర్ణించారు. హరియాణాలో ఊహించని విధంగా వచ్చిన ఎన్నికల ఫలితాలపై విశ్లేషణ చేస్తున్నట్లు బుధవారం 'ఎక్స్' వేదికగా తెలిపారు. జమ్ము, కశ్మీర్, హరియాణా ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. హక్కులు, సామాజిక, ఆర్థిక న్యాయాన్ని సాధించేందుకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని, ప్రజల గళాన్ని వినిపిస్తామని రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అంతర్గత విభేదాల వల్లే బీజేపీ విజయం సాధించిందని మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ అన్నారు.

ఢిల్లీలో కాంగ్రెస్‌తో పొత్తు ఉండదు: ఆప్

న్యూఢిల్లీ, అక్టోబరు 9: త్వరలో జరుగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకోబోమని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ప్రకటించింది. కాంగ్రెస్ అతి విశ్వాసంతో హరియాణాలో సీట్ల సర్దుబాటుకు విఘాతం కలిగించడం వల్లే అక్కడ ఓటమి చవిచూడాల్సి వచ్చిందని విమర్శించింది. హరియాణాలో ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టంగా ఉన్నప్పటికీ బీజేపీ వరుసగా మూడోసారి అక్కడ గెలుపొందడానికి కారణమదేనని తేల్చిచెప్పింది. ఆప్ అధినేత కేజ్రీవాల్ కూడా హరియాణాలో ఓటమిపై కాంగ్రెస్ తీరును నిందించారు.

కాంగ్రెస్‌ది విద్వేష రాజకీయం: మోదీ

నాగపూర్, అక్టోబరు 9: కాంగ్రెస్ విద్వేష రాజకీయం చేస్తోందని ప్రధాని మోదీ ఆరోపించారు. కులాల పేరిట హిందువులను విభజించాలని చూస్తోందని, ఇందుకోసం విషం చిమ్ముతోందన్నారు. ముస్లింలను కేవలం ఓటుబ్యాంకుగా పరిగణిస్తోందని విమర్శించారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు కోసం ఆ పార్టీ పన్నిన ఎత్తులన్నిటినీ ఆ రాష్ట్ర ప్రజలు చిత్తుచేశారని తెలిపారు. మహారాష్ట్ర ప్రజలు కూడా ఆ పార్టీ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బుధవారం ఆయన ఢిల్లీ నుంచి మహారాష్ట్రలో రూ.7,500 కోట్ల విలువైన ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నాగపూర్‌లో హాజరైన ప్రజలు, ప్రముఖులనుద్దేశించి ప్రసంగించారు. ఓబీసీలు, దళితులు బీజేపీతోనే ఉన్నారని.. హరియాణాలో బీజేపీ హ్యాట్రిక్ విజయం దేశవ్యాప్తంగా ప్రజాభిప్రాయానికి అద్దం పడుతోందని తెలిపారు. 'కాంగ్రెస్ తమ రిజర్వేషన్‌ను లాక్కుని తన ఓటుబ్యాంకుకు ఇస్తుందని దళితులు గ్రహించారు. 34 పంటలకు మద్దతు ధర ప్రకటించిన బీజేపీతో రైతులు సంతోషంగా ఉన్నారు' అన్నారు. 'మనమంతా జాగరూకులమై ఉండాలి. మహారాష్ట్రలోని మహాయుతి (బీజేపీ, షిండే శివసేన, అజిత్ పవార్ ఎన్‌సీపీ) ప్రభుతానికి ఈ దఫా మరింత మెజారిటీ ఇవ్వాలి' అని ప్రజలను కోరారు. నవంబరులోపు ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి.

ఈవీఎంలను హ్యాక్ చేశారని ఈసీకి కాంగ్రెస్ ఫిర్యాదు

న్యూఢిల్లీ, అక్టోబరు 9: హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సంఘాన్ని కలిసి ఫిర్యాదు చేసింది. ఏఐసీసీ నేతలు కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రతినిధుల బృందం ఢిల్లీలోని ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయానికి వెళ్లి లిఖితపూర్వక ఫిర్యాదు చేసింది. కనీసం 20 నియోజకవర్గాల్లో ఈవీఎంలను హ్యాక్ చేశారని చెబుతూ 7 నియోజకవర్గాల్లో జరిగిన అవకతవకలపై ఆధారాలు సమర్పించినట్లు కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్ ఖేరా వెల్లడించారు. మిగతా 13 నియోజకవర్గాలకు సంబంధించిన ఆధారాలు 48 గంటల్లో సమర్పిస్తామని ఈసీకి తెలిపామన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులు ఓడిన చోట్ల ఈవీఎంల బ్యాటరీ ఛార్జింగ్ 99% చూపాయని, అభ్యర్థులు గెలిచిన చోట్ల ఈవీఎంల బ్యాటరీ ఛార్జింగ్ 60%-70% మాత్రమే ఉందని ఈసీ దృష్టికి తీసుకెళ్లామన్నారు.

బీజేపీకి ముగ్గురు స్వతంత్రుల మద్దతు

న్యూఢిల్లీ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): హరియాణాలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన భారత అత్యంత సంపన్న మహిళా ఎమ్మెల్యే సావిత్రి జిందాల్ సహా ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు బీజేపీకి మద్దతు తెలిపారు. సావిత్రి ఆమె తనయుడు, బీజేపీ ఎంపీ నవీన్‌తో కలిసి బుధవారం కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో భేటీ అయ్యారు. బీజేపీ టికెట్ ఆశించిన సావిత్రి జిందాల్.. టికెట్ దక్కకపోవడంతో హిసార్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. సావిత్రితో పాటు మరో ఇద్దరు స్వతంత్ర ఎమ్మెల్యేలు రాజేశ్ జూన్, దేవేందర్ కద్యాన్ కూడా బీజేపీకి మద్దతు తెలిపారు.

అతిషి సామగ్రి బయటపడేసి సీఎం నివాసాన్ని ఖాళీ చేయించి..

ఢిల్లీ సీఎం అతిషి తన అధికార నివాసంలోకి అడుగుపెట్టిన రెండురోజులకే చేదు అనుభవాన్ని ఎదుర్కొన్నారు. ఢిల్లీ ఎల్జీ వినయ్ సక్సేనా ఆదేశాల మేరకు అధికారులు అతిషి అధికార నివాసంలోని వస్తువులన్నింటినీ బయటపడేశారు. 'దేశంలో తొలిసారిగా ఒక సీఎంను అధికార నివాసం నుంచి బలవంతంగా ఖాళీ చేయించారు. బీజేపీ నేతల ఆదేశాల మేరకే ఎల్జీ ఈ చర్యకు పాల్పడ్డారు' అని సీఎం కార్యాలయం పేర్కొంది. కేజ్రీవాల్ తాను సీఎంగా ఉన్న కాలంలో ఉత్తర ఢిల్లీ సివిల్ లైన్స్ ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్డులోని ఆరో నంబర్ అధికార గృహంలో నివసించారు. ఆయన రాజీనామా తర్వాత సీఎం అయిన అతిషి రెండురోజుల క్రితమే అధికార గృహంలోకి మారారు. అయితే కేజ్రీవాల్ ఆ ఇంటిని ఖాళీ చేస్తున్నట్లు అధికారికంగా చెప్పలేదని, అందులో అతిషి ఉండటం నిబంధనలను అతిక్రమించడమేనని అధికారులు తెలిపారు.



సున్నాకే పరిమితమైనా బుద్ధి మారలేదు

- బీఆర్ఎస్ నేతలపై మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజం
- ప్రతిపక్షంగా మంచి సూచనలు ఇవ్వాలని హితవు
- గాంధీభవన్‌లో 'మంత్రితో ముఖాముఖి'కి హాజరు

హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ప్రజలు సున్నాకే పరిమితం చేసినా.. ఆ పార్టీ నేతల బుద్ధి మారలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. బాధ్యత గల ప్రతిపక్షంగా ప్రభుత్వానికి మంచి సూచనలు, సలహాలు ఇవ్వాలని హితవు పలికారు. పదేళ్ల పాటు అధికారంలో ఉండి ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని కేటీఆర్‌ను నిలదీశారు. గాంధీభవన్‌లో 'మంత్రితో ముఖాముఖి'లో భాగంగా బుధవారం పార్టీ నేతలు, కార్యకర్తల నుంచి ఫిర్యాదులు, వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందంటూ కొంత మంది ఇష్టంవచ్చినట్లు మాట్లాడుతున్నారని, ఇకనైనా వారు పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ పది నెలల పాలనపై చర్చకు సిద్ధమంటున్న జగదీశ్‌రెడ్డి.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏం చేశారో చెప్పాలని సవాల్ విసిరారు. బీజేపీ తానా అంటే బీఆర్ఎస్ తందానా అన్నట్టుగా వ్యవహరిస్తోందన్నారు. ఎవరెన్ని సెటైర్లు వేసినా ఉద్యోగ నియామకాలు చేపడతామన్నారు. 'మంత్రితో ముఖాముఖి'లో ఇందిరమ్మ ఇళ్ల త్వరగా ఇవ్వాలని, ఉద్యోగ నియామకాలను వేగవంతం చేయాలని విజ్ఞప్తులు అందాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగా తాము చెప్పిందే వినాలని కాకుండా.. ప్రజలందరి అభిప్రాయాలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మంత్రితో ముఖాముఖి కార్యక్రమంలో 179 మంది వినతి పత్రాలు అందజేశారు. పలు విజ్ఞప్తులపై జిల్లాల అధికారులకు ఫోన్ చేసిన మంత్రి.. సదరు సమస్య పరిష్కరించాలని సూచించారు. కాగా, దసరా నేపథ్యంలో శుక్రవారం జరగాల్సిన 'మంత్రితో ముఖాముఖి' రద్దయింది. మళ్లీ బుధవారం ఈ కార్యక్రమం ఉంటుందని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.



కార్యకర్తల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

నేడు అభిషేక్ మను సింఘ్వీకి టీపీసీసీ సన్మానం

హైదరాబాద్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడు అభిషేక్ మను సింఘ్వీని గురువారం టీపీసీసీ లీగల్ సెల్ ఘనంగా సన్మానించనుంది. కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. కాగా, తెలంగాణ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన అభిషేక్ మను సింఘ్వీ బుధవారం హైదరాబాద్ వచ్చారు. శంషాబాద్ విమానాశ్రయంలో ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్‌రావు ఆయనకు స్వాగతం పలికారు.

సీఎంఆర్ డెలివరీ గడువు ఈ నెల 31 వరకు పొడిగింపు

హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : 2023-24 సంవత్సరానికి సంబంధించి ఖరీఫ్, రబీ రెండు సీజన్లలో పెండింగ్‌లో ఉన్న కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) డెలివరీ గడువును కేంద్ర ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు పొడిగించింది. సెప్టెంబరు నెలాఖరు వరకు సీఎంఆర్ తుది గడువు ఉండగా... గత నెల 13వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం గడువు పొడిగించాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. సుమారు 29 లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బకాయిలు ఉండగా... మిల్లింగ్‌కు ఆలస్యమవుతున్నదని గడువు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం లేఖలో పేర్కొంది. దీనికి స్పందించిన కేంద్రం ఈ నెలాఖరు(అక్టోబరు 31) వరకు గడువు ఇచ్చింది. భవిష్యత్తులో గడువు పొడిగింపు ఉండదని, ఈ నెలాఖరులోపు లక్ష్యాన్ని పూర్తిచేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

శ్లో॥ అంతకాలే చ మామేవ స్మరన్ముక్త్వా కళేబరమ్ !
య ప్రయాతి సమద్భావం యాతి నాస్త్యత్ర సంశయ: !

పెద్దకర్మ



కీ.శే. శ్రీ నలమాద పురుషోత్తమ్ రెడ్డి

స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ క్రోధినామ సంవత్సర భాద్రపద బహుళ ద్వాదశి అనగా
29 సెప్టెంబర్ 2024 ఆదివారం ఉదయం గం. 7:30 ని.లకు

శ్రీ నలమాద పురుషోత్తమ్ రెడ్డి గారు

స్వర్గస్థులైనారని తెలుపుటకు చింతిస్తున్నాము.

వారి పెద్దకర్మ ది. 10 అక్టోబర్ 2024 గురువారం మధ్యాహ్నం గం. 12 ల నుండి
హైటెక్స్, హైదరాబాద్ నందు జరుపబడును. కావున తెలియపరచడమైనది.

ఇట్లు

భార్య : నలమాద ఉషాదేవి

కుమారులు - కోడళ్ళు :

నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి - పద్మావతి   నలమాద గౌతమ్ కుమార్ - సుమ

కుమార్తె : మల్లిపెద్ది హితశ్రీ (రుక్మిణి)

మనుమలు : అభిమన్యు, త్రికయ్, నిశ్చయ్

మూసీ పేరిట లక్ష కోట్ల దోపిడీకి యత్నం

- రాహుల్, వాళ్ల బావకు దోచిపెట్టే ప్రయత్నం
- నియామకాలపైనా నీతిమాలిన ప్రచారం: కేటీఆర్



హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): "మూసీ ప్రక్షాళన పేరిట లక్ష కోట్లు దోపిడీ చేసేందుకు కాంగ్రెస్ సర్కారు చూస్తోంది. రాహుల్ గాంధీతోపాటు వాళ్ల బావకు కోట్ల రూపాయలు దోచిపెట్టాలని ప్రయత్నిస్తోంది" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి బుల్డోజర్ పాలన తీసుకొచ్చారని దుయ్యబట్టారు. వరంగల్‌లో ఓ ఎమ్మార్వో బతుకమ్మ ఘాట్ చూసేందుకు వెళ్తే ఇళ్ల కూలగొట్టేందుకు వచ్చారనుకొని ప్రజలు తరమి కొట్టారంటే.. ఎంత భయాందోళన చెందుతున్నారో అర్థమవుతుందన్నారు. తెలంగాణలో దసరా పండుగను ఘనంగా జరుపుకొనే వీల్లేకుండా భయానక వాతావరణం సృష్టించారని విమర్శించారు. కాంగ్రెస్ పది నెలల పాలనలో అన్నీ వైఫల్యాలేనని, రాష్ట్రంలోని అన్ని వర్గాలు అసంతృప్తితోనే ఉన్నాయన్నారు. శేరిలింగంపల్లి కాంగ్రెస్ నేత మహ్మద్ అల్లావుద్దీన్‌తోపాటు పలువురు నాయకులు బుధవారం బీఆర్ఎస్‌లో చేరగా.. కేటీఆర్ గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ సమస్య అయినా కలెక్టర్లకు చెప్పాలనడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. హరియాణా ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెప్పారని, ఆ ఫలితాలు చూసైనా రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి హామీల అమలుకు కృషి చేయాలని సూచించారు. కొడంగల్‌లో రైతుల పక్షాన పోరాడిన మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. భూ సేకరణలో ప్రజల భయాలు, అనుమానాలను నివృత్తి చేసి వాళ్లను ఒప్పించాల్సింది పోయి.. పోలీసులను అడ్డు పెట్టుకొని అరాచకం సృష్టించడమేంటని నిలదీశారు. కాగా, ఉద్యోగ నియామకాలపై కాంగ్రెస్ ప్రభుత్వం నీతిమాలిన ప్రచారం చేసుకొంటోందని 'ఎక్స్' వేదికగా కేటీఆర్ ధ్వజమెత్తారు. గత ప్రభుత్వం ప్రారంభించిన ప్రక్రియను వారి ఖాతాలో వేసుకోవడానికి కొంచెమైనా సిగ్గుండాలని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డిని చూస్తే గోబెల్స్ మళ్లీ పుట్టాడనిపిస్తోందని విమర్శించారు. అశోక్‌నగర్ చౌరస్తా, ఉస్మానియా క్యాంపస్‌కు వెళ్లి కొలువుల పండుగ కథలు చెబుతావా? అని ప్రశ్నించారు. కాగా, జ్యోతిబాపూలే విదేశీ విద్య పథకానికి కాంగ్రెస్ తూట్లు పొడుస్తోందని కేటీఆర్ ఆరోపించారు.

కస్టమ్స్ పేరుతో 7.19 కోట్ల దోపిడీ

- నల్లగొండ వ్యాపారిని మోసగించిన కేటుగాడి అరెస్టు

హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యాపారి నుంచి రూ. 7.19 కోట్లు కొల్లగొట్టాడు ఓ కేటుగాడు. నల్లగొండ జిల్లాకు చెందిన ఓ స్థిరాస్తి వ్యాపారికి తన వ్యాపార భాగస్వామి ద్వారా బెంగళూరుకు చెందిన సునీల్ కుమార్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. కార్పొరేట్ ఈవెంట్ మేనేజ్‌మెంట్ నిర్వహించే సునీల్.. తనకు తెలిసిన వారికి విదేశాల నుంచి విరాళాల రూపంలో పెద్ద మొత్తంలో నగదు వచ్చిందని దాన్ని విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారని, పన్ను చెల్లింపునకు డబ్బులు ఇస్తే వచ్చిన నగదులో 30 శాతం వాటా ఇస్తానని నమ్మబలికాడు. అలాగే తనను కేంద్ర టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ నేషనల్ జ్యూట్ బోర్డు చైర్మన్‌గా నియమించిందని, తన పరపతితో ఆ నగదు విడిపిస్తానని చెప్పాడు. దాంతో సునీల్ కుమార్ మాటలు నమ్మి 10 నెలల్లో 80 బ్యాంకు ఖాతాలకు బాధితుడు రూ. 7.19 కోట్లు బదలాయించాడు. తనకు ఇస్తానన్న 30 శాతం వాటా గురించి ప్రస్తావించకపోవడం, తీసుకున్న నగదును తిరిగి ఇవ్వకపోవడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసిన సీఎస్‌బీ పోలీసులు నిందితుడు సునీల్ కుమార్‌ను బెంగళూరులో అరెస్టు చేసి హైదరాబాద్‌కు తరలించారు.

ఈపీసీ పనుల ముగింపుపై కసరత్తు

హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ఈపీసీ(ఇంజనీరింగ్-ప్రొక్యూర్‌మెంట్-కన్‌స్ట్రక్షన్) పనులను ముగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఈపీసీ విధానంలో 31 ప్రాజెక్టులకు సంబంధించిన 285ప్యాకేజీల పనులు జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. తక్కువ సమస్యలు కలిగి, 70-80 శాతం దాకా పూర్తిచేసిన పనులను కేటగిరీ-ఏ, క్వాలిటీ కంట్రోల్, విజిలెన్స్, ఆడిట్ పేరాలకు సంబంధించిన పనులను కేటగిరి-బీ, సమగ్ర పరిశీలన చేయాల్సిన పనులను కేటగిరీ-సీలో చేర్చారు. ప్రస్తుతం ప్రాధాన్య ప్రాజెక్టుల పనుల వివరాలను ప్రభుత్వం సమగ్రంగా సేకరిస్తోంది.

హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
సూపరింటెండింగ్ ఇంజినీర్, చార్మినార్ జోన్

NIT No. 13/SE(M)/CRZ/GHMC/2024-25 **టెండరు ప్రకటన** తేది: 08.10.2024

పని పేరు: 06 నం.ల సివిల్ పనులు. అంచనా విలువ: రూ.901.00 లక్షలు. బిడ్ల స్వీకరణకు ప్రారంభ తేది/చివరి తేది & సమయం: డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 10.10.2024న సా.05.00 గం.లకు; బిడ్ల స్వీకరణకు చివరి తేది & సమయం: 17.10.2024న మ.3.30 గం.లకు. అధికారి పేరు మరియు చిరునామా: శ్రీ వై. మహేశ్వర్ రెడ్డి సూపరింటెండింగ్ ఇంజినీర్, చార్మినార్ జోన్, GHMC, ఫూలబాగ్, బాబానగర్. సెల్ ఫోన్: 7993354273. తదుపరి వివరాలను https://tender.eprocurement.gov.inలో చూడవచ్చును.

సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్ (M), చార్మినార్ జోన్, GHMC

DIPR RO No.5205-PP/CL/ADVT/1/2024-25 తేది: 09.10.2024

హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, సంతోష్ నగర్ సర్కిల్-7, చార్మినార్ జోన్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన, నిర్వహణా పనులు

Nit No.20/EE-7(48)/CRZ/GHMC/2024-25, పని పేరు: క్ర.సం. 01 నుండి 09 వరకు, అంచనా వ్యయం (రూ.లక్షల్లో) రూ.96.68 లక్షలు, బిడ్ల స్వీకరణకు ప్రారంభ తేది/ఆఖరి తేది మరియు సమయం:- డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 09.10.2024న ఉ.10.30 గం.లకు, బిడ్ల స్వీకరణకు ఆఖరి తేది: 11.10.2024న మ.02.15 గం.లకు, అధికారి పేరు మరియు చిరునామా, సెల్ నం.శ్రీ జి.విరాంజనం, EE (FAC), సంతోష్ నగర్ సర్కిల్-7, చార్మినార్ జోన్, ముస్లిం గ్రౌండ్, దారల్ జంగ్ కాలనీ, సంతోష్ నగర్, హైదరాబాద్, ఫోన్: 7673951166. తదుపరి వివరాల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.tender.telangana.gov.in ను చూడగలరు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, సంతోష్ నగర్ సర్కిల్ -7, చార్మినార్ జోన్,
DIPR RO No.5194-PP/CL/ADVT/1/2024-25 తేది:09.10.2024 హైదరాబాద్ మహానగర పాలక సంస్థ

भा.क.नि. **भारतीय कपास निगम लिमिटेड**
THE COTTON CORPORATION OF INDIA LTD
(A Government of India Undertaking).
BRANCH OFFICE: 2nd & 3rd Floor, V.L. Chittimalla Complex, 16-07-109, Laxmipuram, Near Old Grain Market, Warangal - 506 002 (T.S.)
CIN : U51490MH1970GO1014733.
Phone No. 0870-2565088, 2429394, Fax No. 0870-2501451
Website: www.cotcorp.gov.in E-Mail : warangal@cotcorp.com. Ministry web : www.texmin.nic.in

REF: CCI/WGL/ADM/Taxi hire/2024-25/ Date : 09-10-2024

TENDER FOR HIRING TAXIS ON RENT

Sealed tenders in two bid system are invited for hiring vehicles from reputed travel Agencies. Interested parties may submit their tender along with EMD on or before 30.10.2024 by 2.00pm.For terms and conditions refer corporation's website http://www.cotcorp.org.in and also in Govt.Portal http://www.eprocure.gov.in. or can be obtained at B.O Warangal, during the Office hours.

Sd/- General Manager

भारतीय कपास निगम लिमिटेड (भारत सरकार का उपक्रम) शाखा कार्यालय : इंडस्ट्रियल इस्टेट, मेट्टुगड्डा, महबूबनगर-509001 दूरभाष : 08542-222210, फैक्स : 08542-222211
THE COTTON CORPORATION OF INDIA LTD. (A Government of India Undertaking) District Industrial Estate, Mettugadda, Mahabubnagar -509 001. Tel. No. : 08542-222210; Fax: 08542-222211
E-Mail: mahabubnagar@cotcorp.com Website: www.cotcorp.org.in
CIN: U 51490 MH 1970 GOI 014733

संख्या: भाकनि/एमनगर/मासंवि/2024 दिनांक: 09-10-2024

85 दिनों के लिए अस्थायी दैनिक वेतन भोगी कर्मचारियों के लिए वॉक-इन-इंटरव्यू !

Walk-in-Interview for Temporary Daily wages staff for 85 days

भारतीय कपास निगम लिमिटेड, (भारत सरकार का एक उपक्रम), शाखा कार्यालय, महबूबनगरके अंतर्गत आने वाले विभिन्न स्थानों / कार्यालयों / केंद्रोंपर "पूर्णरूप से दैनिक वेतन पर अस्थायी कर्मचारियों" (अर्ध-कुशल/अकुशल) को अधिकतम अवधि 85 दिन के लिए नियुक्त करने का प्रस्ताव करता है। वॉक-इन-इंटरव्यू 18.10.2024 को सुबह 11.00 बजे से शाम 4.00 बजे तक इस अधिसूचना में दर्शाए गए CCI केंद्रों पर आयोजित किया जाएगा । उम्मीदवारों को विधिवत भरे हुए निर्धारित आवेदन पत्र के साथ सभी मूल प्रमाण पत्रों/ मार्कशीट की स्व-सत्यापित ज़ेरॉक्स प्रतियों और हाल के पासपोर्ट फोटो के साथ मूलप्रमाण पत्र / मार्कशीट लाना अवश्यक है।वॉक-इन- इंटरव्यू में भाग लेने के लिए कोई टीए/डीए प्रदान नहीं किया जाएगा। अधिक जानकारी निगम की वेबसाइट www.cotcorp.org.in पर प्राप्त की जा सकती है।

The Cotton Corporation of India Ltd. (A Government of India Undertaking), Branch Office- MAHABUBNAGAR proposes to engage **"Temporary daily wages staff purely on daily wages"** (Semi-skilled / Un-skilled) **upto a maximum period of 85 days** at various Locations / Offices/Centres located under Branch Office Mahabubnagar. The walk-in-interview is scheduled on **18-10-2024** from 11.00AM to 4.00 PM at CCI Centre offices as specified in the Notification. The Candidates should bring Original Certificates/Mark Sheets along with self-attested Xerox copies of all Certificates and recent passport size photograph along with duly filled prescribed application form. No TA/DA would be provided for attending the Walk-in-interview. Further details can be obtained at Corporation's website www.cotcorp.org.in.

Sd/- उप महा प्रबंधक / Dy General Manager

PROCLAMATION REQUIRING THE APPEARANCE OF ACCUSED PERSON (UNDER SECTION 82 CR.P.C)
IN THE COURT OF THE SPECIAL JUDGE FOR TRIAL CASES UNDER ECONOMIC OFFENCES, RED HILLS, NAMPALLY, HYDERABAD - 500 004.
C.C.No.149/2019

Between:
Registrar of Companies,
(For the State of Telangana),
II Floor, Corporate Bhawan,
Bandlaguda, Nagole, Hyderabad - 500 068. ...Complainant
Vs.
Venugopal Rao Akkinepally(Ex Director),
Aged about 62 years, S/o Ramchander Rao, Akkinepally, Flat No. 302, Sri Sai Gardens Apts, Ganeshnagar, Ramanthapur, Hyderabad - 500 013, Telangana, India. ...Accused no.3

Whereas, complaint has been made before me that the accused no.3 **Shri Venugopal Rao Akkinepally, S/o Ramchander Rao Akkinepally, Aged 62 years, Flat No. 302, Sri Sai Gardens Apts, Ganeshnagar, Ramanthapur, Hyderabad 500 013, Telangana, India,** committed (or is suspected to has committed) the offence punishable under section 217(8)(c) of Companies Act, R/w Sec 217(1)(b) of the Companies Act, 2013 and it has been returned to a warrant of arrest there upon issued that the said **Shri Venugopal Rao Akkinepally (A.3),** cannot be found, and whereas it has been shown to my satisfaction that the said **Shri Venugopal Rao Akkinepally (A.3),** has absconded (or is concealing) himself to avoid the service of the said warrant.

Proclamation is hereby made that the said **Shri Venugopal Rao Akkinepally (A.3),** is required to appear before the Court of Special Judge for Economic Offences, City Criminal Court Complex, Red Hills, Nampally, Hyderabad-500 004 (or before me) to answer the said complaint on **21.10.2024. at 10.30 AM**

Dated this the 11th day of September, 2024

Sd/-
Special Judge for Trial of Cases, Under Economic Offences, Criminal Courts Complex, Red Hills, Nampally HYD-4

దక్షిణ మధ్య రైల్వే
@SCRailwayindiaను అనుసరించండి
ద.మ. రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును.

ప్రొఫార్మా 10-01
బహిరంగ ప్రకటన
PUB/1024

దక్షిణ మధ్య రైల్వేలోని దిగువ పేర్కొన్న సెక్షన్‌లోని పూర్తయిన సెక్షన్‌లోని రైల్వే లైన్లు మరియు ఆవరణల యూజర్లందరికీ ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది ఏమనగా 25000 Volts, 50Hz, A.C. ఓవర్ హెడ్ ట్రాక్షన్ వైర్లు సెక్షన్‌లో నిర్దేశించిన తేదీన లేదా ఆ తరువాత విద్యుత్ ప్రసరణతో కూడి ఉంటాయి. అదే తేదీన మరియు ఆ తేదీ నుండి సదరు ఓవర్‌హెడ్ ట్రాక్షన్ లైన్ అన్నివేళలా "విద్యుత్ వాహకం"గా పరిగణించబడుతుంది మరియు సదరు ఓవర్‌హెడ్‌లైన్స్ పరిసరాలలో ఏ అనధికార వ్యక్తి రాకూడదు లేదా పని చేయకూడదు.

సెక్షన్: GNT డివిజన్‌లోని NDKD-PGDP సెక్షన్‌లోని విష్ణుపురం స్టేషన్ నుండి టేకాఫ్ చేస్తూ TSGENCO కు సంబంధించిన గతిశక్తి మల్టీ-మోడల్ కార్గో టెర్మినల్ (GCT) మెసర్స్ యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (YTPS) – (ఫేజ్-1) (అనగా (1) VNUP బైపాస్ కేబిన్ నుండి YTPS ఎక్స్ఛేంజ్ యార్డు వరకు ఇందులో, కేవలం రోడ్డు నం.2, 3 & 4 ఉంటాయి (2) YTPS ఎక్స్ఛేంజ్ నుండి YTPS మెయిన్ యార్డు వరకు మరియు (3) YTPS మెయిన్ యార్డు ఇందులో, కేవలం రోడ్డు నం.2, 3, 4, 5 & 6 ఉంటాయి). ప్రదేశం నుండి: 88/18A (Ch: 0.00) ప్రదేశం వరకు: YTPS/6067 (Ch: 10/659.720) తేది: 15.10.2024న లేదా ఆ తరువాత జోన్: దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్

ప్రొఫార్మా 10-02
(ACTM Para 21020,Vol II, పార్ట్-1: కరెక్షన్ స్లిప్ నం.32. తేది: 09.10.2020)
AC 25 kV ట్రాక్షన్ ప్రారంభం
"రోడ్డు యూజర్లకు హెచ్చరిక"

దక్షిణ మధ్య రైల్వే GNT డివిజన్‌లోని NDKD-PGDP సెక్షన్‌లోని విష్ణుపురం స్టేషన్ (ఫేజ్-1) నుండి టేకాఫ్ చేస్తూ TSGENCO కు సంబంధించిన గతిశక్తి మల్టీ-మోడల్ కార్గో టెర్మినల్ (GCT) మెసర్స్ యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (YTPS) సెక్షన్‌లో 25 KV AC ఎలక్ట్రిక్ ట్రాక్షన్ ప్రారంభానికి సంబంధించి ప్రజలందరి సమాచారం నిమిత్తం ఇందుమూలముగా తెలియజేయడమైనది ఏమనగా **"విద్యుత్ వాహక"** ట్రాక్షన్ వైర్‌కు సమీపించడం లేదా ప్రమాదకర ప్రాక్సిమిటీకి రావడం నుండి అధిక ఎత్తుగల లోడ్స్ నివారించే దృష్ట్యా రోడ్ లెవల్ పైన 4.78 మీటర్ల స్పష్టమైన ఎత్తుతో అన్ని లెవల్ క్రాసింగ్స్ వద్ద హైట్‌గేజ్‌లు స్థాపించబడినవి.

సెక్షన్: GNT డివిజన్‌లోని NDKD-PGDP సెక్షన్‌లోని విష్ణుపురం స్టేషన్ నుండి టేకాఫ్ చేస్తూ TSGENCO కు సంబంధించిన గతిశక్తి మల్టీ-మోడల్ కార్గో టెర్మినల్ (GCT) మెసర్స్ యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (YTPS) – (ఫేజ్-1) (అనగా (1) VNUP బైపాస్ కేబిన్ నుండి YTPS ఎక్స్ఛేంజ్ యార్డు వరకు ఇందులో, కేవలం రోడ్డు నం.2, 3 & 4 ఉంటాయి (2) YTPS ఎక్స్ఛేంజ్ నుండి YTPS మెయిన్ యార్డు వరకు మరియు (3) YTPS మెయిన్ యార్డు ఇందులో, కేవలం రోడ్డు నం.2, 3, 4, 5 & 6 ఉంటాయి). **తేది:** 15.10.2024న లేదా ఆ తరువాత **జోన్:** దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ రహదారి వాహనాలలో తీసుకువెళుతున్న లోడ్స్ హైట్‌గేజ్‌లను ఎటువంటి పరిస్థితులలోను అతిక్రమించకుండా గమనించాలని మరియు వాహనాల లోడింగ్ నిమిత్తం పైన నిర్దేశించిన ఎత్తును గమనించాలని సాధారణ ప్రజలకు తెలియజేయడమైనది.

అధిక ఎత్తుగల లోడ్ అపాయాలు దిగువ ఇవ్వబడినవి:
1. రోడ్‌కు అదే విధంగా రైల్వే లైన్‌కు హైట్‌గేజ్ అపాయం మరియు తదుపరిగా ఆటంకం.
2. వాహనం తీసుకువెళ్తున్న మెటీరియల్స్ లేదా పరికరాలకు అపాయం.
3. కండక్టర్స్‌కు అపాయకర ప్రాక్సిమిటీతో తగులుట కారణంగా అగ్ని ప్రమాదము మరియు ప్రాణ నష్టం సంభవిస్తుంది.

A1300 సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, ట్రాక్షన్/ గుంటూరు

भाकृअनुप - भारतीय कदन्न अनुसंधान संस्थान
ICAR - ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రిసెర్చ్
राजेन्द्रनगर, हैदराबाद/ రాజేంద్రనగర్, హైదరాబాద్-500030
ఫోన్:24599300, ఫ్యాక్స్ నం. 24599304, www.millets.res.in

F.No: 4(804)Admn/19-20/FFP తేది: 09.10.2024

వాక్-ఇన్-ఇంటర్వ్యూ

దిగువ ఉద్యోగ నియామకానికి ICAR - ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రిసెర్చ్, రాజేంద్రనగర్, హైదరాబాద్-500030 వద్ద వాక్-ఇన్-ఇంటర్వ్యూకి హాజరు కావల్సిందిగా అర్హతగల మరియు ఆసక్తిగల అభ్యర్థులు కోరబడుచున్నారు.

క్ర.సం.	ఉద్యోగం	వాక్-ఇన్-ఇంటర్వ్యూ తేది & సమయం
1.	ఫీల్డ్ అసిస్టెంట్ (01 ఉద్యోగం)	తేది: 24.10.2024 సమయం: ఉ.10.00 గం.కు.

తదుపరి వివరాలకు మా వెబ్‌సైట్ www.millets.res.in ను చూడవచ్చును. సం/- డైరెక్టర్

भाकृअनुप भारतीय श्री अन्न अनुसंधान संस्थान
ICAR - ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రిసెర్చ్
राजेन्द्रनगर, हैदराबाद/ రాజేంద్రనగర్, హైదరాబాద్-500030
ఫోన్:24599300, ఫ్యాక్స్ నం. 24599304, www.millets.res.in

F.No: 4(953)Admn/2024 తేది: 09.10.2024

వాక్-ఇన్-ఇంటర్వ్యూ

దిగువ ఉద్యోగ నియామకానికి ICAR - ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రిసెర్చ్, రాజేంద్రనగర్, హైదరాబాద్-500030 వద్ద వాక్-ఇన్-ఇంటర్వ్యూకి హాజరు కావల్సిందిగా అర్హత గల మరియు ఆసక్తి గల అభ్యర్థులు కోరబడుచున్నారు.

క్ర.సం.	ఉద్యోగాలు	వాక్-ఇన్-ఇంటర్వ్యూ తేది & సమయం
1.	ప్రాజెక్ట్ అసిస్టెంట్ (01 ఉద్యోగం)	తేది:21.10.2024 సమయం: ఉ.10.30 గం.కు.

తదుపరి వివరాలకు మా వెబ్‌సైట్ www.millets.res.in ను చూడవచ్చును. సం/- డైరెక్టర్

भाकृअनुप - भारतीय श्री अन्न अनुसंधान संस्थान
ICAR- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రిసెర్చ్,
राजेन्द्रनगर, हैदराबाद/ రాజేంద్రనగర్, హైదరాబాద్-500030.
ఫోన్ : 24599300 ఫ్యాక్స్ నం.24599304, www.millets.res.in
IIMR

F.No: 4(952)Admn/2024 తేది: 09.10.2024

వాక్-ఇన్-ఇంటర్వ్యూ

దిగువ ఉద్యోగ నియామకానికి ICAR - ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రిసెర్చ్, రాజేంద్రనగర్, హైదరాబాద్ - 500030 వద్ద వాక్-ఇన్-ఇంటర్వ్యూకు అర్హతగల మరియు ఆసక్తి గల అభ్యర్థులు హాజరు కావల్సిందిగా కోరబడుచున్నారు.

క్ర.సం.	ఉద్యోగాలు	వాక్-ఇన్-ఇంటర్వ్యూ తేది మరియు సమయం
1.	యంగ్ ప్రొఫెషనల్ - II (అగ్రికల్చర్ సైన్స్) (2 ఉద్యోగాలు)	తేది : 23.10.2024 సమయం: ఉ.10:30 గం.లకు
2.	యంగ్ ప్రొఫెషనల్-II (కంప్యూటర్ సైన్స్) (2 ఉద్యోగాలు)	
3.	యంగ్ ప్రొఫెషనల్ - I (F&A) (1 ఉద్యోగం)	
4.	యంగ్ ప్రొఫెషనల్ - I (2 ఉద్యోగాలు)	

తదుపరి వివరాలకు మా వెబ్‌సైట్ www.millets.res.in ను దర్శించండి. సం/- డైరెక్టర్

RISHI UBR WOMEN'S COLLEGE
ACCREDITED with NAAC'A'GRADE
(Approved by AICTE & Affiliated to Osmania University)
Near JNTU Metro Station, Kukatpally, Hyd-85. Ph: 9676233050, 040-23050898

MBA SPOT ADMISSIONS - 2024-2025

Eligible candidates can attend for the spot admission with Original Certificates along with photocopies in the college premises on or before 16.10.2024 during working hours 9:00 AM to 5.00 PM. Admissions will be made as per TGCHE 2024-2025 guidelines.
I-Cet Code: RISH Sd/- **Secretary**

TNPL TAMILNADU NEWSPRINT AND PAPERS LIMITED
Kagithapuram - 639 136. Karur Dist. Tamil Nadu.
Ph.: 04324-277001 (10 Lines). Email : purchase.wood@tnpl.co.in

NOTICE INVITING TENDERS

Tender No.	Scope of work	Due date
242513 003832	Supply of Debarked Eucalyptus pulpwood from open market sources of Andhra Pradesh to TNPL Unit - I at Kagithapuram.	25.10.2024

Corrigendum if any will be issued in TNPL Website only. Detailed requirements, Period, Terms & conditions, Tender fee, EMD, etc., are available in the tender document which can be downloaded from website : www.tnpl.com

DIPR/4201/Tender/2024 *TNPL - Maker of bagasse based eco-friendly Paper*

నోటిఫైడ్ ఏరియా కమిటీ కార్యాలయం
హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ఏరియా, శంషాబాద్, తెలంగాణ రాష్ట్రం టెలిఫోన్ నం: 040-24008258.

టెండరు నం: 66/NAC/2024, **టెండరు ప్రకటన** తేది:10.10.2024

డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్ మరియు ట్రాన్స్‌ఫర్ (DBFOT) ప్రాతిపదికన పహాడీషరీఫ్‌వైపు శ్రీశైలం హైవే నుండి విమానాశ్రయం ఎంట్రీ పాయింట్ వరకు మరియు శంషాబాద్ వైపున వెల్‌కమ్ ఆర్చ్ నుండి విమానాశ్రయం ఎంట్రీ పాయింట్ వరకు ఆర్&బి అప్రోచ్ రోడ్ల సెంట్రల్ మీడియన్‌లో ప్రకటన బోర్డుల కొరకు BOT టెండరు కొరకు తెలంగాణ రాష్ట్రంలో తగిన ఇ-రిజిస్ట్రేషన్ కలిగిన మరియు అదే తరహా పనిలో అనుభవం కలిగిన అర్హత గల ఏజెన్సీల నుండి ఇ-టెండరు (2వ పిలుపు)ను నోటిఫైడ్ ఏరియా కమిటీ (NAC) వారు కోరుతున్నారు. ఆసక్తి కలిగిన ఏజెన్సీలు దిగువ షెడ్యూలు ప్రకారం ఇ-ప్రొక్యూర్‌మెంట్ విధానంలో వారి బిడ్లను దాఖలు చేయవలసిందిగా కోరబడుతున్నారు. 10.10.2024న 10.30 గం.నుండి 17.10.2024 వ 15.00 గం.వరకు ఆన్‌లైన్ దరఖాస్తు అందుబాటులో ఉంటుంది. ఆన్‌లైన్ టెండరు దాఖలుకు ఆఖరి తేది: 17.10.2024న 16.00 గం.కు. బిడ్ల తెరచుట: 17.10.2024న 17.00 గం.లకు. వివరాల కొరకు వెబ్‌సైట్ https://tender.telangana.gov.in ను దర్శించగలరు. సం/- ఫుల్ టైమ్ ఆఫీసర్, NAC

DIPR RO No. 5189-PP/CL/ADVT/1/2024-25 తేది: 09.10.2024

తెలంగాణ ప్రభుత్వం
ప్రజా ఆరోగ్య & మునిసిపల్ ఇంజనీరింగ్ శాఖ

టెండరు ప్రకటన

NIT No.890/DB/D5/TUFIDC/Kodangal/CC BT roads/NIT/2024-25, Date: 09.10.2024

కొడంగల్ మునిసిపాలిటీలో TUFIDC రుణ సహాయం క్రింద (03) నంబర్ల పనులను కోరడమైనది (1 పని ఎస్సీల కొరకు కేటాయించబడినది). **అంచనావ్యయం:** రూ.113 లక్షలు. అప్‌లోడ్ తేదీ నుండి పాల్గొనుటకు కనీసం (07) రోజుల్లో ఒక్కో టెండరు కొరకు 10.10.2024 నుండి 18.10.2024 వరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్‌లో టెండరు షెడ్యూళ్లు లభిస్తాయి. ఇతర వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా @https://tenders.telangana.gov.in ఇ-మెయిల్ ఐడి: eephhyd@yahoo.com పొందవచ్చును.

కొటేషన్ ప్రకటన నం: 777/DB/D2/Quot Notice/Non SoR items/2024-25 Date: 09.10.2024

ఈ డివిజన్‌లో చేపట్టే వివిధ పనుల కొరకు వివిధ నాన్ SoR ఐటమ్‌ల కొరకు సరఫరాదారుల నుండి సీల్డ్ కొటేషన్లు కోరబడుతున్నవి. ఏదేని తదుపరి స్పష్టీకరణ కొరకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (పిహెచ్) రంగారెడ్డి వారిని కార్యాలయ వేళల్లో సంప్రదించవచ్చును. ఫోన్ : 8008889332. పేరు : బి.ప్రభాకర్ రెడ్డి, బి.టెక్., ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, 5వ అంతస్తు, ఐఎన్‌సి (పి.హెచ్) కార్యాలయ కాంప్లెక్స్, ఎ.సి. గార్డ్స్, హైదరాబాద్-500004. ఫోన్ : 8008889332, ఇమెయిల్:eephhyd@yahoo.com

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పి.హెచ్. డివిజన్, రంగారెడ్డి

DIPR RO.No.5187-PP/CL/ADVT/1/2024-25, Dt: 09.10.2024

SILK MARK

Special Event Handloom Expo
#MyHandloomMyPride
#vocalforlocal
Sponsored & Organised by Govt. of India, Ministry of Textiles
O/o Development Commissioner for Handlooms
Weavers Service Centre, Hyderabad

At Kamma Sangam
Ameerpet, Hyderabad, Telangana

From 1st to 15th October 2024
10.00 am to 9.30 pm

AN EXHIBITION CUM SALE
of the Products Direct from All India Handloom Weavers
Banarasi | Tassar Kantha & Printed | Gadwal | Chanderi / Maheshwari | Kota | Jaipur Bagru Prints |Bengaluru Pure Crape Silks | Kalamkari | Kanchipuram | Gujarat Patola Sarees | Pochampalli Ikkat Venkatagiri /Uppada Jamdhani | Kerala Traditional Products| Mangalagiri Sarees and Cotton Dress Materials

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మార్పు మంచిదే..!

మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జు భారత పర్యటనతో ఉభయదేశాల మధ్యా ఇటీవలికాలంలో పెరిగిన దూరం ఇకపైన తగ్గవచ్చు. ఈ పర్యటన సందర్భంలో భారత ప్రధాన మీడియా ఓమారు గతాన్ని స్మరించుకోకుండా ఉండలేకపోతున్నది. ఇండియా అవుట్ నినాదంతో ఎన్నికల్లో గెలిచి, ఆ తరువాత భారత్ భద్రతకే సమస్యాత్మకమైన నిర్ణయాలు తీసుకొని, అనుచితంగా ప్రవర్తించిన ముయిజ్జుకు, ఇప్పుడు మన సాయం కావాల్సివచ్చిందా? అంటూ చాలా విమర్శలు వినబడుతున్నాయి. ఆయన ఆర్థికావసరాల మాట అటుంచితే, దశాబ్దాలుగా మనకు ఎంతో సన్నిహితంగా ఉంటూ, వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైన మాల్దీవులను ఎవరికారణంగానో దూరం చేసుకోవడమన్నది సరైనది కాదు. ఎన్నిపొరపొచ్చాలు వచ్చినా అనాదిగా మన పాలకులు చుట్టుపక్కల దేశాలతో అనుసరిస్తున్న విధానమే అది.

మొన్న జూన్‌లో నరేంద్రమోదీ మూడోసారి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కార్యక్రమానికి మొయిజ్జు వచ్చినప్పటికీ, అధ్యక్షహోదాలో భారతదేశంలో తొలి అధికారిక పర్యటన ఇదే. బాధ్యతలు స్వీకరించిన తరువాత భారత్‌లో పర్యటించే సంప్రదాయాన్ని పక్కనబెట్టి ఆయన ఈ ఏడాది జనవరిలో తుర్కియే, చైనా వెళ్ళివచ్చారు. చైనాకు మరింత దగ్గరయ్యేందుకు ప్రయత్నించారు. రెండుదేశాలదీ రక్తసంబంధం అన్నంత స్థాయిలో వ్యాఖ్యలు చేశారు, భారీ పెట్టుబడులు పెట్టాలనీ, ఆర్థికంగా ఆదుకోవాలనీ, చైనానుంచి టూరిస్టులు కుప్పలుతెప్పలుగా రావాలని చాలా కోరికలు కోరారు. ఆ పర్యటన ద్వారా తాను భారత్‌ను ఖాతరుచేయడం లేదని చెప్పడం ఆయన ఉద్దేశం కావచ్చు. ఆయన అక్కడ ఉండగానే మాల్దీవులకు చెందిన కొందరు మంత్రులు భారతప్రధానికి వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారు. మరోవైపు, భారత ప్రధాని నరేంద్రమోదీ లక్షద్వీప్ పర్యటన, మనదేశంలోని ప్రముఖులు బాయ్‌కాట్ మాల్దీవ్స్ అంటూ పిలుపునివ్వడం వంటివి కూడా రెండుదేశాల మధ్యా దూరం పెంచాయి. తమదేశంలో ఉన్న 80మంది భారత సైనికుల స్థానంలో సాంకేతిక నిపుణులను నియమించేవరకూ మాల్దీవులు పట్టువిడవలేదు. భారత్ చేపడుతున్న హైడ్రోగ్రాఫిక్స్ సర్వేను రద్దుచేయడం, చైనా పరిశోధనా నౌకను అనుమతించడం వంటివి అగ్గికి ఆజ్యం పోశాయి.

ఈ నేపథ్యంలో, రెండు దేశాలూ ఇటీవల తమ దౌత్యసంబంధాలకు అతుకువేసే ప్రయత్నం విశేషంగా చేశాయి. ఆగస్టులో విదేశాంగమంత్రి జయశంకర్ మాల్దీవుల పర్యటన, సెప్టెంబరులో ముయిజ్జు అమెరికాలో విలేకరులతో తాను భారతవ్యతిరేకిని కానంటూ చేసిన వ్యాఖ్యలు వాతావరణాన్ని మార్చాయి. ఆహారం సహా చాలా అవసరాలకు మాల్దీవులు భారత్‌మీద ఆధారపడాల్సిందే. అవసరాలు తీర్చడమే కాదు, కష్టకాలాల్లోనూ భారత్ ఆ దేశాన్ని ఆదుకుంది. అదంతా వెనక్కునెట్టేసి, భారత్ పెత్తనం, ఆధిపత్యం, అంతర్గత జోక్యం ఇత్యాది విమర్శలు మాత్రమే చేసి, రాజకీయంగా లబ్ధిపొందిన ముయిజ్జు ఇప్పుడు అప్పుల్లో నిండామునిగిన మాల్దీవులను రక్షించమంటూ ఇలా పరుగెత్తుకొచ్చారు. ఐదేళ్ళపాటు రుణచెల్లింపులు వాయిదా వేస్తానని బీజింగ్ హామీ ఇచ్చినట్టు ముయిజ్జు చెప్పుకున్నారని, ఇప్పుడది ఆర్థికసాయం గురించి మాట్లాడకపోవడంతో భారత్ పరిగెత్తారని ఆయన విమర్శకులు అంటున్నారు. ముయిజ్జు పర్యటనలో మాల్దీవులకు భారత్ పలు వరాలు కురిపించడం వెనుక స్వలాభాపేక్ష లేదని ఎవరూ అనుకోరు. ముయిజ్జుతో కానీ, మాల్దీవులతో కానీ తనకు వైరం లేదని చెప్పడానికి కాబోలు భారత్ మరింత ఉదారంగా, సానుకూలంగా వ్యవహరించిందని చాలామందికి అనిపించింది. స్వేచ్ఛావాణిజ్య ఒప్పందంతో భారత్ పెట్టుబడులు ప్రవహించాలని ముయిజ్జు ఆకాంక్షించారు. భారత పర్యాటకుల ఆగ్రహం ప్రభావమెంతో స్వల్పకాలంలోనే తెలిసొచ్చింది కనుక, మీరే మాకు ముఖ్యం, మీ రాకే మాకు సంతోషం అంటూ టూరిస్టులను అనుగ్రహించమని కూడా కోరారు. బంగ్లాదేశ్‌లో షేక్‌హసీనా ప్రభుత్వం కూలిపోవడం, నేపాల్‌లో కేపీ శర్మ ఓలీ ప్రధాని కావడం, శ్రీలంకలో అనూరకుమార దిస్సనాయకే అధ్యక్షుడు కావడం ఇత్యాది పరిణామాల నేపథ్యంలో, మొయిజ్జులో వచ్చిన మార్పు భారత్‌కు మంచిదే.

అంతం అయిపోతారు, ఆ తరువాత?

సుప్రసిద్ధ ఉర్దూ కథారచయిత ఖ్వాజా అహ్మద్ అబ్బాస్ 1980లో నక్సలైట్స్ అని ఒక సినిమా తీశారు. సినిమా చివర్లో పెద్ద కాల్పుల సంఘటన తరువాత, పోలీసు అధికారి మెగాఫోన్ పట్టుకుని 'నక్సలైట్లు ఇంకా ఎవరైనా మిగిలిపోయారా' అని గొంతు చించుకుంటూ అడుగుతాడు. నిశ్శబ్దమే సమాధానం. కానీ, అక్కడికి దూరంగా ఒక ఆదివాసీ గూడెంలో చొక్కా కూడా లేని ఒక చిన్న పిల్లవాడు, రెండు చేతులూ ఎత్తుతాడు, తానున్నానన్నట్టు.

అబ్బాస్ ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ అభ్యుదయ ఉద్యమం కాలానికి చెందిన రచయిత. ఆయనకు నక్సలైట్ ఉద్యమంతో పూర్తి ఏకీభావమేమీ లేదు. అవగాహనా లేదు. సినిమాలు తీయడం కూడా ఆయనకు రాదు. అయినా ముగింపు అట్లా ఎందుకు చేసినట్టు? ఉద్యమాలు బలప్రయోగంతో అణగారిపోవు అన్న విశ్వాసం, కొనసాగింపు ఉండి తీరుతుందనే ఆశాభావం, ఆయనకు ఉండవచ్చు.

భారతదేశ గృహమంత్రి అమిత్ షా ఈ మధ్య తరచు మావోయిస్టుల అంతం గురించి చెబుతున్నారు. 2026 అన్న గడువును పదే పదే వక్కాణిస్తున్నారు. ఆయన చెబుతున్నట్టుగానే, ఛత్తీస్‌గఢ్ గహనారణ్యం అబూజ్ మడ్‌లో దళాలు దళాలుగా, గూడేలు గూడేలుగా మనుషులు చచ్చిపోతున్నారు. ఆ చనిపోవడంలో ప్రభుత్వం విజయం చూస్తోంది. తెగిపడిన తలలను, తెగవలసిన తలలను లెక్కపెట్టి మరీ చెబుతోంది. త్వరలోనే అంతా ముగిసిపోతుంది అన్న భరోసాను ప్రకటిస్తోంది. నాలుగువేల చదరపు కిలోమీటర్ల అరణ్యంలో కొత్త అభివృద్ధిని కలగంటోంది.

కొత్త సమాజాన్ని నిర్మిస్తామని తుపాకులు పట్టుకుని పోరాటం చేస్తున్నవాళ్లు మన మధ్య ఆరున్నర దశాబ్దాలుగా కనిపిస్తున్నారు. వాళ్లంతా, ఈ సమాజం కడుపులో నుంచి పుట్టినవాళ్లే. ఈ ప్రజల కన్నబిడ్డలే. పెద్ద ఎత్తున జనాన్ని కూడగట్టి, ఉద్యమాలు చేసి, అంతిమంగా భారత రాజ్యాన్నే పట్టుకోవాలన్నది వాళ్ల వ్యూహం. సహజంగానే ప్రభుత్వాలూ, వ్యవస్థా దాన్ని సహించవు. సాయుధంగా ఉన్నారన్న కారణం ఉంటుంది కనుక, చాటుమాటుగా తిరుగుతుంటారు కనుక వాళ్లను చంపేయడానికి ప్రభుత్వ భటులకు చాలా సులువులు ఉంటాయి. చట్టప్రకారం వెళ్లడం, విచారణ తతంగాలూ ఇటువంటివాళ్ల విషయంలో అనవసరమని భద్రతావ్యవస్థలు నమ్ముతాయి. ఫలితంగా, వేలాదిమంది నక్సలైట్లు నిర్మూలన అయ్యారు. అదే సమయంలో వేలాదిమంది కొత్తగా పుట్టుకువచ్చారు. ఇప్పుడు ఈ పునరావృత చక్రంలో నిర్మూలనదే పైచేయి అయిందని, ఇక అంతా చదును కాబోతోందని ప్రభుత్వం ఆనందిస్తోంది.

నిజానికి, నక్సలైట్లతోనే మొదలు కాదు. అంతకు ముందు కమ్యూనిస్టులు ఉన్నారు. తెలంగాణతో సహా దేశంలోని అనేక భాగాల్లో తుపాకుల పోరాటం వాళ్లు చేశారు. అంతకు ముందు భగత్ సింగ్, అల్లూరి వంటి విప్లవవాదులు ఆయుధాలు పట్టుకుని బ్రిటిష్ వారి మీద పోరాడారు. 1857లో భారత రైతాంగం, సైనికులు తిరుగుబాటు చేసి, పోరాడి అణగారిపోయారు. అయినా, ఆ తరువాత పోరాటాలు పుడుతూనే వచ్చాయి. స్వతంత్రం వచ్చిన సమయంలోను, ఆ తరువాత, కమ్యూనిస్టులు, నక్సలైట్లు కాని వారు కూడా చాలా చోట్ల సాయుధ పోరాటాలు చేశారు, చేస్తున్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో అనేక సాయుధ సంస్థలు క్రియాశీలంగా ఉన్నాయి. కొన్నిటితో ప్రభుత్వం చర్చలు జరుపుతోంది, ఒప్పందాలు కూడా చేసుకుంది. ఒప్పందాలు చేసుకున్న చోట కూడా కొందరు తిరుగుబాటుదారులు వాటిని ఒప్పుకోక, పోరాటం కొనసాగిస్తూనే ఉన్నారు. సంస్థలు అంతమైపోవచ్చు, కొన్నిచోట్ల పోరాటాలు మౌనంలోకి పోవచ్చు, ముగిసిపోతాయని చెప్పలేము.

కొలంబియాలో గెరిల్లా ఉద్యమం మాఫియాగా మారి, చివరకు లొంగిపోయింది కదా, శ్రీలంకలో టైగర్లను తుడిచిపెట్టారు కదా, మన దేశంలోనూ ఖలిస్తాన్ ఉద్యమం ఉపశమించింది కదా, నేపాల్‌లో మావోయిస్టులు అణగారిపోయారు కదా అని వాదనలు వింటుంటాము. పై ఉదాహరణల్లో ఎక్కడా సమస్య శేషం లేకుండా పోలేదు. కొత్తరూపాల్లో అశాంతి వ్యక్తమవుతోంది. ఒక చారిత్రక జ్ఞాపకంగా కూడా ఆయా ఉద్యమాలు వర్తమాన రాజకీయాల్లో కీలక పాత్ర వహిస్తున్నాయి. ఎందుకంటే, ఎందువల్ల అక్కడ సాయుధ రాజకీయాలు వచ్చాయో, ఆ మూలకారణాలు సమసిపోలేదు. ఎక్కడైనా సమస్య లేకుండా పోయి ఉంటే గనుక, అక్కడ ఉభయపక్షాల అంగీకారంతో, పోరాటవాదుల డిమాండ్లను గణనీయంగా నెరవేర్చడంతో మాత్రమే జరిగింది.



> అడవుల్లోని ఆదివాసులు మాత్రమే కాదు, అలనాటి అన్నలను గుర్తుచేసుకునే పల్లె ప్రజలూ, హక్కులూ న్యాయమూ అంటూ కాలం చెల్లిన మాటలు మాట్లాడే బహిరంగ ఉద్యమకారులూ, అంగీకారం లేకపోయినా గౌరవం తగ్గించుకోని మేధావులూ... వీళ్లందరూ 'ఆ' తరువాత ఏమవుతారు? తెలంగాణ సాయుధ పోరాటంతో మొదలుపెట్టి, సుమారు ఏడుదశాబ్దాల పాటు తిరుగుబాటు దారులను అంతం చేస్తూ వచ్చిన కాంగ్రెస్ పార్టీకి కూడా ఇప్పుడు అర్బన్ నక్సల్ ముద్ర తప్పనప్పుడు, దేశంలో మావోయిస్టు నిందపడని వారెవరు మిగులుతారు? వీరందరూ మిగిలే ఉండగా, అంతం ఎట్లా కుదురుతుంది అమిత్ షా?

1990 దశకం మొదట్లో, సోవియట్ యూనియన్ కకావికలు అయిపోయినప్పుడు, పెట్టుబడిదారీ ప్రపంచం బహిరంగంగా సంబరపడింది. మేధావులు అయితే, చరిత్ర ఇక ముగిసిపోయింది అన్నారు. అప్పుడు ఒక అంతర్జాతీయ జర్నలిస్టు తన కాలమ్‌లో కొన్ని ప్రశ్నలు వేశారు. "అయితే ఏమిటి? లోకంలో మనుషులు ఉన్నదానితో సంతృప్తిపడతారా? పెట్టుబడిదారీ విధానమే పరమపదమని, ఇంతకు మించిన గొప్ప వ్యవస్థ లేదని సమాధానపడతారా? ఆఫ్రికా ఖండంలోను, ఆసియాలోనూ, దక్షిణ అమెరికా ఖండంలోనూ వారి ప్రభుత్వాలను, ప్రభుత్వాలను శాసిస్తున్న అగ్రరాజ్యాలను వ్యతిరేకించడం విరమించి హ్యాపీలీ లివ్డ్ ఎవరాఫ్టర్ అయిపోతారా?" అని ఆ పాత్రికేయుడు హేళనాత్మకంగా అబ్బురపడ్డారు.

ఈ శతాబ్దం మొదటి దశాబ్దంలో, సెప్టెంబర్ 11, 2001 నాటి కీలక పరిణామం కూడా జరిగిపోయాక, ప్రపంచ వ్యాప్తంగా విమాన ప్రయాణాలను కట్టుదిట్టం చేశారు. విమానాశ్రయాలను కంచుకోటలుగా మార్చారు. ఆ తరువాత, లండన్‌లో సబ్ వేలో ఒక టెర్రరిస్టు పేలుడు జరిగింది. దాని మీద వ్యాఖ్యానిస్తూ మరో జర్నలిస్టు ఆసక్తికరమైన విశ్లేషణ చేశారు. వరల్డ్ ట్రేడ్ సెంటర్ మీద జరిగిన విమానదాడుల నేపథ్య కారణాల మీద దృష్టి పెట్టకుండా, మరింత మందిని టెర్రరిస్టు మార్గంలోకి వెళ్లడానికి ప్రేరేపించే ప్రతీకార చర్యలు తీసుకుంటే, భద్రత ఎట్లా సాధ్యం? మీరు విమానాలను అష్టదిగ్బంధం చేస్తే, ఆత్మాహుతి ఆకాశదాడులు ఆగిపోతాయి. కానీ, మరోచోట పేలుళ్లు మొదలవుతాయి. భద్రతాచర్యల పరిష్కారం ఎప్పుడైనా విద్రోహచర్యల స్థలాన్ని, పద్ధతిని మార్చవచ్చును కానీ, విద్రోహాన్ని నివారించలేదు, అన్నది ఆ విశ్లేషణ సారాంశం. అశాంతి ఉన్నప్పుడు, దాని ప్రతిఫలనాలు వ్యక్తం అవుతూనే ఉంటాయి. ఒక రూపాన్ని తుడిచిపెడితే, అది మరో చోట, మరో రూపంలో తలెత్తుతూనే ఉంటుంది. దేన్నైనా సమూలంగా పెకిలించివేయాలంటే, విత్తనం ఎక్కడిదో, నేల ఎందుకు మొలకలను అనుమతిస్తోందో, వేళ్లు ఎక్కడెక్కడ విస్తరించి ఊడలు దిగాయో ముందు తెలుసుకోవాలి. మట్టిలోని ఏ జీవరసాయన చర్య ఆ మొక్కలను సజీవంగా నిలుపుతోందో అవగాహన చేసుకోవాలి.

ఇప్పుడు అమిత్ షా చెప్పినట్టు, అందరూ పట్టుబడి, లొంగిపోయి, చచ్చిపోతారనుకుందాం. తరువాత ఏమి జరుగుతుంది? 370 రద్దుకోసమే పరితపించిన కశ్మీరీలు, అది జరగగానే జన్మ ధన్యమైందని భావించారని మోదీ అనుకున్నట్టుగా, దేశంలోని ఆదివాసులందరూ ఆనంద పారవశ్యంలో మునిగితేలతారా? తమకూ అభివృద్ధికీ మధ్య అడ్డుగోడలా నిలబడిన విప్లవకారుల పీడ విరగడయిందని పండగ చేసుకుంటారా? వనవాసీ కళ్యాణం జరిగింది లెమ్మని అదానీ అంబానీలతో చెట్టపట్టాలు వేసుకుని జీవిస్తారా? బ్రిటిష్ వాడు కూడా దూరని భీకరారణ్యం మధ్య నుంచి పలువరసల మహారహదారులు దూసుకుపోతుంటే అభివృద్ధి తమను ఇంత నాగరికంగా కనికరిస్తున్నందుకు ఉప్పొంగిపోతారా? మావోయిస్టుల తుపాకీచప్పుళ్లు చల్లారి, యుద్ధవిన్యాస శిక్షణల కుహారుతాలతో దండకారణ్యం కొత్తవసంతాన్ని చవిచూస్తుందా?



■ కె. శ్రీనివాస్

సందర్భం

అడవుల్లోని ఆదివాసులు మాత్రమే కాదు, అలనాటి అన్నలను గుర్తుచేసుకునే పల్లె ప్రజలూ, హక్కులూ న్యాయమూ అంటూ కాలం చెల్లిన మాటలు మాట్లాడే బహిరంగ ఉద్యమకారులూ, అంగీకారం లేకపోయినా గౌరవం తగ్గించుకోని మేధావులూ, వీళ్లందరూ 'ఆ' తరువాత ఏమవుతారు? తెలంగాణ సాయుధ పోరాటంతో మొదలుపెట్టి, సుమారు ఏడుదశాబ్దాల పాటు తిరుగుబాటుదారులను అంతం చేస్తూ వచ్చిన కాంగ్రెస్ పార్టీకి కూడా ఇప్పుడు అర్బన్ నక్సల్ ముద్ర తప్పనప్పుడు, దేశంలో మావోయిస్టు నిందపడని వారెవరు మిగులుతారు? వీరందరూ మిగిలే ఉండగా, అంతం ఎట్లా కుదురుతుంది అమిత్ షా? అబూజ్ మడ్ తరువాత, అనేక యుద్ధరంగాలు! నిర్మూలించవలసినవారెవరూ లేని స్థితిలో అసలు పాలన ఎట్లా సాగుతుంది? ఎప్పుడూ ఎక్కడో ఒక చోట యుద్ధం చేయనిదే అగ్రరాజ్యాలకు, ఎప్పుడూ ఎవరినో నిర్మూలిస్తూ పోనిదే రేపటి అగ్రరాజ్యాలకు కాలం ఎట్లా గడుస్తుంది?

> తమను తాము కాపాడుకోవడానికి, ప్రజాస్వామిక వ్యవస్థల రాజకీయ వైఫల్యంతో బాధితులవుతున్న ప్రజలకు ఆదరువుగా ఉండడానికి ఎవరు మిగులుతారు? జనజీవనంలో వెలిసే అనేక యుద్ధరంగాలను నిర్వహించగలవారెవరు? నిర్బంధంతో నిర్మూలన సాధ్యం కాదని పాలకులకు చెప్పినట్టే, వివేచన, విమర్శ కొరవడితే ఉనికీ సాధ్యం కాదని మావోయిస్టులకు చెప్పాలని ప్రజలు కోరుకుంటారు కదా?

బహుశా, భౌతికంగా అబూజ్‌మడ్ 'విముక్తం' అయిపోతుంది. జనతన సర్కార్ ఒక జ్ఞాపకం అయిపోతుంది. దేశంలో అక్కడా ఇక్కడా ఉన్న మావోయిస్టు ఉద్యమస్థావరాలు కూడా తీవ్రమయిన ఒత్తిడిలో అణగారిపోతాయి. అంతాన్ని ప్రకటించి అమలుచేస్తున్నప్పుడు, నిస్సహాయంగా ముగిసిపోవడం వీరోచితం కావచ్చును కానీ, సరైనది కాకపోవచ్చును. కాలం ఉధృతంగానో ఉత్సాహంగానో ఉన్నప్పుడు, విమర్శను ఆహ్వానించే వినయం, సమీక్ష చేసుకోవలసిన అగత్యం లేకపోవచ్చును. నిర్బంధం, నిర్మూలన ఎదురయినప్పుడు విమర్శ, సమీక్ష అనౌచిత్యం, భీరుత్వం అనిపించవచ్చును. మరి ఎట్లా? తమను తాము కాపాడుకోవడానికి, ప్రజాస్వామిక వ్యవస్థల రాజకీయ వైఫల్యంతో బాధితులవుతున్న ప్రజలకు ఆదరువుగా ఉండడానికి ఎవరు మిగులుతారు? జనజీవనంలో వెలిసే అనేక యుద్ధరంగాలను నిర్వహించగలవారెవరు? నిర్బంధంతో నిర్మూలన సాధ్యం కాదని పాలకులకు చెప్పినట్టే, వివేచన, విమర్శ కొరవడితే ఉనికీ సాధ్యం కాదని మావోయిస్టులకు చెప్పాలని ప్రజలు కోరుకుంటారు కదా?

నిర్మూలనే ధ్యేయంగా సాగుతున్న చర్యలను నిలిపివేయమన్న విజ్ఞప్తులను వినే పరిస్థితిలో ప్రభుత్వం లేదు. నిజానికి ఆ విజ్ఞప్తిని గట్టిగా చేయగలిగే స్థితిలో కూడా భారతీయ పౌరసమాజం, ప్రజా ఉద్యమశ్రేణులు లేవు. ప్రధానస్రవంతి పార్టీలు మౌనంతో అర్ధాంగీకారాన్ని అందిస్తున్నాయి. చెప్పగలిగిందీ, చెబితే వినే ఆస్కారమున్నదీ మావోయిస్టులే. అస్త్రసన్యాసం చేయమని ఎవరూ చెప్పరు. అన్యాయంగా అంతరించిపోవద్దని మాత్రమే ఎవరైనా అడగగలరు.

పుస్తకాలు ఆయన ఆత్మదర్పణాలు

పుస్తకాలను 'ఆత్మలకు పట్టిన అద్దాలు'గా అభివర్ణించిందట వర్జీనియా వూల్ఫ్. ఆ విషయం ఆయనకు తెలుసో లేదో కానీ, రామడుగు రాధాకృష్ణమూర్తి అక్షరాలా పుస్తకాలను ఆత్మలకు అద్దాలుగానే ఎంచి, ప్రేమించారని నాకనిపిస్తుంది. ఆయన పుస్తక ప్రేమ అతివిలువైనది; కొండొకచో, అవధులు మీరినదేమో అని కూడా అనిపిస్తుంది. ఈ అక్టోబర్ ఆరున, తన తొంభయ్యోయేట, ఆయన కన్నుమూయడానికి ఒకట్రెండేళ్ళ ముందు వరకూ, రాధాకృష్ణ పుస్తకాలు సేకరిస్తూనే ఉన్నారని వింటే మరోలా ఎలా అనిపిస్తుంది?

హైదరాబాద్‌లోని పుస్తక ప్రియులందరి పాలిట– ముఖ్యంగా ఫిక్షన్ ప్రియుల పాలిట– కల్పతరువులాంటి రాధాకృష్ణ మనకు కావలసిన పుస్తకాన్ని మన దగ్గిరకే చేర్చే ఉదారుడు. తనకే వేరే ఏ పనీ లేదన్నట్టు, "మీకంటే లక్ష పన్లుంటాయి కదా!" అని అమాయకంగా అంటూ పుస్తకం చేతిలో పెట్టే రాధాకృష్ణని ఎలా అర్థం చేసుకోవాలో ఓ పట్టాన బోధపడేది కాదు. ఆ మధ్య పునఃముద్రితమైన 'వేలుపిళ్లై', 'అలరాసపుట్టిళ్ళు' లాంటి అరుదైన పుస్తకాల కోసం, ఎక్కడోగానీ దొరకని కవికొండల కథల కోసం రామడుగు రాధాకృష్ణ ముందు చెయ్యిచాచక తప్పలేదు. ఏ పుస్తకం గురించి అడిగినా, "లేకేం? మన దగ్గిర ఉండాలి కానీ, ఎక్కడుందో చూడాలి కాస్త... ఓపిగ్గా!" అని మాత్రమే అనేవారాయన. రెండు మూడు రోజుల తర్వాత, మనమేదో పన్లో పీకల దాకా మునిగివున్న సమయంలో అకస్మాత్తుగా ఆయన దగ్గిర నుంచి కాల్ వచ్చేది; ఆ వెనకే మనం కోరుకున్న పుస్తకమూ మన చేతికి వచ్చేది. అలాంటి నిష్కామకర్మ చెయ్యడానికి ఆయనకంత ఓపికా, తీరికా ఎక్కడివో అనిపించేది!



> పుస్తకాన్ని 'విలువైన ఆస్తి'గా కాకుండా, రసజ్ఞుడికే దాన్ని కలిగివుండే నైతికహక్కు వుందని భావించడం కన్నా సహృదయం, సుహృదయం మరొకటి ఉంటుందా? ఈ లక్షణ విశేషమే రామడుగు రాధాకృష్ణను పుస్తక ప్రియులైన ప్రతి ఒక్కరి హృదయపీఠం మీదా అంతెత్తున నిలబెడుతుందనడంలో సందేహం లేదు.


తొంభై దశకం మొదట్లో 'ఉదయం' ఆఫీసులో నేను రామడుగు రాధాకృష్ణని మొదటిసారి కలిశాను. అప్పట్లో ఓ పత్రికలో, ఓ ప్రముఖ రచయిత (బహుశా, ఆదివిష్ణు) తనకు నచ్చిన కథ అంటూ రా.వి.శాస్త్రి రాసిన 'మగాడు–ఆడమనిషి' అనే గొప్ప కథని జ్ఞాపకం చేశారు. ఆ కథ అచ్చయిన పుస్తకం ('బాకీ కథలు'?) అప్పట్లో దొరికేది కాదు. అది ఎక్కడ దొరుకుతుందనే విషయం మాట్లాడుకుంటూ ఉన్నప్పుడే, రామడుగు రాధాకృష్ణ మా ఆఫీసుకు వచ్చారు. మా మాటలు విన్నట్టున్నారు– "చదవడానికా? సొంతం చేసుకోవడానికా??" అని సూటిగా అడిగారు నన్ను. ఆయన పేరు వినడమే గానీ మనిషిని ఎప్పుడూ చూడకపోవడం వల్ల ఆయనలా అడగడం వింతగా అనిపించింది. మా శివాజీ "ఊఁ ఆయనడిగిందానికి జవాబు చెప్పు మరి.." అంటూ చిన్న హింటిచ్చారు. "అబ్బే సొంతానికా, ఏఁవన్నానా? ఒక్కసారి మళ్ళీ చదవడానికంతే!" అని తేల్చేశాను. "కల్పవృక్షం నీడలో కరువేమిటయ్యా? ఆయన్నడుగు!" అని శివాజీ ప్రోత్సహించారు. ఆ తర్వాత వారెవరో పరిచయం చేశారు కూడా. చేనేత అభివృద్ధి శాఖలో అనుకుంటా రాధాకృష్ణమూర్తి పెద్ద ఉద్యోగంలో ఉన్నారని మిత్రులు కె.ఎన్.వై. పతంజలి ఓసారి చెప్పిన విషయం జ్ఞాపకముంది. ఆయన మరీ అంత సింపుల్‌గా ఉంటారని– ఎందుకో గానీ– నేననుకోలేదు. నేను ఇంకా తేరుకోక ముందే, రామడుగు చంకలో ఉన్న చిన్న సంచీలోంచి నాకు కావలసిన పుస్తకం తీసి నా చేతుల్లో పెట్టారు. ఆయన ఆదివిష్ణు దగ్గిరనుంచే వస్తున్నారట. ఆ పుస్తకం ఆయన దగ్గిర తీసుకునే ఆదివిష్ణు ఆ వ్యాసం రాసినట్టున్నారు. సాధారణంగా అతిశయోక్తులే మాట్లాడే శివాజీ, ఆయన్ని కల్పవృక్షం అనడం అక్షరాలా స్వభావోక్తే అనిపించింది నాకు.

నేను రామడుగు రాధాకృష్ణని కలిసింది చాలా కొద్ది సందర్భాల్లోనే. అయితే, ఆయన వేసిన ముద్రలు మాత్రం ప్రగాఢమైనవి. గుడిపూడి సుబ్బారావు 'ఆర్ఎం చిదంబరం కథలు' అనే మంచి పుస్తకం అచ్చువేసినప్పుడు, అందులో రామడుగు–దేవులపల్లి–పున్నా కృష్ణలకు థ్యాంక్స్ చెప్పుకున్నారు. (సుబ్బారావు చెప్తేనే రామడుగు రాధాకృష్ణ కన్నుమూసిన వార్త నాకు తెలిసింది!) తెలుగు పాఠకులూ, రచయితలూ, సంపాదకులూ ఎన్నడో మర్చిపోయిన చిదంబరం.. 350 కథలు రాసి ప్రముఖ పత్రికలు అన్నింట్లోనూ అచ్చువేశారు. పుట్టుకతో మలయాళీ అయిన చిదంబరం– నాకు తెలిసినంతవరకూ– తెలుగులోనే కథలు రాశారు. వాటిల్లో చాలా కథలు 'భారతి' లాంటి మంచి సాహిత్య పత్రికల్లో అచ్చయ్యాయి. వాటిలో 20 కథల వరకూ సేకరించి గుడిపూడి సుబ్బారావు ఓ సంపుటంగా కూర్చారు; ఆ కథలకు చక్కని చారిత్రక నేపథ్యం సమకూర్చారు. రామడుగు రాధాకృష్ణ అందించిన సహాయ సహకారాల గురించి గుడిపూడి ఇప్పటికీ తల్చుకుంటూ ఉంటారు. అదీ, రామడుగు రాధాకృష్ణ వ్యక్తిత్వంలోని ప్రభావశీలమైన విశేషాంశ. అంతకుమించి, తాను వద్దని బతిమాలినా వినకుండా ఎన్నో విలువైన, అరుదైన పుస్తకాలను రాధాకృష్ణ తనకు బహూకరించేవారనీ ఆయన చెప్పారు. నా దృష్టిలో, నిజానికి ఇదే రామడుగు వ్యక్తిత్వంలోని సిసలైన విశిష్టాంశ. పుస్తకాన్ని 'విలువైన ఆస్తి'గా కాకుండా, రసజ్ఞుడికే దాన్ని కలిగివుండే నైతికహక్కు వుందని భావించడం కన్నా సహృదయం, సుహృదయం మరొకటి ఉంటుందా? ఈ లక్షణ విశేషమే రామడుగు రాధాకృష్ణను పుస్తక ప్రియులైన ప్రతి ఒక్కరి హృదయపీఠం మీదా అంతెత్తున నిలబెడుతుందనడంలో సందేహం లేదు.

• మందలపర్తి కిషోర్
సీనియర్ జర్నలిస్ట్

ఆ నక్సల్ ఖైదీలు ఎలా పరారయ్యారంటే..!

'సూర్యోదయం కుట్ర కాదు' పేరుతో కుట్రకేసుల సమాచారంపై నేను రాసిన పుస్తకం కోసం పార్వతీపురం కుట్ర కేసులోని చాలామంది ముద్దాయిలతో మాట్లాడవల్సి వచ్చింది. 55 సంవత్సరాల క్రితం 1969 అక్టోబర్ 10న సంచలనం కలిగించిన విశాఖపట్టణం జైలు నుంచి పారిపోయిన 11 మంది నక్సలైట్ ఖైదీల గురించి ఎలా తప్పించుకున్నారు? అనే విషయం పోలీసులకు కూడా సమాచారం దొరకలేదని కుట్ర కేసు ఛార్జిషీటులో ఉన్న విషయంతో అర్థమైంది. అలా పారిపోయిన వారు 1) నాగభూషణం పట్నాయక్ (ఒరిస్సా), 2) ఆదిభట్ల కైలాసం, 3) అలపాటి నాగేశ్వరరావు, 4) సనకసనందన మహామునులు, 5) షేక్ బుడే, 6) డా. దేవినేని మల్లిఖార్జునుడు (మల్లిక్), 7) యం.యల్. నారాయణ, 8) సిహెచ్. శామ్యూల్ రాజు, 9) మదనాల దుష్యంతు, 10) హసనార్ (కేరళ), 11) పురుషోత్తం పాణి (ఒరిస్సా). వీరంతా పార్వతీపురం కుట్రకేసులో ముద్దాయిలే. నేను ఈ సమాచారం సేకరిస్తున్న సమయానికి ఈ 11 మందిలో సజీవంగా ఉన్న వ్యక్తి యం.యల్. నారాయణ ఒక్కరే. ఈయన పూర్తి పేరు ముమ్మనేని లక్ష్మీనారాయణ.. గుంటూరు జిల్లా కొల్లూరు స్వస్థలం. ఈయనతో మాట్లాడినప్పుడు నాకు లభించిన ఈ సమాచారం ఆసక్తికరంగా ఉంటుందని తెలియజేస్తున్నాను.



20–30 మంది ఖైదీలున్న బ్యారెక్స్‌లో లావెటరీ కిటికీ రెండు ఊచల్ని కోశారు. దానికోసం పట్నాయక్ ఎలాగో బ్లేడు తెప్పించాడు. వార్డర్లు గంటకోసారి రౌండ్‌వేసి పడుకుంటారు. ఈ 11 మంది కిటికీ ద్వారా కిందకు దిగారు. గోడపక్కనే సూపరింటెండెంట్ ఇల్లు ఉంది. దాని పక్కన బస్‌స్టాండ్ ఉంటుంది. ముందు యం.యల్. నారాయణ ఎక్కాడు. హసనార్ మీదుగా నారాయణ ఎక్కాడు. దిగిన తర్వాత దుప్పట్లు ముడివేసి తాడులా తయారు చేశారు. దాంతో ఒక్కొక్కరు ఎక్కి దూకారు. ఇంటి పిట్టగోడ మీదుగా బస్‌స్టాండ్‌లోకి, అక్కడ నుంచి రైల్వే స్టేషన్‌కి వెళ్లారు.

12 గంటలకు గోడదూకితే ఒంటి గంటలోపే స్టేషన్‌కు చేరారు. పాసెంజర్ రైల్లో తుని వరకూ వెళ్లారు. అక్కడ రెండు టాక్సీలు మాట్లాడుకొని రాజమండ్రి వెళ్లి అక్కడ లాంచిపై గోదావరి దాటి కొవ్వూరు వెళ్లారు. అక్కడ హోటల్లో భోజనం చేసి బస్‌లో విజయవాడ చేరారు. అక్కడ 9 గంటలకు బస్ ఎక్కి తిరుపతి, మళ్లీ అక్కడ బస్సు ఎక్కి మద్రాసు చేరారు. మద్రాసులోని ఒక హోటల్‌లో రెండు రూములు తీసుకొని ఆ తర్వాత యం.యల్. నారాయణ స్నేహితుడొకరి దగ్గర కెళ్లి అక్కడ నాలుగు రోజులున్నారు. అక్కడ నుంచి యం.యల్. నారాయణ, హసనార్, పురుషోత్తం పాణి, శామ్యూల్ రాజు, మహామునులు, నాగేశ్వరరావులు బొంబాయి వెళ్లి అక్కడ నుండి సరాసరి మళ్లీ ఏజెన్సీకి వెళ్లగా, పట్నాయక్, డా. మల్లిక్, కైలాసం కొన్ని రోజులు మద్రాసులోనే ఉండి తర్వాత ఏజెన్సీకి వెళ్లగా, షేక్ బుడే గుంటూరుకు, మహామునులు, నాగేశ్వరరావులు వారివారి ఇళ్లకూ వెళ్లారు.

కాగా ఈ వ్యవహారమంతటిలోనూ వీరు మద్రాసులో డా. రామదాసు, డా. మూర్తిల ఆశ్రయంలో ఉన్నారనే విషయం వరకే పోలీసులకు తెలిసి వారిని కుట్ర కేసులో సాక్షులుగా వేసుకున్నారు. కాగా అలా మళ్లీ అడవికి వెళ్లిన డా. మల్లిక్, కైలాసం, దుష్యంత్‌లు కాల్పుల్లో హతమవగా, పాణి మినహా మిగిలిన వారు అరెస్టయి కేసుల్ని ఎదుర్కొన్నారు.

ఆదిభట్ల కైలాసం, డా. దేవినేని మల్లిఖార్జునుడు ఇద్దరూ పారిపోవటానికి 9 నెలల ముందు 1969 జనవరి 17న అరెస్టయి, కైలాసం మరో అగ్రనాయకుడు వెంపటాపు సత్యనారాయణతో కలిపి 1970 జూలై 10న కాల్చి చంపబడగా, డా. మల్లిఖార్జునుడు 30.7.1970న కాల్చి చంపబడ్డారు.

పురుషోత్తం పాణి ఒక్కడే తుదికంటా ఉద్యమంలో ఉండి, తరిమెల నాగిరెడ్డి గ్రూపులో చేరి ఆ పార్టీ రాష్ట్ర మహాసభలో పాల్గొంటూ గుండెపోటుతో ప్రకాశం జిల్లాలో 8 డిసెంబర్, 1988న అజ్ఞాతంగానే చనిపోయాడు. ఆయన భౌతిక కాయాన్ని గుంటూరు జిల్లా నర్సాయపాలెంకు తీసుకువచ్చి ఆ పార్టీ వాళ్లు రహస్యంగానే అంత్యక్రియలు నిర్వహించారు. "నా శరీరం కూడా పోలీసులకు దొరకకూడదు" అని తరచూ అభిలషించే పాణి కోరిక తీరింది. ఒరిస్సాకు చెందిన పురుషోత్తం పాణి 1950 నుండి కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేశారు. పార్వతీపురం కుట్రకేసులో, చిత్రకొండ కుట్ర కేసులో ఐదున్నర సంవత్సరాలు జైలు జీవితం గడిపారు. ఆనాడు జైలు నుంచి పారిపోయిన 11 మంది నక్సల్ ఖైదీల్లో పాణి ఒక్కడే పోలీసులకు దొరకలేదు.

○ చెరుకూరి సత్యనారాయణ

పూల పండుగకు ప్రజాస్వామ్య పరిమళాలు

"నల్ల పోచమ్మకు మొక్కులే కానీ దసరాకు
నవ దుర్గలు లేవు. నవ రాత్రులు లేవు"

తెలంగాణలో ఒక తరం ముందు దళిత హిందువులను అడగండి, వాళ్ళు ఎప్పుడైనా బతుకమ్మ ఆడారో.. మేమెప్పుడూ బతుకమ్మ ఆడలేదు. టౌన్లలో పల్లెల్లో అగ్ర కులాలు, వడ్ల, శూద్ర, కమ్మరి, పద్మశాలి, తెనుగు, గొల్ల, ఇతర శూద్ర కులాల స్త్రీలు పగలంతా గునుగు పువ్వు కొని, ఆ పూల దంట్లకు రంగులు వేసి ఆరబెట్టేవాళ్ళు, ఇతరకులాల స్నేహితురాళ్ళ ఇళ్లకు వెళ్ళినప్పుడు వాళ్ళ అమ్మలు, పిన్నమ్మలు, వదినెల చేతివేళ్ళకు ఆకుపచ్చ రంగు, ఊదా రంగు ఉండడం చూసేవాళ్ళం.

అత్తగారి ఇళ్ల నుండి పుట్టింటికి వచ్చిన అక్కలకు, బావలకు మర్యాదలు, పిండివంటల ఘుమఘుమలు, సాయంత్రం బతుకమ్మ ప్రసాదాల తయారీతో వాళ్ళ ఇళ్ళు చాలా సందడిగా ఉండేవి. మా టౌను చుట్టుపక్కల పల్లెల నుండి మా చుట్టాలు అత్తలు, వరుసయ్యి చిన్నమ్మలు, అక్కలు తెల్లవారు జమున్నె గునుగు పువ్వు ఎత్తుకొని వచ్చి బజార్లో, ఇల్లిల్లూ తిరిగి అమ్మి ఊళ్లకు మల్లేవాళ్ళు.

మనం ఎందుకు బతుకమ్మ పండుగ చేసుకోము అంటే మనకు (మాలా, మాదిగలకు) ఉండదు అని చెప్పేవాళ్ళు. కారణం అడిగితే ఎవరో ఒక మాదిగ స్త్రీ చేనులో పొద్దంతా చచ్చే కష్టం చేసొచ్చి, సాయంత్రం అలసిపోయి దొరికిన పూలతో బతుకమ్మ పేర్చిందట. తన గుడిసెలో వట్టి తునకలు తప్ప నైవేద్యం పెట్టడానికి ఏమీ లేవట. ఆ తునకలనే ఒక చిప్పలో వేసి బతుకమ్మ మీద పెట్టుకొని వీధిలోకి పోగా ఒక కాకి వచ్చి తునకలను అందుకొని ఎగిరిపోయిందట. అప్పుడు బతుకమ్మకు కోపం వచ్చి మీరు ఈ పండుగ చేసుకోవద్దు అన్నదట.

అయితే బేసిక్ ప్రశ్న బతుకమ్మ ఒక దేవతా? నవ దుర్గల్లో ఏ స్వరూపం? దసరా నాడు మేకలు, గొర్లు కోసి రక్తాలు వారగా పోసి, పొలిచల్లె దేవతకు మాంసాహారం ఎందుకు నచ్చలేదు?

అసలు కారణం బతుకమ్మ లాంటి ఆటవిడుపు పండుగలో పని నుండి శ్రామిక అట్టడుగు స్త్రీలకు మినహాయింపు ఇవ్వాల్సి వస్తుందని, అట్టడుగు స్త్రీలను దూరంగా పెట్టడం అనే దురాచారమే కారణం.

పూలను పూజించి, Pubertyనీ, సంతాన భాగ్యాన్ని గ్లోరిఫై చేసే పండుగగా బతుకమ్మను ప్రముఖ చరిత్రకారుడు రామోజు హరగోపాల్ అభివర్ణించారు. Infant deaths.. వరుసగా పిల్లలు పుట్టి చనిపోవడంతో పిల్లల్ని బతికించుకోవాలని, వాళ్ళకు పుల్లయ్య, బిచ్చం / బుచ్చమయ్య / బతుకయ్య లాంటి పేర్లు పెట్టుకోవడం చేసేవాళ్ళు. బిడ్డలను భిక్షగా ప్రసాదిస్తే భిక్షం / బుచ్చయ్య లాంటి పేర్లు పెట్టడం పరిపాటి. బతుకమ్మ కూడా అట్లాంటి గర్భధారణ, సంతానోత్పత్తి, డెలివరీకి సంబంధించిన స్త్రీ ఆరాధన అయి ఉండవచ్చు.

నిజాం కాలంలో శూద్ర కులాల స్త్రీలు, అందరూ కలిసి ఆయా గ్రామాల జమీందార్ల, పటేళ్ల.. గడీలు అనబడే నివాసాలకు, బతుకమ్మలను తీసుకొని వెళ్ళి, అక్కడ అంతా కలిసి బతుకమ్మ ఆడేవాళ్ళు.

> ఈ మధ్య తరచూ వాట్సాప్ గ్రూప్‌లలో సంప్రదాయంగా ఆడండి, డీజేలు వద్దు అంటూ పాత పద్ధతుల్లో బతుకమ్మ ఆడే పల్లెటూరి స్త్రీల వీడియోలు షేర్ చేస్తున్నారు. ఆ పాత పద్ధతిన ఆడే స్త్రీలల్లో దళిత స్త్రీలు ఉండరు. ఎందుకంటే పాతతరం దళిత స్త్రీలకు బతుకమ్మ లేదు.



ఒక్కోసారి అక్కడి దొరల భార్యలు కూడా బతుకమ్మ ఆడేవాళ్ళతో కొంతసేపు ఆడేవాళ్ళు. దొరలకు ఊరంతా తమ వద్దకు వచ్చి బతుకమ్మ ఆడటం ఒక గొప్ప ప్రతిష్ఠగా ఉండేది. తెలంగాణలో బతుకమ్మను మినహాయిస్తే ఒకప్పుడు దసరా అంటే పెత్రమాస (మహాలయ అమావాస్య), మానాయి, దసరా మూడు రోజులే జరుపుకొనేది.

బతుకమ్మ పాటలు పరిశీలిస్తే శూద్ర, అతిశూద్ర, శ్రామిక వర్గ స్త్రీల వెతలనే కబుర్లుగా, పాటలుగా పాడుకునేవాళ్ళు అని అర్థం అవుతుంది. రోజూ వారి ఇంటా బయటా పనులు చేసుకొనే స్త్రీలు వాళ్ళకు ఎదురయ్యే అనుభవాలుగా పాటలయ్యాయి.. ఉదాహరణకు "రాగి బిందె దీస్క రమణీ నీళ్ళకు పోతె రాములోరు ఎదురయ్యే నమ్మో ఈ వాడలోన" లాంటివి.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు, ఉద్యమంలో తెలంగాణ సంస్కృతికి, ఆటపాటలకు, బతుకమ్మ లాంటి పండుగలకు ఎనలేని ప్రాముఖ్యం లభించింది. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఈ ఆట పాట ప్రముఖ పాత్ర పోషించింది తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా తెలియకుండానే ఒక గొప్ప Cultural Unification జరిగింది. కుల మత వర్గ ప్రాంతాలకు అతీతంగా ఉద్యోగులు, భిన్న వర్గాల స్త్రీలు బతుకమ్మలు పేర్చారు. బతుకమ్మ పాటలు కంఠతా పట్టారు. దళిత, గిరిజన, ముస్లిం, క్రిస్టియన్ స్త్రీలు, పురుషులూ వందల్లో వీధుల్లో బతుకమ్మ పాటలు పాడుతూ ఆడారు, పాడారు.

తెలంగాణ ఉద్యమం బతుకమ్మను డెమోక్రటైజ్ చేసింది. కొద్ది కులాల స్త్రీలు మాత్రమే ఆడుతుండగా దూరంగా నిలబడి చూసే దళిత గిరిజన స్త్రీలు నేడూ బతుకమ్మ సంబరాల్లో, వేడుకల్లో పాలు పంచుకుంటున్నారు. ఇదివరకు ఎన్నడూ లేని పండుగను ఓన్ చేసుకొన్నారు.. వివిధ రంగుల పూలతో బతుకమ్మలను పేర్చడం, పూజలు చెయ్యడం నేర్చుకున్నారు. ఇప్పుడు కుల మతాలకు అతీతంగా కొత్తబట్టలు కట్టుకుని, పూల దొంతరల చుట్టూ, దాండియాలు ఆడుతున్నారు. చేతుల్లో కోలలతో నృత్యాలు చేస్తున్నారు.

ఈ మధ్య తరచూ వాట్సాప్ గ్రూప్‌లలో సంప్రదాయంగా ఆడండి, డీజేలు వద్దు, అంటూ పాత పద్ధతుల్లో బతుకమ్మ ఆడే పల్లెటూరి స్త్రీల వీడియోలు షేర్ చేస్తున్నారు. ఆ పాత పద్ధతిన ఆడే స్త్రీలల్లో దళిత స్త్రీలు ఉండరు. ఎందుకంటే పాత తరం దళిత స్త్రీలకు బతుకమ్మ లేదు.


ఇప్పుడు బతుకమ్మ... Has widened the Horizons of Festivity... ఇప్పుడు Bathukamma has reached a cult status. Bathukamma is now a Regional Entity.

సంప్రదాయవాదులు.. ధర్మపరిరక్షకులూ ఇప్పటి అమ్మాయిల బతుకమ్మ ఆటలను విమర్శించే ముందు వినాయక నిమజ్జనాల సందర్భంగా తాగి చిందులేసి తీన్మార్‌లను గుర్తుచేసుకోండి. అంతకన్నా అధ్వానంగా ఏమీ లేవు బతుకమ్మ ఆటలు.

పండగ ఏదైనా ఒక సందోహం, ఒక ఆటా పాటా... ముఖ్యంగా బతుకమ్మ మహిళల పూల పండుగ. స్త్రీత్వాన్ని సెలబ్రేట్ చేసుకొనే పండుగ. ఆడనివ్వండి, పాడనివ్వండి.. మనసు విప్పి ఎలాంటి inhibitions లేకుండా కోలాటాలు వెయ్యనివ్వండి. గాజుల చప్పుళ్ళతో గంతులు వేయనివ్వండి.. పేదా, గొప్పా, ఈ కులమూ ఆ కులమూ అననివ్వని నేటి బతుకమ్మ అసలు పండుగ.

రండి.. ఆడుదాం బతుకమ్మ.. బాజాప్త, బరాబర్

■ రజిత కొమ్ము



బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.2 కనిష్ఠం 23.8


₹17,212 కోట్లు

- నగర సమగ్ర సీవరేజీ వ్యవస్థకు మాస్టర్‌ప్లాన్
- 2051 జనాభా ఆధారంగా ఏర్పాటుకు చర్యలు
- పాత, కొత్త నగరాల్లో సరికొత్త సీవరేజీ పైప్‌లైన్లు
- సిద్ధమైన డీపీఆర్.. కేంద్రం సహకారంతో నిర్మాణం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మహానగరానికి నిజాంకాలం నాటి మురుగునీటి వ్యవస్థే ఇప్పటికీ దిక్కు. నగర జనాభా విపరీతంగా పెరగడం, శివారు ప్రాంతాలు వేగంగా విస్తరిస్తుండడంతో అప్పటి సీవరేజీ వ్యవస్థ ఏ మాత్రమూ చాలడం లేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మహానగరంతోపాటు భవిష్యత్ తరాలకు సరిపోయేలా హైదరాబాద్ సమగ్ర సీవరేజీ మాస్టర్‌ప్లాన్ (సీఎస్ఎంపీ)ను వాటర్‌బోర్డు రూపకల్పన చేసింది. రైజింగ్ తెలంగాణలో భాగంగా 2051 జనాభా అవసరాల అనుగుణంగా పాత, కొత్త నగరాల్లో సరికొత్త సీవరేజీ వ్యవస్థను రూ.17,212 కోట్లతో ఏర్పాటు చేసేందుకు ప్రముఖ షా కన్సల్టెన్సీ ద్వారా డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) కూడా సిద్ధమైంది. ఈ మాస్టర్‌ప్లాన్‌ను కేంద్రం సహకారంతో చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ఔటర్ పరిధిలోని ప్రాంతాలతో పాటు మూసీలో మురుగు చేరకుండా 39 కొత్త ఎస్టీపీల నిర్మాణానికి ప్రతిపాదనలు చేయగా పదో అపెక్స్ కమిటీ 'అమృత్ 2.0' పథకాన్ని వర్తింపజేసేందుకు అంగీకరించిన విషయం తెలిసిందే.

సుమారు వందేళ్ల కిందట..

1931లో నిజాం హయాంలో ప్రఖ్యాత ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య హైదరాబాద్ నగరానికి సమగ్ర సీవరేజీ వ్యవస్థను డిజైన్ చేశారు. సీవరేజీ, వర్షపు నీరు పోయేందుకు కూడా ప్రత్యేక డ్రైనేజీ వ్యవస్థను ఆనాడే నిర్మించారు. ఆనాటి సీవరేజీ వ్యవస్థ ప్రస్తుతం విస్తరించిన మహానగరానికి ఏమాత్రం చాలడం లేదు. 1981లో అప్పటి ప్రభుత్వం రీమోడలింగ్ చేసింది. ఆ తర్వాత ప్రపంచబ్యాంకు నిధులతో విస్తరిస్తున్న మహానగరానికి సీవరేజీ వ్యవస్థను పొడిగించారు. 2010 నాటికి జీహెచ్ఎంసీ పరిధిలో 3,500 కిలోమీటర్ల మేర సీవరేజీ నెట్‌వర్క్ ఉన్నది. మహానగరం విస్తరణతో ప్రస్తుతం 7వేల కిలోమీటర్ల సీవరేజీ లైన్లు ఉన్నాయి. అయితే జన్మభూమి, జేఎన్ఎన్‌యూఆర్ఎం తదితర పథకాల్లో భాగంగా సీవరేజీ నెట్‌వర్క్‌ను చేపట్టారు.



ఔటర్ పరిధిలో సమగ్ర సీవరేజీ మాస్టర్ ప్లాన్

కోర్‌సిటీలో 424కిలోమీటర్లు

కోర్ సిటీ (మున్సిపల్ కార్పొరేషన్ హైదరాబాద్) ఏరియాలో నాడు రూపకల్పన సీవరేజ్ వ్యవస్థకు అదనంగా 424 కిలోమీటర్ల ప్రతిపాదనలు చేశారు. జోన్-1 కింద 81 కిలోమీటర్లు, జోన్-4లో 92 కిలోమీటర్లు, జోన్-5లో 77కిలోమీటర్లు, జోన్-6లో 174కిలోమీటర్లు.. మొత్తం 424 కిలోమీటర్ల నూతన సీవరేజీ వ్యవస్థ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. అయితే రెండు జోన్లలో సీవరేజీ నెట్‌వర్క్ పనులు మొదలయ్యాయి.

శివారు ప్రాంతాల్లో 2231 కిలోమీటర్లు

శివారు ప్రాంతాల్లో సమగ్ర సీవరేజ్ వ్యవస్థ నిర్మాణం కోసం దాదాపు 2231 కిలోమీటర్ల మేర ప్రతిపాదనలు చేసింది. ఇందులో ఉప్పల్, కాప్రా, మల్కాజిగిరి, అల్వాల్, శేరిలింగంపల్లి సర్కిల్ ప్రాంతాల్లో ప్యాకేజీ-1లో 756.85 కిలోమీటర్ల మేర నిర్మాణానికి నిర్ణయించారు. ప్యాకేజీ-2లో రాజేంద్రనగర్, ఎల్‌బీ నగర్ సర్కిల్ పరిధిలో 643 కిలోమీటర్లు ప్యాకేజీ-3లో కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ సర్కిళ్ల పరిధిలో 831.78 కిలోమీటర్ల మేర సీవరేజీ వ్యవస్థ నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు.

భావితరాలకు ఇబ్బంది లేకుండా..

మహానగరం 650 చదరపు కిలోమీటర్లకు పైగా విస్తరించి ఉన్నది. కోర్ సిటీలో నిజాం కాలంలో ఏర్పాటు చేసిన సీవరేజీ వ్యవస్థనే తప్ప శివారు ప్రాంతాల్లో సమగ్రమైన సీవరేజీ వ్యవస్థ లేదు. ఎన్ని ప్రభుత్వాలు మారినా మురుగునీటి వ్యవస్థ గురించి పట్టించుకోలేదు. అయితే కోర్ సిటీతో పాటు, శివారు ప్రాంతాలకు హైదరాబాద్ సమగ్ర సీవరేజీ మాస్టర్ ప్లాన్‌ను ముంబైకి చెందిన షా కన్సల్టెన్సీ రూ.17,212.69 కోట్లతో డీపీఆర్ రూపకల్పన చేయగా దీన్ని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి అందజేసింది. ఇందులో కోర్ సిటీతోపాటు శివారు ప్రాంతాల్లో 4,378 కిలోమీటర్ల మేర సీవరేజీ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు చేసింది.





ఎల్‌బీ స్టేడియంలో సీఎం రేవంత్ ఫొటోతో నూతన టీచర్ల అభిమానం

నచ్చిన లాంగ్వేజీ కాదని..

- మరో మీడియంలో నియామక పత్రాలు
- డిక్లరేషన్ అడగకుండానే అపాయింట్‌మెంట్ లెటర్లు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ మెరిట్ అభ్యర్థుల్లో కొందరి పరిస్థితి గందరగోళంగా మారింది. ఉపాధ్యాయ వృత్తిని సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్న కొందరు రెండు, మూడు లాంగ్వేజీల్లో పరీక్షలు రాశారు. ఇందులో అనూహ్యంగా కొందరికి రెండు భాషల్లో ఉద్యోగాలు రావడంతో ఒక దానిని తప్పనిసరిగా వదులుకుంటున్నారు. అయితే, తమకిష్టమైన లాంగ్వేజీలో చేరేందుకు ఆసక్తి చూపించిన వారికి అధికారులు మోకాలడ్డు పెట్టి, ఇతర మీడియంలో చేరాలంటూ నియామకపత్రాలు ఇవ్వడంతో ఆవేదనకు లోనవుతున్నారు. బుధవారం ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన డీఎస్సీ అభ్యర్థుల నియామకపత్రాల పంపిణీలో గందరగోళం ఏర్పడింది. హైదరాబాద్ జిల్లాలో 878 టీచర్ పోస్టులకు 27,360 మంది పరీక్ష రాశారు. 1:3 ప్రాతిపదికన 2,634 మందిని ఎంపిక చేయగా.. అందులో 616 మందికి అపాయింట్‌మెంట్ లెటర్లు జారీ చేశారు. మిగతా 262 అభ్యర్థులను వివిధ కారణాలతో పెండింగ్‌లో పెట్టారు. నోటిఫికేషన్‌లో ఎస్‌జీటీ ఇంగ్లిష్ మీడియంలో 42, హిందీ-12, తెలుగు-285, ఉర్దూ-185, కన్నడ-1, మరాఠీ-7, తమిళం-5 ఖాళీలను చూపించారు. తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియంలో పోస్టులు ఎక్కువగా ఉండడంతో దాదాపు 8వేల మంది పరీక్షకు హాజరయ్యారు.

878 ఖాళీల్లో 537 ఎస్‌జీటీలకు..

జిల్లాలో స్కూల్ అసిస్టెంట్, లాంగ్వేజ్ పండిట్లు, పీఈటీ ఖాళీలకంటే సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ) పోస్టులు అధికంగా ఉన్నాయి. మొత్తం 878 ఖాళీల్లో 537 పోస్టులు ఎస్‌జీటీలోనే ఉండడంతో చాలామంది ఆ పరీక్షను రాసేందుకు మొగ్గు చూపారు. ఆయా భాషల్లో ఏదో ఒకటి వస్తుందనే నమ్మకంతో కష్టపడి చదివారు. పలువురికి అనూహ్యంగా రెండు లాంగ్వేజ్‌ల్లో ఉద్యోగం వచ్చిన పరిస్థితి నెలకొంది. అయితే తాము ఎక్కువగా ఇష్టపడే మీడియంలో చేరాలని

మిగతా 6వ పేజీలో..

ట్యాంక్‌బండ్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సద్దుల బతుకమ్మ వేడుకల నేపథ్యంలో గురువారం ట్యాంక్‌బండ్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని నగర ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్ తెలిపారు. నాంపల్లి అమరవీరుల స్మారక స్థూపం నుంచి అప్పర్ ట్యాంక్‌బండ్‌లోని చిల్డ్రన్ పార్కు వరకు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. ట్యాంక్‌బండ్ మీదుగా ఎంజీబీఎస్ వైపు జిల్లా ఆర్టీసీ బస్సులను ట్యాంక్‌బండ్‌పైకి అనుమతించరు. ఓల్డ్ సైఫాబాద్ పోలీసుస్టేషన్ (ద్వారక హోటల్), ఇక్బాల్ మినార్, తెలుగు తల్లి జంక్షన్, నెక్లెస్ రోటరీ, లిబర్టీ, పాత అంబేడ్కర్ విగ్రహం, కవాడిగూడ క్రాస్ రోడ్స్, కట్టమైసమ్మ గుడి, కర్బలా మైదానం, రాణిగంజ్, నల్లగుట్ట, ఖైరతాబాద్ ఫ్లైఓవర్ ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి వాహనాలను దారి మళ్లిస్తామని తెలిపారు. ఆంక్షలను దృష్టిలో పెట్టుకొని ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని వాహనదారులకు అదనపు సీపీ సూచించారు.

బాలాపూర్ లడ్డూ జాతీయం కావాలి'

- అది ప్రధాని మోదీ ఆకాంక్ష : కొలను

న్యూఢిల్లీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): 'బాలాపూర్ లడ్డూ పవిత్రత నాకు తెలుసు. భవిష్యత్తులో ఈ లడ్డూ జాతీయం కావాలి. దేశవ్యాప్తంగా ఉత్తర, దక్షిణమనే తారతమ్యం లేకుండా ప్రజలందరూ బాలాపూర్ లడ్డూను స్వాగతించాలి, విశ్వసించాలి' అని ప్రధాని మోదీ అన్నట్లు లడ్డూ విజేత కొలను శంకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం ప్రధానిని స్వయంగా కలిసి ప్రసాదం అందజేసినట్లు చెప్పారు. మోదీని కలిసిన వారిలో గాజుల మధు, రవినాయక్, చవ్వా శ్రవణ్, శ్రీనివాస్‌నాయక్ ఉన్నారు.



జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత తదితరులు

కలెక్టరేట్‌లో జరిగిన వేడుకల్లో మహిళా ఉద్యోగులతో కలెక్టర్ అనుదీప్





కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో..

బతుకమ్మ వేడుకల్లో భాగంగా రవీంద్రభారతిలో జరిగిన నాటకంలో సన్నివేశం



సంబురం అదిరింది..

మహిళల కోలాటాలు.. డీజేల హోరులో యువతుల నృత్యాలు.. సంప్రదాయ పాటలతో గ్రేటర్ వీధుల్లో బతుకమ్మ కోలాహలం నెలకొన్నది. బుధవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో అంబర్‌పేట మున్సిపల్ మైదానంలో జరిగిన వేడుకలకు మహిళలు భారీగా తరలివచ్చారు. కలెక్టరేట్‌లో జరిగిన వేడుకల్లో కలెక్టర్ అనుదీప్ ఉద్యోగులతో ఆడిపాడారు. జీహెచ్ఎంసీ ఆఫీసు ప్రాంగణంలో తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత ఆడారు. బతుకమ్మ ఉత్సవం మాత్రమే కాదని ఉద్యమంలా బహుజన బతుకమ్మను నిర్వహిస్తున్నామని ప్రజాగాయని విమలక్క పేర్కొన్నారు. రవీంద్రభారతిలో జరిగిన వేడుకల్లో ఆమె ఉద్వేగానికి లోనయ్యారు.

–హైదరాబాద్ సిటీ/అంబర్‌పేట/రవీంద్రభారతి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి)



అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో జరిగిన వేడుకల్లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యారెడ్డి



'స్పెషల్' బాదుడు

- దసరా ప్రత్యేక బస్సుల్లో చార్జీల మోత
- 25 శాతం పెంచిన టీజీఎస్ఆర్టీసీ

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ, దసరా పండుగలకు సొంతూళ్లకు వెళ్లే వారికి ఆర్టీసీ చార్జీల షాక్ ఇచ్చింది. పండుగ సందర్భంగా నడుపుతున్న స్పెషల్ బస్సుల్లో అదనంగా 25 శాతం చార్జీలు పెంచింది. నగరం నుంచి తెలంగాణ, ఏపీలోని జిల్లాలకు వెళ్లే స్పెషల్ సర్వీసులకు ఈ చార్జీలు వర్తిస్తాయని పేర్కొంది. ఈనెల 14 వరకు 6,300 స్పెషల్ బస్సులు అందుబాటులో ఉంటాయని, పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఆధార్‌కార్డు చూపించి మహిళలు ఉచిత ప్రయాణాలు చేయవచ్చని అధికారులు తెలిపారు. పండుగ వేళ ఆర్టీసీ చార్జీలు పెంచడంపై సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా, గురు, శుక్రవారాల్లో ఏపీ, తెలంగాణ జిల్లాలకు 3 వేలకు పైగా స్పెషల్ బస్సులు నడిపేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. బుధవారం రాత్రి 9 గంటల వరకు 700 స్పెషల్ సర్వీసులు జిల్లాలకు తరలివెళ్లగా, గురువారం 900 ప్రత్యేక బస్సులు సిద్ధంగా ఉంచారు.

సొంతూళ్లకు చలోచలో

సద్దుల బతుకమ్మ, దసరా నేపథ్యంలో హైదరాబాద్ నుంచి ప్రజలు స్వగ్రామాలకు తరలివెళ్తున్నారు. జిల్లాలకు వెళ్లే ప్రయాణికులతో మూడు, నాలుగు రోజులుగా ఎంజీబీఎస్, జేబీఎస్‌లలో రద్దీ నెలకొంది. మరోవైపు దసరా పండుగ రద్దీని అధిగమించేందుకు ప్రత్యేక రైళ్లు నడపనున్నారు. ఈనెల 10న మచిలీపట్నం-సికింద్రాబాద్ (07073), 11న సికింద్రాబాద్-తిరుపతి (07074), 12న తిరుపతి-కాకినాడ టౌన్ (07075), 13న కాకినాడ టౌన్ -సికింద్రాబాద్ (07076) రైళ్లు అందుబాటులో ఉండనున్నాయి. కాగా, ఈ నెల 14 వరకు విద్యాసంస్థలకు పండగ సెలవులు ఉండటంతో ఏపీవాసులు సైతం సొంతూళ్లకు వెళ్తున్నారు.

'జేసీజేను, రాష్ట్రపతి బంధువును'

- కలెక్టర్లు, ఎస్పీలు ఇతర అధికారులకు ఫోన్లు
- తెలుగు రాష్ట్రాల్లో పెద్ద మొత్తంలో వసూళ్లు

8

చిట్టీ డబ్బు ఇవ్వడం లేదని చంపేశాడు

- ఆర్ఎంపీ భార్య హత్య కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడు జావెద్‌ఖాన్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి, పక్కన రంగనాథ్

విపత్తుల సమయంలో

బెంగ లేకుండా..

- మరిన్ని మెరుగుదల చర్యలకు హైడ్రా అధ్యయనం
- బెంగళూరు, ఇతర నగరాల్లో విధానాల పరిశీలన

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో విపత్తుల నిర్వహణ మెరుగుదలపై హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) దృష్టి సారించింది. బెంగళూరుతోపాటు దేశంలోని ఇతర నగరాల్లో అనుసరిస్తున్న విధానాలపై అధ్యయనం చేయాలని నిర్ణయించింది. బుధవారం బుద్ధభవన్‌లో కర్ణాటక ప్రకృతి వైపరీత్యాల నిర్వహణ కేంద్రం మాజీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కీలక సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం నగరంలో అమలవుతున్న విపత్తుల నిర్వహణ విధానాలను మరింత సమర్థవంతంగా, సమన్వయంతో ముందుకు తీసుకెళ్లడానికి ఏం చేయాలన్న దానిపై చర్చించారు. ప్రధానంగా వర్షాల సమయంలో ప్రజలను ముందుగా అప్రమత్తం చేసేందుకు యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచాలని నిర్ణయించారు. వరదలు, ముంపు ముప్పు ఉన్న ప్రాంతాల్లోని వారిని ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. వరద నీటి కాలువల్లో బెంగళూరు తరహాలో ప్రవాహ స్థాయిని అంచనా వేసేందుకు సెన్సార్ల ఏర్పాటు, ప్రయోజనాలపై సమావేశంలో చర్చించారు.

ఆంధ్రజ్యోతి Daily CLASSIFIEDS

PLOT FOR SALE

H దసరా స్పెషల్ ఆఫర్ : హై రిటర్న్స్ ఫామ్ ల్యాండ్ ప్లాట్స్ Freeరిసార్ట్‌తో సాగర్ హైవే, RRRకి దగ్గరలో అమ్మకం. ప్లాట్ కొన్నవారికి దసరా గిఫ్ట్ : 10 గ్రాముల గోల్డ్ లేదా దుబాయ్ ట్రిప్ లేదా స్పెషల్ డిస్కౌంట్. ప్రాజెక్ట్ డైరెక్టర్ : 9704735970 AJH>002545

H HYD, ఇబ్రహీంపట్నం, జనార్థ వెంచర్‌లో 240 చ॥గ॥ప్లాటు మరియు చర్ల పటేల్ గూడలో 200 చ॥గ॥ ప్లాటు అర్జెంటుగా అమ్మబడును. సం॥ప్ర॥ 8374785027 AJH>199033

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ADVT

క్లాసిఫైడ్స్ ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.
99859 21380, 99859 21386
97036 18806

కలశం పేరిట కపటం

- రైస్ పుల్లింగ్ కలశం విక్రయం పేరుతో మోసం
- ముగ్గురి అరెస్ట్, రూ.25 లక్షలు స్వాధీనం
- మరో ఘటనలో నకిలీ యాప్‌తో నగదు స్వాహా



నిందితులతోపాటు స్వాధీనం చేసుకున్న సొత్తు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నో శక్తులున్న రైస్ పుల్లింగ్ కలశం తమవద్ద ఉన్నదని, అమ్మితే భారీగా లాభాలు వస్తాయని ఓ వ్యక్తిని నమ్మించి, మోసం చేసిన ముగ్గురు సభ్యుల ముఠాను నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్, మహంకాళి పోలీసులు అరెస్ట్ చేశారు. ఓల్డ్ అల్వాల్‌కు చెందిన శివ సంతోష్‌కుమార్ (43), చిత్తూరుకు చెందిన మంజునాథ్‌రెడ్డి (38), బెంగళూరుకు చెందిన ఎస్ఆర్ ప్రతాప్ అలియాస్ రవీందర్‌ప్రసాద్ (44) ముగ్గురు కలిసి ముఠాగా ఏర్పడ్డారు. తమ వద్ద శక్తులున్న రాగి కలశం (రైస్ పుల్లింగ్)

మిగతా 6వ పేజీలో..

డూప్లికేట్ యాప్‌తో రూ. 16.50 లక్షలు లూటీ

ఇన్వెస్ట్‌మెంట్‌లో నమ్మకంగా లాభాలు ఇచ్చే సంస్థ పేరుతో నకిలీ యాప్‌ను తయారు చేసి 62 ఏళ్ల వృద్ధ మహిళను సైబర్ క్రిమినల్స్ దగా చేశారు. ఆమె నుంచి రూ. 16.50 లక్షలు కొల్లగొట్టారు. నగరానికి చెందిన మహిళకు ట్రేడింగ్ యాప్‌లో జాయిన్ కావాలని, ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు ఇస్తామని మోతిలాల్ ఓస్వాల్ ఇన్వెస్ట్‌మెంట్ క్లబ్ పేరుతో ఇన్విటేషన్ వచ్చింది. ఆ మహిళ గతంలో మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అనే సంస్థలో పెట్టుబడులు పెట్టి మంచి లాభాలు అందుకుంది. ఇది కూడా అదే సంస్థ అనే భ్రమలో రూ.16.50 లక్షలు పెట్టుబడి పెట్టింది. ఆ తర్వాత ఎక్కువ మొత్తంలో లాభాలు వచ్చాయని రూ.29లక్షలు చెల్లిస్తేనే విత్‌డ్రా చేసుకునే అవకాశం కల్పిస్తామని బెదిరించారు. అనుమానం వచ్చిన బాధితురాలు వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

THE HYDERABAD DISTRICT CO-OP. CENTRAL BANK LTD.
Head Office, Nampally Station Road, Hyderabad-500001.
RBI Licence No. RPCD(H) Coop.6/05.08.03/2011-12
Reg. No. 21603
Email id: ceo_hyd@hyddccb.org, Website: https://hyderabaddccb.in

Ref: Estate/Vanasthalipuram Rent File 2024-25/01 Dt: 09-10-2024

OFFICE SPACE ON LEASE-QUOTATIONS INVITED

The Hyderabad District Co Operative Central Bank Ltd., HO:Nampally invites quotations for leasing Office space of about 1000-1500 SFT for its branch at Vansthalipuram Area through sealed quotations to General Manager (Estates), 2nd floor, Head Office, HDCC Bank Ltd., 4-4-448, Nampally station road, Hyderabad. ❖ Starting date for submission of bids is 10-10-2024, time: 10:30 AM. ❖ Last date for submission of bids is 19-10-2024 time: 3:00 PM. ❖ For more details contact 9154291749, 9100073212. Sd/- General Manager

విజయదశమి శుభాకాంక్షలతో
నేడే బ్రహ్మాండమైన విడుదల




సంధ్య 35ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.15,2.15,6.15,9.15

మల్లికార్జున 70 - కూకట్‌పల్లి 7.30,11.15,2.30,6.15,9.45
తారకరామ ఎ/సి - కాచిగూడ 11.00,2.15,6.00,9.15
రాజ్యలక్ష్మి 70 ఎ/సి - ఉప్పల్ 11.00,2.30,6.00,9.30
భ్రమరాంబ 70 - కూకట్‌పల్లి 7.45am
సంపూర్ణ 70 - వనస్థలిపురం 11.00,2.15,6.00,9.15
విజేత 70ఎంఎం - బోరబండ 11.00,2.00,6.00,9.00
అర్జున్ 70ఎంఎం - కూకట్‌పల్లి 11.30,2.30,6.30,9.30
శ్రీదేవి - చిలకలగూడ 11.00,2.30,6.00,9.30
అలంకార్ 70 - లంగర్‌హౌస్ 11.00,2.00,6.00,9.00

తమిళ వర్షన్

GLOBAL CINEMAS RELEASE

"DAAVUDI" SONG HAS BEEN ADDED IN THEATERS WATCH @ENJOY
విజయవంతమైన 2వ వారం
DEVARA THANDAVAM



సుదర్శన్ 35ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.30,6.15,9.45

శ్రీలక్ష్మి/ఇంద్ర నాగేంద్ర - కర్మన్‌ఘాట్ 11.15,2.45,6.15,10.00
శివశక్తి 70ఎంఎం - కాప్రా 11.00,2.30,6.00,9.30
ఈశ్వర్ 70 - అత్తాపూర్ 11.00,2.30,6.00,9.30
శ్రీసాయిరాం 70 - మల్కాజిగిరి 11.15,2.45,6.30,10.15

హిందీ వర్షన్

విజయదశమి శుభాకాంక్షలతో
రేపే బ్రహ్మాండమైన విడుదల



విజయదశమి శుభాకాంక్షలతో
ఈనెల 12న బ్రహ్మాండమైన విడుదల



దేవి 70ఎంఎం - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

మల్లికార్జున 70 - కూకట్‌పల్లి
మెగా 70ఎంఎం - దిల్‌సుఖ్‌నగర్
సినీపొలిస్ సుదర్శన్ 70 - భైరమాల్‌గూడ
పృథ్వీ కాంప్లెక్స్ ఎ/సి - కాటేదాన్
లక్ష్మీకళ సినీప్లెక్స్ - మూసాపేట్
శ్రీలక్ష్మి/ఇంద్రనాగేంద్ర - కర్మన్‌ఘాట్
తాక్కూర్ కాంప్లెక్స్ - ఇ.సి.ఐ.ఎల్
శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
షా షహెన్‌షా - చింతల్
టివోలి - సికింద్రాబాద్
వెంకటరమణ సద్భావతి - కాచిగూడ

విజయదశమి శుభాకాంక్షలతో
రేపే బ్రహ్మాండమైన విడుదల



తెలుగు వర్షన్
హిందీ వర్షన్

యూఎస్‌ఏ లాస్‌వేగాస్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

హైదరాబాద్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు చారిత్రాత్మక ప్రాశస్త్యంగల పర్యాటక కేంద్రాలకు అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం కల్పించేందుకు యూఎస్‌ఏ లాస్‌వేగాస్‌లోని ఐమెక్స్ అమెరికా 2024 పేరిట జరుగుతున్న వాణిజ్య ప్రదర్శనలో ఏర్పాటుచేసిన తెలంగాణ పర్యాటక స్టాల్‌లో ప్రవాసీ మహిళల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. రెండురోజులుగా జరిగిన రోడ్‌షోలో రాష్ట్రపర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లికృష్ణారావు, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన గ్లోబల్ సమావేశాలు, చర్చగోష్ఠిలో తెలంగాణలో అంతర్జాతీయ స్థాయిలో ప్రఖ్యాతి పొందిన చార్మినార్, గోల్కొండతోపాటు యునెస్కో గుర్తించిన రామప్ప టెంపుల్‌ను సందర్శించేందుకు రావాలని ఐమెక్స్ అమెరికా 2024లో పాల్గొన్న వివిధ దేశాల ప్రతినిధులను ఆహ్వానించారు. గురువారం రోడ్‌షోతోపాటు సద్దుల బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తామని పర్యాటక శాఖ అధికారి ఓంప్రకాష్ తెలియజేశారు.

కలశం పేరిట కపటం

(5వ పేజీ తరువాయి)

ఉందని, దీనిని అధిక ధరలకు విక్రయించవచ్చని ప్రచారం చేసుకున్నారు. మంజునాథ్‌రెడ్డికి స్నేహితుడి ద్వారా పరిచయమైన శశికాంత్‌కు కలశం గురించి చెప్పాడు. ఈ కలశానికి ఎన్నో శక్తులు ఉన్నాయని, దీనిని 'అప్రీచెస్ అండ్ రీసెర్చ్' సంస్థ రూ.10 కోట్లుపెట్టి కొనడానికి సిద్ధంగా ఉందని నమ్మించారు. మంజునాథ్‌రెడ్డి, శశికాంత్ సికింద్రాబాద్‌లోని ఓ హోటల్‌లో సమావేశమయ్యారు. అదే సమయంలో శివ సంతోష్‌కుమార్ 'అప్రీచెస్ అండ్ రీసెర్చ్' సంస్థ ప్రతినిధిగా వచ్చాడు. కలశం శక్తులను పరీక్షించాలంటే ప్రత్యేక యంత్రాల ద్వారానే సాధ్యమని ఈ స్కానర్లు డీఆర్‌డీఓ వంటి సంస్థల వద్దే ఉంటాయన్నాడు. పరీక్ష పూర్తయిన తర్వాత కొంటామని, దీనికి రూ.25 లక్షలు ఖర్చవుతుందని మంజునాథరెడ్డి చెప్పాడు. దానికి అంగీకరించిన శశికాంత్ రూ.25 లక్షలు ఇచ్చాడు. స్కానింగ్‌కు మరో రూ.23 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేయగా, దాంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు శశికాంత్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిఘా పెట్టిన పోలీసులు మంజునాథ్‌రెడ్డి, శివ సంతోష్‌కుమార్, ప్రతాప్‌లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.25 లక్షల నగదు, వెండి కలశం, 7 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

నచ్చిన లాంగ్వేజీ కాదని..

(5వ పేజీ తరువాయి)

భావిస్తున్న తరుణంలో అధికారులు బలవంతంగా ఇతర లాంగ్వేజీకి పంపించారని పలువురు అభ్యర్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఉదాహరణకు బండ్లగూడకు చెందిన ఒక అమ్మాయి ఉర్దూ మీడియంలో ఎస్‌జీటీ రాస్తే జిల్లా 6వ ర్యాంకు వచ్చింది. అలాగే ఇంగ్లిష్ మీడియంలో 267 ర్యాంకు వచ్చింది. అయితే తాను ఇంగ్లిష్ మీడియం పోస్టును వదులుకుని ఉర్దూలో చేరుతానని కోరినా ఇంగ్లిష్ మీడియంలో జాయిన్ కావాలని నియామకపత్రమివ్వడంతో ఆమె నిరుత్సాహానికి లోనవుతున్నారు. సికింద్రాబాద్‌కు చెందిన మరో అభ్యర్థి తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో ఎస్‌జీటీ పోస్టులకు పరీక్ష రాస్తే రెండింట్లో ఎంపికయ్యారు. సర్టిఫికెట్ల పరిశీలన తర్వాత ఆయనను ఇంగ్లిష్ మీడియంలో చేరాలంటూ చెప్పారు. తాను తెలుగులో చేరుతానని ప్రాధేయపడినా ఇంగ్లిష్ మీడియంలో చేరాలని నియామకపత్రాన్ని అందజేయడంతో అసంతృప్తికి లోనవుతున్నారు.

అప్పుడు అవకాశమిచ్చి..

డీఎస్సీ సమయంలో రెండు మీడియంలలో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశమిచ్చిన అధికారులు.. ఇప్పుడు నచ్చిన దానిలో చేరకుండా అడ్డుకట్ట వేశారని పలువురు అభ్యర్థులు వాపోతున్నారు. ఇతర జిల్లాల్లో డిక్లరేషన్ అడిగారని.. హైదరాబాద్‌లో మాత్రం అలాంటిది పట్టించుకోకుండా డిఫాల్ట్‌గా చేశారని వాపోతున్నారు. కాగా, ఒక మీడియం బదులు మరో మీడియంలో చేరిన వారిలో దాదాపు 45 మంది వరకు ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, 31 పీఈటీలు, 33 స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్‌జీటీ పోస్టులను కోర్టు కేసు కారణంగా భర్తీ చేయకుండా నిలిపివేయడంతో మెరిట్ అభ్యర్థులు నిరుత్సాహానికి గురవుతున్నారు.

బీఆర్ఎస్ నేత సలాఉద్దీన్ లోధి హౌస్ అరెస్ట్


హౌస్ అరెస్టులో ఉన్న సలాఉద్దీన్ లోధి

చార్మినార్ అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన అంటూ గొప్పలు చెప్పుకునే ప్రభుత్వం ఇనుప కంచెలు తొలిగించామని, ధర్నాచౌక్ తెరిచామని ఒక వైపు చెబుతూ.. మరోవైపు శాంతియుతంగా పాదయాత్ర చేపడితే ఎందుకు అడ్డుకుంటుందని చార్మినార్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ సలాఉద్దీన్ లోధి అన్నారు. బుధవారం మీర్‌చౌక్ పోలీసులు ఆయన్ను హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పథకాలను అమలు చేయడం చేతకాక పోలీసుల సహాయంతో అక్రమ అరెస్టులు చేస్తున్నారన్నారు. రోజురోజుకు ప్రజాస్వామ్యం కూనీ అవుతుందన్నారు. నాయకులు సైఫుద్దీన్ లోధి, వహీద్, అహ్మద్ తదితరులు ఉన్నారు.


సభ్యత్వ నమోదు చేయిస్తున్న బీజేపీ నాయకులు

ఎర్రబోడలో బీజేపీ సభ్యత్వ నమోదు

రాజేంద్రనగర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీలో చేరి పార్టీ సభ్యత్వం తీసుకోవడానికి ప్రజలు ఉత్సాహం చూపుతున్నారని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంజయ్ గణతే అన్నారు. బుధవారం రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని ఎర్రబోడలో బీజేపీ సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంజయ్ గణతే పాల్గొని ఆన్‌లైన్‌లో ప్రజలకు సభ్యత్వం అందజేశారు. ప్రతి బూత్‌లో 200 మందికి తగ్గకుండా సభ్యత్వ నమోదు చేయించాలని పార్టీ కార్యకర్తలకు ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎం.కొమురయ్య, డి.సత్యనారాయణ ముదిరాజ్, వెంకటేశ్, మల్లేశ్ చారి, ఎల్.వెంకటేశ్, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు వాగ్దానాలతో ప్రతీసారి గెలవలేరు


షర్ఫుద్దీన్‌హమీద్

పహాడిషరీఫ్ అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక, తెలంగాణలో హామీల అమలులో వైఫల్యంతోనే హరియాణాలో కాంగ్రెస్ ఏడు గ్యారెంటీలను ప్రజలు విశ్వసించలేదని జల్‌పల్లి మున్సిపాలిటీ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫుద్దీన్ హమీద్ అన్నారు. బుధవారం ఆయన ఎర్రకుంటలోని కార్యాలయంలో మాట్లాడుతూ.. మోసం ఎప్పుడూ చెల్లదని, ప్రజలు చాలా తెలివైన వారన్నారు. తప్పుడు వాగ్దానాలతో ఒకసారి గెలుపొందవచ్చేమో కానీ మరోసారి గెలవలేరని, అందుకు నిన్న వెలువడిన హరియాణా ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు.

పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి


వాటర్‌వర్క్స్ సీజీఎంతో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

అఫ్జల్‌గంజ్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వాటర్‌వర్క్స్ జనరల్ పర్పస్, స్పెషల్ పర్పస్ ఉద్యోగులకు పదోన్నతి కల్పించాలని యూనియన్ గుర్తింపు సంఘం అధ్యక్షుడు జి.రాం బాబు యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ జి.లక్ష్మీనారాయణ, చీఫ్ వైస్‌ప్రెసిడెంట్ బి.కొమరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వాటర్‌వర్క్స్ సర్కిల్-1 సీజీఎం వినోద్ భార్గవ్‌ను కలిసి వారు కోరారు. జనరల్ పర్పస్ ఉద్యోగులకు పదోన్నతులు లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జీపీ ఉద్యోగులను ఎస్పీలుగా, ఎస్పీలను టెక్నికల్ గ్రేడ్-2గా పదోన్నతి కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

బాలాపూర్ ఇన్‌స్పెక్టర్‌గా
సుధాకర్ బాధ్యతలు


సుధాకర్

పహాడిషరీఫ్ అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బాలాపూర్ ఇన్‌స్పెక్టర్‌గా బుధవారం ఎం.సుధాకర్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ భూపతి బదిలీ కావడంతో సుధాకర్ ఇక్కడకు వచ్చారు. శాంతిభద్రతల విషయంలో ప్రజలు, నాయకులు సహకరించాలని ఆయన కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలు చేయాలి

బర్కత్‌పుర, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలు చేయాలని ధర్మ టీచర్స్ యూనియన్ తెలంగాణ అధ్యక్షుడు పి.లింగమల్లు యాదవ్, ప్రధాన కార్యదర్శి బి.సుధాకర్ డిమాండ్ చేశారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఉన్నత విద్యార్హతలు పొందేందుకు ఓడీ సౌకర్యాన్ని అందించడానికి 342 జీవోను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు ఇహెచ్ఎస్ అందించాలని, డీఈవో, డిప్యూటీ డీఈవో, ఎంఈవో పోస్టులను మంజూరు చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, 5 డీఏలను తక్షణమే ప్రకటించాలని కోరారు.


గోశాలను ప్రారంభిస్తున్న సనాతన సేవా సమితి సభ్యులు

నల్లపోచమ్మ ఆలయంలో గోశాల ప్రారంభం

రాజేంద్రనగర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవుపల్లి డివిజన్ బాబుల్‌రెడ్డినగర్‌లో గల నల్ల పోచమ్మ దేవాలయంలో బుధవారం గోశాలను ప్రారంభించారు. సనాతన సేవా సమితి ఆధ్వర్యంలో ఈ గోశాలను ఏర్పాటు చేశారు. గోమాతను పూజిస్తే 33 కోట్ల మంది దేవతలను పూజించినట్లేనని సమితి సభ్యులు పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం


షాహిబాజ్‌ఖాన్

చార్మినార్ అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పిల్లలకు తినడానికి ఏదైనా తీసుకొస్తానని బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. భవానీనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తలాబ్ కట్ట సమద్ హోటల్ సమీపంలో నివసించే షాహిబాజ్ ఖాన్ ఈనెల 4న పిల్లలకు స్నాక్స్ తెస్తానని బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో స్నేహితులు, బంధువుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించకపోవడంతో అతడి భార్య సనా పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ట్రూప్ బజార్‌లో ఏర్పాటు చేసిన మండపంలో పూజలు చేసిన ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి తదితరులు


కందికల్‌గేట్ గంగపుత్ర సంఘంలో అమ్మవారికి పూజలు చేస్తున్న ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి


బంజావాడి మరాఠీ బస్తీలో పూజలు చేసిన కార్వాన్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మిత్ర కృష్ణ, సీఐ సునీల్


మీరాలం మండి మహాకాళేశ్వర ఆలయంలో భక్తులకు వెండి నాణేలు అందజేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య

వైభవంగా శరన్నవరాత్రి వేడుకలు

దసరా శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాల్లో బుధవారం మహిళలు, చిన్నారులు పూజలు చేశారు. పలు మండపాల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రజాప్రతినిధులు, పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు అమ్మవారి మండపాలను సందర్శించి పూజలు నిర్వహించారు.

- ఆబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం


మీరాలం మండి మహాకాళేశ్వర ఆలయంలో సరస్వతి దేవి అలంకారంలో పూజలందుకుంటున్న అమ్మవారు


శామీర్‌పేట కట్టమైసమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, మేడ్చల్ మల్కాజ్‌గిరి డీసీసీ ప్రెసిడెంట్ హరినాథ్‌రెడ్డి తదితరులు


జల్‌పల్లిలోని శ్రీరామ్‌కాలనీలో మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, సీనియర్ నేత దేప భాస్కర్‌రెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ పాండురంగారెడ్డి, కౌన్సిలర్ యాదగిరి, కొండల్‌యాదవ్, లక్ష్మీనారాయణ తదితరులు


రియాసత్ నగర్ డివిజన్ రాజనర్సింహ కాలనీలో మండపంలో భక్తులు


విద్యుత్ సైబర్ సిటీ సర్కిల్ కార్యాలయంలో పూజల్లో పాల్గొన్న సర్కిల్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ దంపతులు


గోడేకీ కబర్ ఆవరణలో గల మైసమ్మ అమ్మవారికి వెండి కిరీటం బహూకరించిన ఉప్పరపల్లి నవీన్‌కుమార్ కుటుంబ సభ్యులు

నగరంలో నాడ హబ్బ వేడుకలు అభినందనీయం

- ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఏడాది నగరంలో 9 రోజుల పాటు నాడ హబ్బ దసరా ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ అన్నారు. కాచిగూడలోని కర్ణాటక సాహిత్య మందిర ఆధ్వర్యంలో బుధవారం నాడ హబ్బ ఉత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. 1936లో హైదరాబాద్ రాష్ట్రంలో ఏర్పాటైన కర్ణాటక సాహిత్య మందిరం 89 ఏళ్లుగా కన్నడ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఎంతో కృషి చేస్తోందన్నారు. వేడుకల్లో ప్రముఖ కన్నడ జానపద కళాకారులు కేఎస్ మంజునాథ్, రాజ్‌గురు హోస్కోటే గీతాలాపన ఆకట్టుకుంది. కార్యక్రమంలో కర్ణాటక సాహిత్య మందిర అధ్యక్షుడు సురేంద్ర కట్టెరి, కార్యదర్శి నర్సింహమూర్తి జొయ్స్, రిటైర్డ్ న్యాయమూర్తి సుధీంద్ర కులకర్ణి, జి.భీమ్‌సేన్, ప్రహ్లాద్ జోషి, ముకుంద్ కులకర్ణి, ఉషా జోషి, ప్రమీలా కులకర్ణి, బస్వరాజ్ లారా తదితరులు పాల్గొన్నారు.


ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ను సన్మానించిన కర్ణాటక సాహిత్య మందిర అధ్యక్షుడు సురేంద్ర కట్టెరి, కార్యదర్శి నర్సింహమూర్తి జొయ్స్

ఘనంగా మాతా వైష్ణవీ విశాల్ జాగరణ్


కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

కార్వాన్, అక్టోబర్ 8 (ఆంధ్రజ్యోతి): కార్వాన్ ధార్మిక ఉత్సవ సమితి, కొల్లూరి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో దర్బార్ మైసమ్మ చౌరస్తాలో మంగళవారం రాత్రి మాతా వైష్ణవిదేవీ విశాల్ జాగరణ్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చేవేళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఖైతరాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు జీవన్‌సింగ్, బీజేవైఎం నాయకుడు దేవర వంశీ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్వాన్ చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు. కొల్లూరి అర్జున్, అనుషా దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా బతుకమ్మ సంబురాలు


బతుకమ్మ ఆడుతున్న జయశంకర్ విశ్వవిద్యాలయం ఉద్యోగులు, వేడుకల్లో పాల్గొన్న రిజిస్ట్రార్ డాక్టర్ పి.రఘురామిరెడ్డి


పీవీ నర్సింహారావు విశ్వవిద్యాలయంలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఉద్యోగులు

రాజేంద్రనగర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బుధవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. వర్శిటీ పరిపాలనా భవనం ఆవరణలో గౌరమ్మకు రిజిస్ట్రార్ డాక్టర్ పి.రఘురామిరెడ్డి పూజలు చేసి బతుకమ్మ ఉత్సవాలను ప్రారంభించారు. మహిళా ఉద్యోగులు బతుకమ్మ ఆడారు.

పీవీ నర్సింహారావు విశ్వవిద్యాలయంలో..

రాజేంద్రనగర్‌లోని పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం ఆవరణలో బుధవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళా ఉద్యోగులు, అధికారులు ఆటలు ఆడిపాడారు. విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు డాక్టర్ ఎం.జ్ఞానప్రకాశ్, డాక్టర్ టి.రఘునందన్, డాక్టర్ ఎం.ఉదయ్‌కుమార్, డాక్టర్ మాధురి, డాక్టర్ నళిని, మహ్మద్ షర్ఫుద్దీన్, ఆర్.సుదర్శన్, టి.నర్సింహ, సి.మధుసూదన్, జి.అంజి, ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు చేయాలని వినతి..

హైదర్‌గూడ ప్రణవభక్త సమాజం ఆధ్వర్యంలో బుధవారం శివానగర్ పెద్ద తాళ్లకుంటను పరిశీలించారు. గురువారం బతుకమ్మ సంబరాలు నిర్వహించి పెద్ద తాళ్లకుంటలో బతుకమ్మలను వదులుతారని, అందుకోసం ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరారు. హైదర్‌గూడ, ఉప్పర్‌పల్లి, శివానగర్, క్రిష్ణానగర్, కేశవ్‌నగర్, రాధాక్రిష్ణనగర్, కాంతారెడ్డినగర్ కాలనీ వాసులు బతుకమ్మలను తీసుకుని పెద్ద తాళ్లకుంట వస్తారని చెప్పారు. గుర్రపు డెక్కను తొలగించాలని రాజేంద్రనగర్ సర్కిల్ ఇంజనీరింగ్ విభాగం ఏఈ నర్సింహమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎ.రాజును కోరారు. సమాజం అధ్యక్షుడు మోంద్ర నర్సింహ, ప్రధాన కార్యదర్శి పుస్తకాల అశోక్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


చార్మినార్ నియోజకవర్గ బీజేపీ నాయకులు టీ.ఉమామహేంద్ర, సురేందర్, కునాల్‌రావు, ప్రణీత్, ముకేశ్ బుధవారం కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కలిసి సన్మానించారు.


లాల్‌దర్వాజ సింహవాహిని మహంకాళి ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఆహ్వానిస్తున్న ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కె.వెంకటేశ్


నాటక ప్రదర్శనలోని ఓ దృశ్యం


కార్యక్రమానికి హాజరైన టి.నిర్మలారెడ్డి

బతుకమ్మ వేడుకల్లో భాగంగా తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో బుధవారం నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తెలంగాణ సంగీత అకాడమీ చైర్‌పర్సన్ ఆచార్య అలేఖ్య పుంజుల అధ్యక్షతన నిర్వహించిన యువ కళోత్సవం కార్యక్రమానికి రాష్ట్ర ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ టి.నిర్మలారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

గురుకుల పాఠశాలలపై
అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి

- మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య


సమావేశంలో అభివాదం చేస్తున్న మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ తదితరులు

బర్కత్‌పుర, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలపై రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటించిందని గురుకుల పాఠశాలలను రద్దు చేస్తారేమోనని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ, రాష్ట్రంలో 330 బీసీ గురుకులాలు, 246 ఎస్సీ గురుకులాలు, 140 ఎస్టీ గురుకులాలు, 206 మైనారిటీ, 50 జనరల్ గురుకుల పాఠశాలలు ఉన్నాయన్నారు. వీటి అభివృద్ధిపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎస్టీ, ఎస్సీ, మైనారిటీ విద్యార్థుల ఫీజు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బీసీ సంక్షేమ శాఖ 1525 కోట్ల ఫీజు బకాయిలను విడుదల చేసిందని, మరో 3 వేల కోట్ల బకాయిలను కూడా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు నీల వెంకటేష్, జి.మల్లేష్‌యాదవ్, జిల్లపల్లి అంజి, కోల జనార్ధన్, నందగోపాల్, కీర్తిలత గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఫాతిమానగర్‌లో వ్యక్తి హత్య

చాంద్రాయణగుట్ట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కత్తితో దాడి చేయడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన ఫలక్‌నుమా పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఫలక్‌నుమాలోని గఫూరియా మసీద్ ఫాతిమానగర్‌కు చెందిన మొహమ్మద్ సాజీద్(37)కు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అదే ప్రాంతానికి చెందిన సిద్దిఖ్ బుధవారం రాత్రి సాజీద్ ఇంటికి వచ్చి గొడవకు దిగాడు. ఈ క్రమంలో సాజీద్‌ను సిద్దిఖ్ కత్తితో పొడవడంతో తీవ్రగాయాలపై మృతిచెందాడు. వివాహేతర సంబంధమే హత్యకు కారణమని పోలీసులు భావిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
గోవిందరావు : 9703618721, రాజ్ కుమార్: 9985921389
కె. అనిల్ కుమార్: 99854 03628







నకిలీ టీ పౌడర్ తయారీ గుట్టు రట్టు

- 300 కిలోలు స్వాధీనం
- ముగ్గురి అరెస్ట్


నిందితులు, స్వాధీనం చేసుకున్న టీ పౌడర్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి చిప్పల పొడి, విషపూరిత కెమికల్స్ కలిపి, రుచికోసం యాలకులు, చాక్లెట్ ఫ్లేవర్స్ కలిపి నకిలీ టీ పౌడర్ తయారు చేసి విక్రయిస్తున్న ముఠా గుట్టు రట్టు చేశారు సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి 300 కిలోల నకిలీ టీ పౌడర్, 200 కిలోల కొబ్బరి చిప్పల పొడి స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుదీంద్ర తెలిపిన వివరాల ప్రకారం..

బిషోయ జగన్నాథ్ టీ పొడి ఉత్పత్తుల వ్యాపారం చేస్తున్నాడు. ఫతేనగర్‌లో కోణార్క్ టీ పౌడర్ పేరుతో సేల్స్, సప్లయర్ గోదామును నిర్వహిస్తున్నాడు. అక్కడ కల్తీ టీ పౌడర్ తయారుచేసి విక్రయిస్తున్నట్లు సెంట్రల్ జోన్ పోలీసులకు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ బృందం గోదాముపై దాడి చేసింది.

అక్కడ పనిచేస్తున్న ఒడిశాకు చెందిన ప్రతాప్ ప్రధాన్, శివస్వన్ పరిదాను అదుపులోకి తీసుకుని విచారించారు. కొబ్బరి చిప్పల పొడి, రసాయనాలు, రుచికోసం చాక్లెట్ ఫ్లేవర్స్, యాలకులు, మిల్క్ ఫ్లేవర్స్ కలిపి నకిలీ టీ పౌడర్ తయారు చేసి హోల్‌సేల్ డీలర్లకు రూ.80-100, ప్రజలకు కిలో రూ.200-250కి విక్రయిస్తున్నట్లు అంగీకరించారు. వారిచ్చిన సమాచారం మేరకు బిషోయ జగన్నాథ్‌ను పట్టుకున్నారు. జగన్నాథ్‌పై గతంలో మోమిన్‌పేట, సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్లలో కేసు నమోదయ్యాయి. పోలీసులు స్వాధీనం చేసుకున్న సామగ్రిని ఫుడ్ సేఫ్టీ అధికారులకు అప్పగించారు.

కల్తీ కల్లు తయారీ కోసం..

- క్లోరోహైడ్రేట్ సరఫరా చేస్తున్న ముగ్గురి అరెస్ట్
- 56 కిలోలు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కల్తీకల్లు తయారీలో వినియోగించే క్లోరోహైడ్రేట్‌ను మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటక ప్రాంతాలకు తరలిస్తున్న అంతరాష్ట్ర ముఠా సభ్యులు ముగ్గురిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 56 కిలోల క్లోరో హైడ్రేట్‌ను స్వాధీనం చేసుకున్నారు.

హైదరాబాద్ బాలానగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జనవరి 3న 560 కిలోల క్లోరో హైడ్రేట్‌ను అధికారులు పట్టుకున్నారు. ఈ కేసులో క్లోరో హైడ్రేట్ సరఫరాలో 8 మందికి సంబంధం ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఆరుగురిని అరెస్ట్ చేశారు. ఇద్దరు పరారీలో ఉన్నారు. వారిని పట్టుకోవాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి రంగారెడ్డి ఏఈఎస్ జీవన్‌కిరణ్‌ను ఆదేశించారు. పరారీలో ఉన్న నిందితుల ఆచూకీ తెలుసుకోవడానికి బాలానగర్‌లో అరెస్టయిన ముఠా కింగ్ పిన్ రామాగౌడ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఏఈఎస్ జీవన్ కిరణ్, ఏఈఎస్ మాధవయ్య, సీఐలు సుభాష్ చందార్‌రావు, నర్సిరెడ్డి, వేణుకుమార్, ఎస్‌ఐలు బాలు, అఖిల్ మహారాష్ట్ర వెళ్లారు.

నవీ ముంబాయిలోని కలోజా పోలీస్ స్టేషన్ పరిధిలో ఎంఐడీసీ చీవండి ప్రాంతంలో రాజ్‌బాయ్ అలియాస్ రాజు పొన్నం అనే వ్యక్తి ఇంటిపై దాడి చేయగా.. రెండు కిలోల క్లోరోహైడ్రేట్ లభించింది. పట్టుబడిన నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు బుర్ర రమేష్ ఇంట్లో తనిఖీ చేసి 25 కేజీల క్లోరోహైడ్రేట్ స్వాధీనం చేసుకున్నారు. తర్వాత పుణెలో ఉంటున్న బండారి రాజ్‌కుమార్ అలియాస్ రాజు ఇంట్లో సోదాలు చేయగా 29 కిలోల క్లోరోహైడ్రేట్ లభించింది.

పట్టుబడిన నిందితులను విచారించగా.. బండారి రాజ్‌కుమార్‌కు క్లోరోహైడ్రేట్ తయారు చేసే పరిశ్రమ ఉన్నట్లు తేలింది. క్లోరో హైడ్రేట్ తయారు చేసి తన అనుచరుల ద్వారా మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారు. 29 కిలోల క్లోరోహైడ్రేట్ బ్యాగును రూ. 35వేలకు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ముఠాలో నిర్మల్‌కు చెందిన రామాగౌడ్ కీలకంగా వ్యవహరిస్తున్నట్లు తేలింది.

కుల నిర్మూలనోద్యమ కార్యకర్త

అరిగె భారతీదేవి కన్నుమూత


భారతీదేవి(ఫైల్)

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కుల నిర్మూలనోద్యమంలో కొన్నిదశాబ్దాల పాటు చురుగ్గా పాల్గొన్న అరిగె భారతీదేవి(94) కన్నుమూశారు. కొంత కాలంగా ఆరోగ్య సమస్యలతో మంచానికే పరిమితమైన ఆమె మంగళవారం రాత్రి 8.45 గంటలకు సికింద్రాబాద్, కుమ్మరిగూడలోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. తెలంగాణ తొలితరం దళితోద్యమ నేత, మాజీ మంత్రి అరిగె రామస్వామి కుమారుడు భాస్కరరావుకు, ఆంధ్రా సంఘసంస్కరణోద్యమాలలో ముఖ్యపాత్ర పోషించిన ఉమ్మడి గుంటూరు జిల్లా, పెద్దపులివర్రు గ్రామానికి చెందిన గుత్తా వారి ఆడపడుచు భారతీదేవికి 1947, ఏప్రిల్ 14న సంప్రదాయాలకు భిన్నంగా దండల పెళ్లి జరిగింది. గోపరాజు రామచంద్రరావు(గోరా) నాయకత్వంలోని కుల నిర్మూలనోద్యమంలో భాగంగా పెద్దలు కుదిర్చిన తొలి కులాంతర వివాహం ఇదే అని చరిత్ర అధ్యయనకారులు చెబుతారు. తండ్రి గుత్తా రామాంజనయ్యతో పాటు ఆమె కూడా జాతీయోద్యమంలో పాల్గొన్నారు. భర్తతో కలిసి కులాంతర వివాహాలు జరిపించారు. ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా నిరసన దీక్షల్లో పాల్గొని 16 రోజులు జైలు శిక్ష అనుభవించారు.

భారతీదేవి, భాస్కరరావు దంపతులకు అరుగురు కుమార్తెలు, కుమారుడు. భర్త, కుమారుడు కొంతకాలం క్రితం కన్నుమూశారు. సామాజిక ఉద్యమకారిణి సజయ, పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య, బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపక కార్యదర్శి గుమ్ముల జ్ఞానేశ్వర్.. భారతీదేవి భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు. బుధవారం మధ్యాహ్నం బన్సీలాల్‌పేటలోని శ్మశానవాటికలో ఆమె అంత్యక్రియలు జరిగాయి.

చిట్టీ డబ్బు ఇవ్వడం లేదని చంపేశాడు

ఆర్‌ఎంపీ సతీమణి హత్య కేసులో నిందితుడి అరెస్టు


నిందితుడు జావెద్ ఖాన్

బంజారాహిల్స్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): చిట్టీ డబ్బు ఇవ్వడం లేదనే ఆగ్రహంతో ఓ ఆటోడ్రైవర్ మహిళను హత్య చేశాడు. ఎల్లారెడ్డిగూడ ప్రాంతంలో సెప్టెంబరు 30న జరిగిన ఆర్‌ఎంపీ భార్య హత్య కేసును పోలీసులు ఛేదించారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. ఎల్లారెడ్డిగూడ నవోదయ కాలనీలో నివసిస్తున్న ఉమామహేశ్వరరావు అనే ఆర్‌ఎంపీ భార్య సుధారాణి(44), ఇద్దరు పిల్లలు ఉన్నారు. సెప్టెంబరు 30న ఉమామహేశ్వరరావు తన ఆస్పత్రి నుంచి ఇంటికి వెళ్లేసరికి సుధారాణి రక్తపుమడుగులో కనిపించింది. విషయం తెలిసి ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు సుధారాణి గొంతు కోసి చంపిన దుండగులు ఇంట్లో బంగారాన్ని అపహరించినట్లు గుర్తించారు.

కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. భుజాన బ్యాగు వేసుకుని కాలనీలోకి ప్రవేశించిన ఓ వ్యక్తి తిరిగి సూట్‌కేసుతో వెళ్లడాన్ని సీసీ కెమెరా ఫుటేజీల్లో గుర్తించారు. సుధారాణి కాల్‌డేటా పరిశీలించగా హత్యకు ముందు ఒకే నంబర్ నుంచి ఎక్కువ ఫోన్ కాల్స్ ఉన్నట్లు కనిపెట్టారు. ఈ రెండింటి ఆధారంగా వరంగల్ జిల్లా కాజీపేటకు చెందిన షేక్‌జావెద్ అలియాస్ జావెద్ ఖాన్ అనే ఆటోడ్రైవర్‌ను మంగళవారం అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. జావెద్ ఖాన్ చిట్టీ నిమిత్తం సుధారాణికి ప్రతి నెలా రూ.10 వేలు చెల్లించాడు. చిట్టీ పూర్తయినా తనకు రావాల్సిన రూ.2.80 లక్షలను సుధారాణి ఇవ్వకపోగా, డబ్బు కోసం ఒత్తిడి చేస్తే ఆత్మహత్య చేసుకుని కేసులో ఇరికిస్తానని బెదిరించడంతో ఆమెపై కక్ష పెంచుకున్నాడు. దీంతో ఆమెను హతమార్చాలని పథకం వేసి సెప్టెంబరు 27, 28 తేదీల్లో విఫలయత్నం చేశాడు.

ఈ క్రమంలో 30వ తేదీన సుధారాణి ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో వెళ్లి కత్తితో ఆమె పీక కోసి ఇంట్లో ఉన్న నగల పెట్టె తీసుకుని పారిపోయాడు. పోలీసులు నిందితుడి వద్ద నుంచి 6.5 తులాల బంగారు ఆభరణాలు, కత్తి, ద్విచక్ర వాహనం, కారు స్వాధీనం చేసుకున్నారు.

'జేసీజేను, రాష్ట్రపతి బంధువును'

హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కె. సురేష్ జూనియర్ సివిల్ జడ్జి' అతడికి ఫోన్ చేసినా, అతడి నుంచి ఫోన్ వచ్చినా ట్రూ కాలర్‌లో కనిపించే పేరు. వాహనంపై ప్రొటోకాల్ స్టిక్కర్.. అంతేనా.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బంధువునంటూ బిల్డప్.. అడిగింది ఇవ్వండి చాలు.. నా పరపతితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ఏ పనైనా చేయిస్తానంటూ పెద్దమొత్తంలో వసూళ్లు చేసి తెలుగు రాష్ట్రాల్లో ఘరానా మోసాలకు పాల్పడిన ఓ వ్యక్తి చేసిన గిమ్మిక్కులివి. అతడి బాధితులు కొందరు పోలీసులను ఆశ్రయించడంతో ఈ బాగోతం వెలుగులోకి వచ్చింది. ఏపీలోని ఒంగోలు జిల్లా ప్రాసంగపాడుకు చెందిన కంచర్ల సురేష్‌కు నేర చరిత్ర ఉంది. కడప జిల్లాకు చెందిన ఓ న్యాయవాది ఐడీ కార్డును మార్ఫింగ్ చేసి తన పేరుతో నకిలీ ఐడీ కార్డు తయారు చేసుకున్న సురేష్.. జూనియర్ సివిల్ జడ్జి(జేసీజే)గా తెలంగాణకు ఎంపికైనట్లు సోషల్ మీడియాలో ప్రచారం చేసుకున్నాడు. అదే సమయంలో సమాచార హక్కు చట్టం న్యాయ పోరాట సమన్వయ కమిటీ ఫౌండర్, ఛైర్మన్ తానేనని చెప్పుకున్నాడు. ఆ కమిటీ వ్యవస్థాపకురాలు కావూరి వరలక్ష్మికి తెలియకుండా ఓ వాట్సాప్ గ్రూపు కూడా ప్రారంభించి వేలాది మందిని సభ్యులుగా చేర్చుకున్నాడు. జేసీజేని, రాష్ట్రపతి బంధువుని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో తనకు మంచి పలుకుబడి ఉందని ప్రభుత్వ కార్యాలయాల్లో ఎలాంటి పనినైనా చేయిస్తానని ప్రచారం చేసుకున్నాడు. ఇందులో భాగంగా కలెక్టర్‌లు, ఎస్పీలకు ఇతర అధికారులకు ఫోన్లు చేసి జేసీజేని మాట్లాడుతున్నానంటూ పనులు ఆదేశించేవాడు. ఈ క్రమంలో సురేష్ మాటలు నమ్మిన ఓ వృద్ధురాలు తన భూమి సమస్య పరిష్కరించాలని కోరగా ఆమె నుంచి రూ. 80 వేలు తీసుకున్నాడు. పని కాకపోవడంతో ఆమె అధికారులను ఆశ్రయించగా మోసం విషయం తెలిసింది. తెలుగు రాష్ట్రాల్లో సురేష్ బాధితులు పెద్ద సంఖ్యలో ఉండగా వాళ్ల నుంచి రూ.కోట్లు వసూలు చేసినట్టు బయటపడింది. అయితే, తన నిజస్వరూపం బయటపడడంతో ఆత్మహత్య చేసుకుంటున్నానని వాట్సాప్ గ్రూపుల్లో ఓ మెసేజ్ పెట్టిన సురేష్ ఆ తర్వాత తన సెల్‌ఫోన్లను ఆపేశాడు. ఇన్నాళ్లూ సురేష్‌తో కలిసి పని చేసిన తిరుపతి సురేష్ అనే మరో వ్యక్తి తనకేం సంబంధం లేదని తప్పించుకున్నాడు. బాధితులు పోలీసులకు ఫిర్యాదులు చేయగా సురేష్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అతడి కోసం గాలిస్తున్నట్టు సమాచారం.

కొలువుల పండుగ


సెల్ఫీ తీసుకుంటున్న మహిళా ఉపాధ్యాయులు

బర్కత్‌పుర/రాంనగర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎల్‌బీ స్టేడియంలో బుధవారం నిర్వహించిన కొలువుల పండుగకు మంచి స్పందన వచ్చింది. 11,062 మంది డీఎస్సీ ఉపాధ్యాయులకు నియామకపత్రాలను అందజేయడానికి ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహించిన విషయం విదితమే.

- సీఎం రేవంత్‌రెడ్డి సాయంత్రం 4.30 గంటలకు ఎల్.బి.స్టేడియానికి చేరుకున్నారు. ఉపాధ్యాయులు కుర్చీల్లో నుంచి లేచి కేరింతలు కొడుతూ స్వాగతం పలికారు.
- ముఖ్యమంత్రి దాదాపు 45 నిముషాల పాటు ప్రసంగించారు. సాయంత్రం 5.25 గంటల తర్వాత నియామక పత్రాలు అందజేశారు.
- వేదికపై సీఎంతో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరాం, ఎంపీ అభిషేక్ సంఘ్వీ, ప్రభుత్వ సలహాదారు కేశవరావు, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు ఉన్నారు.
- మధ్యాహ్నం 12 గంటల నుంచే నియామక పత్రాలు అందుకోవడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక ఆర్టీసీ బస్సులలో వివిధ జిల్లాల నుంచి ఎల్‌బీ స్టేడియానికి తరలివచ్చారు.
- బషీర్‌బాగ్ చౌరస్తాలో పీఆర్‌టీయూ భారీ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు.
- నియామక పత్రాలను అందుకోవడానికి వచ్చిన మహిళా ఉపాధ్యాయులు పిల్లలు, కుటుంబ సభ్యులతో కలిసివచ్చారు.
- వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఉపాధ్యాయుల నుంచి సంతకాలు తీసుకుని విద్యాశాఖ అధికారులు నియామకపత్రాలను అందజేశారు.
- సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తున్నప్పుడు ఉపాధ్యాయులు కేరింతలు కొడుతూ మద్దతు తెలిపారు.
- సభ ముగిసిన తర్వాత బషీర్‌బాగ్ పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది.

టీచర్ నియామక పత్రం అందుకోవడం సంతోషంగా ఉంది



టీచర్ పోస్టు కోసం ఎంతో కష్టపడి చదివాను. మహబూబ్‌నగర్ జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు ఎంపికయ్యాను. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో విద్యాశాఖాధికారుల నుంచి నియామకపత్రం అందుకోవడం సంతోషంగా ఉంది. విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాట వేసేందుకు అంకితభావంతో పనిచేస్తాను.

- ఎం.సుష్మిత, మహబూబ్‌నగర్ జిల్లా

ఏళ్ల నిరీక్షణ ఫలించింది



ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిరీక్షణ ఫలించింది. టీచర్ పోస్టుకు ఎంపికై నియామక పత్రం అందుకోవడం ప్రపంచాన్ని జయించినంత ఆనందంగా ఉంది. గత ప్రభుత్వ హయంలో తీవ్ర నిరాశకు గురయ్యాం.

- అశోక్, మక్తల్



మాట్లాడుతున్న సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ సభ్యుడు పీపీ వావా

పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

- సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ సభ్యుడు పీపీ వావా

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ సభ్యుడు డాక్టర్ పీపీ వావా అధికారులకు సూచించారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ఆమ్రపాలి, పలు విభాగాల అధికారులు, వాల్మీకి అసోసియేషన్ ప్రతినిధులతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులకు అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షించారు. వాల్మీకి సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను అసోసియేషన్ ప్రతినిధులు కమిషన్ సభ్యుల దృష్టికి తీసుకురావడంతో వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వావా మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికులకు క్రమం తప్పకుండా ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. కనీస వేతనాలు అమలయ్యేలా పర్యవేక్షించాలని, బీమా సౌకర్యం, పీఎఫ్, ఈఎస్‌ఐ వంటి సదుపాయాలు వర్తించేలా చూడాలన్నారు. ఆయా సంఘాల ప్రతినిధులు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమీక్షలో కమిషన్ సలహాదారుడు వీరేంద్రనాథ్, అడిషనల్ కమిషనర్లు రఘుప్రసాద్, పంకజ, నళిని పద్మావతి జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్‌పాటిల్, అపూర్వ చౌహాన్ రవికిరణ్, ఉపేందర్ రెడ్డి, వెంకన్న, వాల్మీకి అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

13న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో అలయ్ బలయ్


మాట్లాడుతున్న బండారు విజయలక్ష్మి

అమీర్‌పేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈనెల 13న అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని హరియాణ రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె, అలయ్ బలయ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి తెలిపారు. బుధవారం అమీర్‌పేటలోని ఆదిత్యా పార్క్ ఇన్ హోటల్‌లో బీజేపీ నాయకులతో అలయ్ బలయ్ సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దత్తాత్రేయ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్యఅతిథిగా పాల్గొంటున్నారని, మేఘాలయ, ఉత్తరాఖండ్ రాష్ట్రాల గవర్నర్లు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బీజేపీ జాతీయ నాయకులు హాజరవుతారని తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబునాయుడుతోపాటు మంత్రులు, రెండు రాష్ట్రాల ప్రతిపక్షనేతలకు ఆహ్వానాలను అందజేశామన్నారు. కార్యక్రమం ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, బూర్గుల శ్యామ్‌సుందర్‌గౌడ్, గౌతంరావు, ఫౌండేషన్ సభ్యుడు ప్రదీప్, సంఖ్యాశాస్త్ర నిపుణుడు దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు నేషనల్ గేమ్స్ ఆతిథ్య హక్కులు ఇవ్వండి

- పీటీ ఉషను కోరిన జితేందర్‌రెడ్డి


పీటీ ఉషకు పుష్పగుచ్ఛం ఇస్తున్న జితేందర్‌రెడ్డి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): నేషనల్ గేమ్స్ 2027 ఆతిథ్య హక్కులను హైదరాబాద్‌కు కేటాయించాలని భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు పీటీ ఉషను రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సలహాదారుడు, మాజీ ఎంపీ ఏపీ జితేందర్ రెడ్డి కోరారు. బుధవారం న్యూఢిల్లీలోని ఐఓఏ కార్యాలయంలో నేషనల్ గేమ్స్ ఆతిథ్య హక్కుల కోసం చర్చించడానికి ఉషతో ఆయన సమావేశమయ్యారు. హైదరాబాద్‌లో ఉన్న స్పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ గురించి ఆమెకు తెలియజేశారు. సీఎం రేవంత్ రెడ్డి క్రీడారంగానికి ఇస్తున్న ప్రాధాన్యత, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు, రాష్ట్రంలో క్రీడారంగం బలోపేతానికి తీసుకుంటున్న చర్యలు గురించి వివరించారు. జితేందర్ రెడ్డి ప్రతిపాదనలపై ఐఓఏ పాలకమండలిలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఉష హామీ ఇచ్చారు.

కార్మికుల పీఎఫ్ బకాయిలు చెల్లించని

ఉన్నతి ఇండస్ట్రియల్ సొసైటీ నిర్వాహకుడికి జైలు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్మికుల పీఎఫ్ బకాయిలు చెల్లించని సంస్థలపై ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ కఠిన చర్యలకు ఉపక్రమించింది. కార్మికుల పీఎఫ్ బకాయిలు చెల్లించని ఓ సంస్థ నిర్వాహకుడిని జైలుకు పంపారు. ఉన్నతి ఇండస్ట్రియల్ కో-ఆపరేటివ్ సొసైటీ నిర్వాహకుడు రమేష్ పార్థానీ 2004 నుంచి 2010 వరకు కార్మికుల పీఎఫ్ ఖాతాలో డబ్బు జమ చేయడం లేదు. రూ.62,43,480 చెల్లింపు గురించి ఈపీఎఫ్ అధికారులు పలుమార్లు నోటీసులు పంపించినా స్పందించ లేదు. అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు రమేష్ పార్థానీని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. కార్మికుల పీఎఫ్ ఖాతాలో డబ్బులు జమచేయని సంస్థల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని ఈపీఎఫ్ఓ రికవరీ అధికారి తెలిపారు.


కాంగ్రెస్ యువనేతకు

మాజీ ఎమ్మెల్యే మనవరాలి వేధింపులు

- పోలీసులకు బాధితుడి తల్లి ఫిర్యాదు

సరూర్‌నగర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌కు చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు పెద్దబావి నాగనందీశ్వర్‌రెడ్డిని మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి మనవరాలు, రంగారెడ్డి జిల్లా జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి కుమార్తె త్రిషారెడ్డి వేధిస్తోందని బాధితుడి తల్లి పెద్దబావి నిర్మలా నర్సింహారెడ్డి పోలీసులకు ఈనెల 6వ తేదీన ఫిర్యాదు చేశారు. తమ కుటుంబానికి తీగల కుటుంబం నుంచి ప్రాణహాని ఉందని, త్రిషారెడ్డి వేధింపులతో తన కుమారుడు వేరే ప్రాంతంలో తలదాచుకుంటున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె కొంతకాలంగా నాగనందీశ్వర్‌రెడ్డికి రోజూ ఫోన్ చేస్తూ, మెసేజ్‌లు పెడుతూ ఇబ్బంది పెడుతోందన్నారు. విషయాన్ని ఆమె తల్లి అనితారెడ్డికి చెప్పగా.. త్రిషారెడ్డికి సర్దిచెప్పకుండా ఆమెతోపాటు తీగల కృష్ణారెడ్డి, గున్‌రెడ్డి వెంకట్‌రెడ్డి తమ కుమారుడికి ఫోన్ చేసి దుర్భాషలాడి బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తీగల కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలని నిర్మలారెడ్డి కోరారు. ఈ వివాదానికి సంబంధించిన టెలిఫోన్ సంభాషణలు వైరల్ కావడంతో ఫిర్యాదు వెలుగులోకి వచ్చింది.

ఏఏఏఐ బోర్డ్ డైరెక్టర్‌గా కె.శ్రీనివాస్



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అడ్వర్టైజింగ్ ఏజెన్సీస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఏఏఐ) బోర్డ్ డైరెక్టర్‌గా శ్లోకా అడ్వర్టైజింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ కె.శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఇటీవల ఏఏఏఐ సభ్యులు నిర్వహించిన ఎన్నికల్లో వరుసగా మూడోసారి విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనను ఏఏఏఐ బోర్డ్ డైరెక్టర్‌గా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ప్రెసిడెంట్‌గా ఎం మీడియా గ్రూపు సీఈఓ ప్రశాంత్‌కుమార్, రాణా బారువా వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు.

రాజేంద్రప్రసాద్‌కు ప్రభాస్ పరామర్శ



కేపీహెచ్‌బీ ఇందూ విల్లాస్‌లో నివసిస్తున్న సినీ నటుడు రాజేంద్రప్రసాద్‌ను హీరో ప్రభాస్ బుధవారం రాత్రి పరామర్శించారు. ఇటీవల ఆయన కుమార్తె కార్డియాక్ అరెస్ట్‌తో మృతి చెందిన విషయం తెలిసిందే.

- కేపీహెచ్‌బీ, ఆంధ్రజ్యోతి

వేడుక

నేడు సద్దుల బతుకమ్మ

బతుకమ్మ వేడుకల్లో తొమ్మిదో రోజు, చివరి రోజు అయిన ఆశ్వయుజ శుద్ధ అష్టమి (దుర్గాష్టమి- గురువారం) నాడు 'సద్దుల బతుకమ్మ' లేదా 'పెద్ద బతుకమ్మ'గా గౌరమ్మను ఆరాధిస్తారు.. పెద్ద పళ్ళెంలో గుమ్మడి ఆకులు, రంగులు అద్దిన గునుగు పూలు, తంగేడు, ఇతర రంగురంగుల పూలతో బతుకమ్మను పేరుస్తారు. సద్దులను నైవేద్యం పెట్టి, పూజలు చేస్తారు. అనంతరం రాత్రి వరకూ ఆటపాటలతో అమ్మవారిని కొలిచి, బతుకమ్మలను నిమజ్జనం చేస్తారు.



నైవేద్యాలు: మలీద ముద్దలు (లడ్డూలు), చింతపండు పులిహోర, కొబ్బరి అన్నం. నువ్వుల అన్నం, పెరుగన్నం తదితరాలు

దేవీ నవరాత్రులు

నేటి అలంకారం
శ్రీ దుర్గాదేవి

ఆశ్వయుజ శుద్ధ సప్తమి/అష్టమి (దుర్గాష్టమి)- గురువారం



శరన్నవరాత్రుల్లో ఎనిమిదో రోజున విజయవాడ కనకదుర్గమ్మ... శక్తి రూపమైన దుర్గాదేవిగా భక్తులను అనుగ్రహిస్తారు. లోక కంటకుడైన దుర్గమాసురుణ్ణి వధించి, ఇంద్రకీలాద్రిపై దుర్గగా... స్వయంభువై అమ్మవారు వెలసినది ఈ అష్టమి తిథి నాడేనని పురాణాలు చెబుతున్నాయి. అందుకే ఈ అష్టమిని 'దుర్గాష్టమి' అని వ్యవహరిస్తారు. 'దుర్గే దుర్గతినాశని'... అంటే దుర్గతులను నాశనం చేసే వేలుపు దుర్గమ్మ. ఈ రోజున అమ్మవారి దర్శనంతో దుర్గతుల నుంచి తప్పించుకోవచ్చనేది భక్తుల ప్రగాఢ విశ్వాసం. పంచప్రకృతి మహాస్వరూపాల్లో దుర్గా రూపం మొదటిది. ఆమె శక్తి అనంతమైనది. దుర్గాదేవిది ఉగ్రరూపం. అయినా భక్తులపై ఆమె అవ్యాజమైన కరుణ కురిపిస్తుంది. భవబంధాలలో చిక్కుకున్న మానవుణ్ణి దుర్గామాత అనుగ్రహించి మోక్షాన్ని ప్రసాదిస్తుందనీ, కోటి సూర్యప్రభలతో వెలుగొందే అమ్మను అర్చిస్తే శత్రుబాధలు తొలుగుతాయనీ, సర్వత్రా విజయం ప్రాప్తిస్తుందనీ పెద్దలు భక్తుల నమ్మకం.

నైవేద్యం:
చిత్రాన్నం
అలంకరించే చీర రంగు:
ఎరుపు
వేటితో అర్చించాలి:
గులాబీలు, ఎర్రటిపూలు, కుంకుమ
పారాయణ చెయ్యాల్సినవి:
దుర్గా సూక్తం, దుర్గా సప్తశ్లోకి

ప్రత్యేకం



దసరా ఉత్సవాలు అనగానే దక్షిణాదివారికి ముందుగా గుర్తుకువచ్చేది మైసూరు ప్యాలెస్‌లో అంబరాన్నంటే సంబరాలు. కానీ కోనసీమ జిల్లా అమలాపురంలో కూడా శరన్నవరాత్రులు అంతే వేడుకగా జరుగుతాయి.
ప్రభలు... భారీ ఊరేగింపులకు తోడు... ప్రాచీన సంప్రదాయ కళ 'చెడీ తాలింఖానా' ఇక్కడ ప్రత్యేకం. వందల ఏళ్లుగా కొనసాగుతున్న ఈ కళ... యువతీ యువకులు సాహస విన్యాసాలతో ఆసాంతం ఉత్కంఠ రేపుతుంది. ముఖ్యంగా విజయదశమినాడు జరిగే ఉత్సవాలను ప్రత్యక్షంగా వీక్షించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున జనం తరలివస్తారు.

సంస్కృతికి చిహ్నం... ఈ విన్యాసం

ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక... కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో జరిగే దసరా వేడుక. నవరాత్రులు మొదలయ్యాయంటే చాలు... అమలాపురం పట్టణ, పరిసర ప్రాంతాలన్నీ జనంతో కిటకిటలాడతాయి. ఏ వీధి చూసినా ఆనందోత్సాహాల సందడి కనిపిస్తుంది. వీటిని తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాలవారే కాదు... తెలుగు రాష్ట్రాల్లోని వివిధ జిల్లాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలివస్తారు. వీటిల్లో ప్రధాన ఆకర్షణ విజయదశమినాడు నిర్వహించే 'చెడీ తాలింఖానా' విన్యాసాలు. 1835లో అమలాపురంలోని కొంకాపల్లిలో దసరా ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. ఆనాటి నుంచి ఏటా ఇక్కడ పెద్దఎత్తున వేడుక నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా విజయదశమి మహోత్సవాల ముగింపు వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లూ చేసింది.

సంస్కృతికి ప్రతిబింబం...

పండుగనాడు ఐరావతం, రాజహంస వాహనాలపై అమ్మవారి ఉత్సవ మూర్తులతో కొంకాపల్లిలో భారీ ఊరేగింపు నిర్వహిస్తారు. తరతరాలుగా వస్తున్న ఈ ఉత్సవాలకు చారిత్రక ప్రాధాన్యం ఉంది. బ్యాండు మేళాలు, గరిడీలు, కోయ డ్యాన్సులవంటి సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబించే కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకొంటాయి.



యువతుల సాహసం...


ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని వివిధ వీధుల్లో జరిగే చెడీ తాలింఖానాల్లో యువతీ యువకుల ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణ. శిక్షణ పొందిన యువతులు చేసే కర్ర, కత్తిసాముతో పాటు అగ్గిబరాటాలు తిప్పడం లాంటి నైపుణ్య ప్రదర్శనలు చూపరులను విశేషంగా అలరిస్తాయి. గతంలో యువకుల విన్యాసాల పట్ల పట్టణంలోని కొందరు యువతులు ఆకర్షితులయ్యారు. ఇటీవల కాలంలో వారు కూడా విన్యాసాల్లో పాల్గొంటున్నారు. ప్రధానంగా మహిపాల వీధిలోని అబ్బిరెడ్డి రామదాసు చెడీ తాలింఖానా, గండువీధి, కొంకాపల్లి, నల్లావీధితో పాటు వివిధ ప్రాంతాల్లో జరిగే చెడీ తాలింఖానాల్లో వీరి ప్రదర్శనలు చూసేందుకు జనం అమితాసక్తి చూపుతారు.

వీరత్వానికి ప్రతీక...

చెడీ తాలింఖానా వీరత్వానికి ప్రతీకగా భావిస్తారు. మొదట 1856లో మహిపాల వీధిలోని శ్రీఅబ్బిరెడ్డి రామదాసు చెడీ తాలింఖానా ప్రారంభమైంది. కర్రలు, కత్తులు, పటాకత్తులు, బల్లేలు, లేడి కొమ్ములు, అగ్గి బరాటాలు, సరిగమలు, బంతుల తాళ్లు, కత్తి-డాలు, అగ్గి తాళ్లు లాంటి వాటితో ప్రదర్శించే సాహస విన్యాసాలు ఇందులో భాగం. ప్రధానంగా కళ్లకు గంతలు కట్టుకొని... చేత కత్తి పట్టుకొని... ఒక్క వేటుకు పొట్టపై పెట్టిన కూరగాయలు, కొబ్బరికాయలు, గుమ్మడికాయల వంటివి నరకడం చూస్తుంటే ఒళ్లు జలదరిస్తుంది. కర్ర, కత్తి సాము, అగ్గిబరాటాలు తిప్పే విన్యాసాలు వీటికి అదనం. యువతీ యువకులే కాకుండా పిల్లలు, వృద్ధులు కూడా ఈ విన్యాసాల్లో తమ నైపుణ్యం ప్రదర్శిస్తారు. మహిపాల వీధి, కొంకాపల్లి, గండువీధులు ఈ కార్యక్రమానికి ముఖ్య వేదికలు. మైసూరు తరహాలో ఇక్కడ కూడా ఏటా ఉత్సవాలు నిర్వహించడం ఒక ఆనవాయితీగా వస్తోంది. ఈ వేడుక తెలుగు నేల వైభవాన్ని నలుదిశలా చాటుతోంది.

• **ఆచంట వెంకటేశ్వరరావు,** అమలాపురం

నేర్చుకోవాలన్న ఉత్సుకత పెరిగింది



చారిత్రక ప్రాధాన్యత కలిగిన చెడీ తాలింఖానా అమలాపురం పట్టణ పరిసర ప్రాంతాలకే పరిమితమైంది. ఇటీవల కాలంలో సినిమాలతో పాటు బుల్లితెరపై చెడీ తాలింఖానాపై ప్రత్యేక కార్యక్రమాలను ఫోకస్ చేస్తున్నారు. దాంతో ప్రాధాన్యత కలిగిన చెడీ తాలింఖానా నేర్చుకోవాలని ఉత్సుకత అంతకంతకు పెరుగుతోంది. గత మూడేళ్లుగా అమలాపురం అబ్బిరెడ్డి రామదాసు చెడీతాలింఖానాలో శిక్షణ తీసుకుంటున్నా. నాతో పాటు బాలికలు, యువతులు శిక్షణ పొందుతున్నారు. భవిష్యత్తు తరాలకు ఈ ప్రాచీన కళను అందించేందుకు కృషి చేస్తా.

- గుర్రాల నందిని, అమలాపురం

వ్యక్తిగత రక్షణ కోసం



ప్రాచీన కళ అయిన చెడీ తాలింఖానా అంటే చిన్నతనం నుంచి ఇష్టం. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఏడాది కాలంగా అమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శిక్షణ తీసుకుంటున్నా. వ్యక్తిగత జీవితంలో కూడా చెడీ తాలింఖానా ఆత్మరక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుంది. బాలికలు, యువతులు తప్పనిసరి శిక్షణతో ఆత్మరక్షణ పొందవచ్చు. ఇటీవల కాలంలో జరుగుతున్న అవాంఛనీయ సంఘటనలను అధిగమించేందుకు చెడీ తాలింఖానాను విద్యార్థి దశ నుంచి నేర్పించాలి.

- ఆకపు వేణుప్రియాంక, తిరుపతి

కౌన్సెలింగ్

కంటి చూపు మీద ఓ కన్నేయండి

డాక్టర్! మా అబ్బాయి వయసు 8 ఏళ్లు. చదువులో వెనకపడ్డాడు. క్లాసులో నోట్సు రాసుకోడానికి ఇబ్బంది పడుతున్నాడనీ, బ్లాక్ బోర్డు దగ్గరకు వెళ్తే తప్ప బాబుకు చూపు ఆనడం లేదనీ టీచర్లు అంటున్నారు. మా బాబుకు ఉన్న సమస్యను ఏ విధంగా అర్థం చేసుకోవాలి?

- ఓ సోదరి, హైదరాబాద్.

పెద్దల్లో లాగే పిల్లల్లో కూడా దృష్టి దోషాలు సహజం. 'పిల్లలు పెరిగేకొద్దీ అన్నీ సర్దుకుంటాయిలే!' అని నిర్లక్ష్యం చేస్తే, శాశ్వతంగా కంటి చూపే పోయే ప్రమాదం ఉంటుంది. కాబట్టి పిల్లల కంటి సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలి. పిల్లల్లో పుట్టుకతో లేదా పెరిగే క్రమంలో కంటి సమస్యలు తలెత్తుతాయి. వీటిని తేలికగానే కనిపెట్టవచ్చు. కొన్ని సమస్యలు కనుగుడ్లలో స్పష్టంగా కనిపిస్తే, ఇంకొన్ని పిల్లలు ప్రవర్తన ద్వారా బయల్పడుతూ ఉంటాయి.

కళ్లలో రిఫ్రాక్టివ్ ఎర్రర్స్ (దృష్టి దోషాలు)

మీ బాబుకు ఉన్న సమస్య ఇది. ఈ సమస్య ఉన్న పిల్లలకు దూరం లేదా దగ్గరి వస్తువులు కనిపించవు. దూరంగా ఉన్నవి కనిపించవు కాబట్టి పిల్లలు దగ్గరకు



వెళ్లి చూస్తూ ఉంటారు. పుస్తకాలను కళ్లకు దగ్గరగా ఉంచుకుని చదవడం, టివి లేదా బ్లాక్‌బోర్డు దగ్గరకు వెళ్లి చూడడం చేస్తూ ఉంటారు. కంటిచూపు తక్కువగా ఉండడం మూలంగా ఆటలకు కూడా పిల్లలు దూరంగా ఉంటూ ఉంటారు. ఎక్కువ సమయాల పాటు తోటి పిల్లలతో కలవకుండా, అంతర్ముఖులుగా ఇళ్లకు, తమ గదులకే పరిమితమైపోతూ ఉంటారు. చదువులో కూడా వెనకపడిపోతూ ఉంటారు. పిల్లల్లో ఈ లక్షణాలను గమనించినప్పుడు ఆలస్యం చేయకుండా కంటి వైద్యుల చేత పరీక్ష చేయించాలి. కళ్లలో సమస్య ఉందని తేలినప్పుడు, కళ్లజోడు వాడుకోవలసి ఉంటుంది. ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే, పిల్లల కంటిచూపు బాగా దెబ్బతిని, అంధత్వం వచ్చే అవకాశం ఉంటుంది. కంటి నుంచి మెదడుకు సిగ్నల్స్ అందక కన్ను లేజీ ఐగా మారి, 'ఆంబ్లియోపియా' అనే పరిస్థితి తలెత్తుతుంది. ఈ సమస్యను చికిత్సతో చక్కదిద్ది, కంటిచూపును మెరుగు పరచడం కష్టం. కాబట్టి సమస్యను ఎంత త్వరగా గుర్తించి, చికిత్స ఇప్పిస్తే, అంతగా మెరుగ్గా కంటిచూపును కాపాడుకోగలిగిన వాళ్లం అవుతాం.

డాక్టర్ శ్రీ లక్ష్మి
కంటి వైద్యులు, హైదరాబాద్.

మహిళా ఉద్యోగుల్లో
మానసిక ఒత్తిడి

ఒక శక్తివంతమైన స్త్రీ, శక్తివంతమైన సమాజాన్ని నిర్మించగలుగుతుంది. గృహిణిగా కుటుంబ ఆలనా పాలనా చూసే స్థాయి నుంచి, నేడు ఒక దేశాధినేతగా, బహుళజాతి కంపెనీలకు అధిపతిగా పని చేసే స్థాయికి మహిళ ఎదిగింది. ఈ ప్రయాణంలో మహిళ, ఎన్నో సవాళ్లనూ, అవరోధాలనూ అధిగమించింది.

మొదటి నుంచీ మహిళల పట్ల సమాజానిది చిన్న చూపే! 18వ శతాబ్దంలో పారిశ్రామిక విప్లవం భారీ పరిశ్రమల ఏర్పాటు సమయంలో పురుషులనే ప్రధానంగా కార్మికులుగా నియమించుకునేవారు. మహిళలను పనుల్లోకి తీసుకున్నప్పటికీ, తక్కువ వేతనానికి, తక్కువ స్థాయి పనులకే కేటాయించేవారు. కాలక్రమేణా మహిళలు విద్యార్హతలు, ప్రావీణ్యాలను పెంచుకున్నారు. సాంకేతిక విద్య, వృత్తి ఉపాధి కోర్సుల్లో చేరడం వల్ల స్త్రీవాదం, స్త్రీ సాధికారిత భావనలు విశేషంగా వ్యాప్తి చెందిన తర్వాత అన్ని రంగాల్లో స్త్రీలు, పురుషులతో సమానంగా పోటీ పడే పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో కేవలం 8% మంది మహిళలు మాత్రమే పైస్థాయి అధికారులుగా నియమితులవుతున్నారు. భారతదేశంలో ఇలాంటి మహిళల సంఖ్య 2% కంటే తక్కువ.

ఉద్యోగాల్లో ప్రతిబంధకాలు

మానస చిన్నతనం నుంచీ చదువులో చురుగ్గా ఉండేది. పైచదువుల కోసం బయటి దేశాలకు వెళ్లి, అక్కడే స్థిరపడాలని భావించేది. కానీ పెళ్లి కాని ఆడపిల్లను అంత దూరం పంపించలేమని తల్లితండ్రులు ఆమెను నిరాశపరిచారు. పెళ్లి చేసుకుని భర్తతో బయటి దేశాలకు వెళ్లి చదువుకోవచ్చని ఉచిత సలహా ఇచ్చారు. తల్లితండ్రుల్లో ఇలాంటి ఆలోచనా ధోరణి, అమ్మాయిలను నిరుత్సాహపరుస్తోంది. విద్య, ఉద్యోగావకాశాలను కోల్పోయేలా చేస్తోంది. ఉద్యోగాల్లో చేరడానికి కంపెనీలు కూడా మహిళలకు కొన్ని నిబంధనలు పెడుతున్నాయి. ఉద్యోగంలో చేరిన ఐదేళ్ల వరకూ పెళ్లి చేసుకోకూడదని కంపెనీలు నిబంధనలు పెట్టడానికి కారణం, పెళ్లయ్యాక, గర్భదాల్చడం, ప్రసవం మూలంగా మహిళలు సెలవులు పెడితే, పనులకు ఆటంకం కలుగుతుందని కంపెనీలు భయపడడమే! అయితే ఇలాంటి అత్యవసర సమయాల్లో సెలవులను నిర్బంధంగా అమలు చేయాలని ప్రభుత్వం సూచించింది. కానీ చిన్న స్థాయి కంపెనీలు ఈ నిబంధనను పాటించడం లేదు. అంతేకాకుండా, మహిళలకు ప్రమోషన్లు కల్పించడానికి కూడా కంపెనీలు ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నాయి.

మానసిక ఒత్తిడి, కుంగుబాటు

1975 తర్వాత రెండు సంపాదనలు అనే భావన వ్యాపించింది. మన దేశంలో గత 25 ఏళ్లుగా దంపతులిద్దరూ ఉద్యోగాలు చేసే సంస్కృతి పెరిగిపోయింది. భార్యాభర్తలిద్దరూ వేర్వేరు షిఫ్టుల్లో, వేర్వేరు ప్రదేశాల్లో పని



చేయడంవల్ల వాళ్ల మధ్య మానసిక బంధం బలహీనపడుతోంది. అలాగే ఉద్యోగం కోసం వేరే ఊర్లకు ట్రాన్స్‌ఫర్ అయ్యే సమయంలో, భర్తకు దూరంగా తెలియని ప్రదేశంలో, తెలియని వాతావరణంలో, భాష తెలియని ప్రదేశంలో ఉద్యోగం చేయవలసి వస్తోంది. ఫలితంగా మహిళలు మానసిక ఒత్తిడి, కుంగుబాటుకు గురవుతూ ఉంటారు. ఒంటరితనాన్ని దూరం చేసుకోవడం కోసం పక్కదారి పట్టే పరిస్థితులు కూడా తలెత్తుతూ ఉంటాయి. వివాహిత మహిళలు అటు వృత్తి బాధ్యతలూ, ఇటు కుటుంబ బాధ్యతలూ రెండింటినీ సమర్థంగా నిర్వహించవలసిన అవసరం ఉంటుంది. ఈ క్రమంలో అనారోగ్యం బారిన పడడం, పిల్లలు దీర్ఘకాలిక అనారోగ్యాలకు గురైతే ఏకంగా ఉద్యోగాన్నే వదులుకోవలసి వస్తున్న సందర్భాలూ ఉంటున్నాయి.

కుటుంబ తోడ్పాటు

పని ప్రదేశంలో వేధింపులు, ఆధిపత్య ధోరణులు, మహిళలకు ప్రతిబంధకాలుగా మారుతున్నాయి. ప్రతి మనిషీ జీవితకాలంలో 90 వేల గంటలు పని ప్రదేశంలో గడుపుతాడు. కాబట్టి పని చేసే చోట మానసిక ఆరోగ్యానికి విశేషమైన ప్రాధాన్యం ఇవ్వవలసిన అవసరం ఉంది. పని ప్రదేశంలో నిర్మొహమాటంగా వ్యవహరించగలగాలి. పురుషుల వల్ల తన స్వేచ్ఛకు, సౌకర్యానికీ భంగం కలిగితే ఆ విషయాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లాలి. సమస్యలను కుటుంబంతో పంచుకుని, వారి సలహాలు, సూచనలు తీసుకోవాలి. అవసరాన్ని బట్టి మానసిక వైద్యుల సహాయం తీసుకోడానికి వెనుకాడకూడదు.

స్వీయ శ్రద్ధ

మహిళలు స్వీయ సంరక్షణ మీద దృష్టి పెట్టాలి. నచ్చిన సంగీతం వినడం, నచ్చిన ఆహారం తినడం, యోగా, పుస్తక పఠనం, ధ్యానం, నడక లాంటివి మానసిక, శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ప్రతి రోజూ ఏడు నుంచి ఎనిమిది గంటలకు తగ్గకుండా నిద్రపోవాలి. మహిళల పరిపూర్ణ శ్రేయస్సు కోసం సంస్థలు, యాజమాన్యాలు తగిన వెసులుబాట్లు కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉంది. సమాజ అభివృద్ధికీ, దేశ పురోగతికీ స్త్రీ సాధికారత ఎంతో దోహదపడుతుంది. కాబట్టి స్త్రీలను గౌరవిద్దాం, ప్రోత్సహిద్దాం, ఎదగనిద్దాం!



డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి
మానసిక నిపుణులు, 9348114948

స్వయంకృషితో ఎదిగి... ఉన్నత శిఖరాలెన్నో అధిరోహించిన మహిళ... హినా ఖాన్. భారత టెలివిజన్ రంగంలో తిరుగులేని తారగా... అత్యధిక పారితోషికం తీసుకొంటున్న బుల్లితెర నటుల్లో ఒకరిగా... వెలుగుతున్న ఆమె ఇప్పుడు కేన్సర్‌తో పోరాటం చేస్తోంది. కీమో థెరపీలు... రేడియేషన్ చికిత్సలు శరీరాన్ని బలహీన పరుస్తున్నా... ఆమె కుంగిపోలేదు. ఆత్మవిశ్వాసంతో కేన్సర్‌ను ఎదుర్కొంటూనే... అప్పుడప్పుడూ ర్యాంప్‌పై మెరుస్తోంది. వివిధ 'వాక్'ల్లో భాగమై సామాజిక చైతన్యం రగిలిస్తోంది.



చెదరని ధైర్యమే ఆమె బలం



అక్షర మహేశ్వరీ సింఘానియా... సుదీర్ఘ ధారావాహిక 'ఏ రిస్తా క్యా కహలాతా హై'లో హినా ఖాన్ పాత్ర పేరు ఇది. ఈ పాత్రే ఆమెను ఇంటింటికీ పరిచయం చేసింది. స్టార్ స్టేటస్ తెచ్చిపెట్టింది. అది మొదలు బుల్లితెరలో హినా కనిపించని రోజంటూ ఉండదంటే... అందులో వింతేమీ లేదు. పోటీదారుగానో, న్యాయనిర్ణేతగానో, ప్రత్యేక పాత్రలోనో, గౌరవ అతిథిగానో... ఎక్కడో అక్కడ ఏదో ఒక రకంగా ప్రేక్షకులను పలకరిస్తూనే ఉంటుంది. కొన్ని సినిమాల్లో, అలాగే వెబ్‌సిరీస్‌ల్లో నటించి మంచి గుర్తింపు కూడా తెచ్చుకుంది. విశేషమేమంటే... నటిగా ఇంత బిజీగా గడిపేస్తున్న హినా... గ్లామర్ ప్రపంచంలోకి రావాలని అసలు ఏ రోజూ అనుకోలేదు. పాత్రికేయురాలు కావాలని కలలు కని... అనుకోకుండా ఇలా ఈ రంగంలో స్థిరపడింది.

"ప్రముఖ జర్నలిస్ట్ బుర్ఖాదత్‌కు నేను అతిపెద్ద అభిమానిని. ఆమెను చూసి నేను కూడా అంతటి పాత్రికేయురాలు కావాలనుకున్నాను. కానీ విధి మరోలా తలచింది. అప్పుడు ఢిల్లీలో ఎంబీయే చదువుతున్నాను. అదే సమయంలో 'ఏ రిస్తా క్యా కహలాతా హై' ఆడిషన్స్ జరుగుతున్నాయి. మా స్నేహితుల బలవంతంతో ఆడిషన్స్‌కు వెళ్లాను. తొలి రౌండ్‌లోనే ఎంపికయ్యాను. తరువాతి వడపోతకు ముంబయి రమ్మన్నారు. వెళితే అన్నిటినీ విజయవంతంగా అధిగమించాను. షూటింగ్ మొదలైపోయింది. జర్నలిస్టు కావాలనుకున్న నేను నటిని అయిపోయాను" అంటూ ఓ సందర్భంలో నాటి సంగతులు పంచుకుంది హినా.

'నన్ను బయటకు పంపుతారు..'

జమ్ముకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో పుట్టిన హినీఖాన్‌కు ఒక తమ్ముడు. అతడు ఓ ట్రావెల్ ఏజెన్సీ అధిపతి. 2009లో ఎంబీయే పూర్తి చేసిన ఆమె... అంతకముందు 'ఇండియన్ ఐడల్'లో పోటీపడింది. సీరియల్స్‌లోకి రాకముందు కొన్నాళ్లు కాల్‌సెంటర్‌లో పని చేసింది. "మా పీజీలో కొంతమంది అమ్మాయిలు కాల్‌సెంటర్‌లో పని చేసేవారు. బానే సంపాదించేవారు. నన్ను కూడా రమ్మని అడిగారు. రుణం తీసుకున్నవారికి ఫోన్ చేసి, బాకీ కట్టమని చెప్పాలి. అదే నా పని. అయితే రొటీన్ కాల్‌సెంటర్ ఉద్యోగులకు కాస్త భిన్నంగా నేను కస్టమర్లతో మాట్లాడేదాన్ని. వాళ్లకు నా బాధలు చెప్పి, డబ్బు కట్టకపోతే నా ఉద్యోగం పోతుందని చెప్పేదాన్ని. చాలావరకు బాకీలు వసూలు అయ్యాయి. అలా తొలి నెలలోనే మా ఫ్లోర్‌లో అత్యధిక మొత్తం సంపాదించాను. నేను అందుకున్న తొలి చెక్... 45 వేల రూపాయలు. నా జీతం పాతికవేలే. మిగిలింది మంచి కలెక్షన్స్ రాబట్టినందుకు దక్కిన ప్రోత్సాహకాలు" అంటున్న 37 ఏళ్ల హినా... తొలి సీరియల్‌లో ఎనిమిదేళ్లు కొనసాగింది. ఆ ప్రాజెక్టు నుంచి బయటకు వచ్చాక వరుసగా రియాలిటీ షోలలో పాల్గొంది. 'బిగ్‌బాస్-11'లో సెలబ్రిటీ కంటెస్టెంట్‌గా అడుగుపెట్టి, ఫస్ట్ రన్నరప్‌గా నిలిచింది. 'షేర్‌ఖాన్' టైటిల్ సొంతం చేసుకుంది. దాంతో ఆమె కెరీర్ మరో మలుపు తీసుకుంది. ఆఫర్లు పెరిగాయి.

ఎన్నో అవార్డులు...

వెండితెరపై కనిపించాలన్న ఆలోచనతో తొలుత పలు షార్ట్ ఫిల్మ్స్‌లో నటించింది. తరువాత పలు చిత్రాల్లో ప్రధాన పాత్రలు పోషించింది. అదే సమయంలో టీవీ సీరియల్స్‌లో అవకాశాలు కూడా దక్కించుకుంది. మ్యూజిక్ వీడియోల్లో, ప్రత్యేక పాత్రల్లో అలరించింది. పదిహేనేళ్ల కెరీర్‌లో అద్భుతమైన ప్రదర్శనకు ఎన్నో అవార్డులు అందుకుంది. మూడు 'ఐటీఏ అవార్డు'లు, మూడు 'ఇండియన్ టెలీ అవార్డు'లు, ఏడు 'గోల్డెన్ అవార్డు'లు వాటిల్లో ఉన్నాయి.

మహమ్మారితో పోరాటం...

రాకెట్ స్పీడ్‌తో దూసుకుపోతున్న హినా కెరీర్‌కు పెద్ద బ్రేక్. ఆనందంగా సాగిపోతున్న జీవితంలో అనుకోని కుదుపు. ఈ ఏడాది జూన్‌లో స్టేజీ-3 బ్రెస్ట్‌కేన్సర్‌తో బాధపడుతున్నట్టు ఆమె వెల్లడించింది. హినాకే కాదు... ఆమె అభిమానులకూ ఇది చేదు వార్త. కానీ ఆమె కుదేలైపోలేదు. బాధపడుతూ మంచానికే పరిమితం అయిపోలేదు. ఎంతో గుండె నిబ్బరంతో కేన్సర్‌తో పోరాడుతోంది. తనలా ఈ మహమ్మారితో బాధపడుతున్న వారిలో ధైర్యం నింపుతోంది. అంతేకాదు... కీమో థెరపీ చేయించుకొంటూనే, చికిత్సకు విరామం దొరికినప్పుడు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటోంది. 'వాక్ ఫర్ కరేజ్, వాక్ ఫర్ సర్వీస్, వాక్ ఫర్ హెరిటేజ్'... ఇలా అన్నింటా భాగమవుతోంది.

'ఈ సందర్భంగా నాలాగా జీవితంతో పోరాడుతున్న ఎంతోమందిని కలిశాను. అందులో ప్రతి అడుగూ ఒక్కో కథ చెప్పింది. జయించాలన్న కాంక్ష, భవిష్యత్తుపై నమ్మకాన్ని కలిగించింది. నాలో స్ఫూర్తి రగిలించింది' అంటూ తన అనుభవాలను చెప్పుకొచ్చిన హినా... ఇటీవల నిర్వహించిన ఫ్యాషన్ షోలో ప్రముఖ డిజైనర్ మనీష్ మల్హోత్రా కలెక్షన్స్‌లో హినా షో స్టాపర్‌గా ఆకట్టుకుంది. జీవితం ఎంత కఠినమైన సవాళ్లను విసిరినా... తట్టుకొని నిలబడగల ఆత్మవిశ్వాసం, ధైర్యమే హినాకు కొండంత బలం.



కొత్త ఏడాదిలో సెట్స్‌పైకి



మహేశ్‌బాబు- రాజమౌళి కలయికలో వస్తున్న చిత్రం (ఎస్ఎస్ఎంబీ 29-వర్కింగ్ టైటిల్). భారీ అంచనాలతో వస్తున్న ఈ చిత్రం షూటింగ్ ఎప్పుడు మొదలవుతుందా అనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొన్న నేపథ్యంలో దీనిపై అప్డేట్ వచ్చింది. వచ్చే ఏడాది జనవరిలో ఈ చిత్రం షూటింగ్ మొదలవనుంది. ఈ విషయాన్ని రచయిత విజయేంద్రప్రసాద్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఈ సినిమాకు కథ రాయడానికి దాదాపు రెండేళ్లు పట్టిందని ఆయన తెలిపారు. భారతీయ చిత్ర పరిశ్రమలో ఇప్పటివరకూ చూడని సరికొత్త ప్రపంచాన్ని రాజమౌళి ఆవిష్కరించనున్నారని విజయేంద్ర ప్రసాద్ చెప్పారు. ఈ సినిమా కోసం మహేశ్‌బాబు ఇప్పటికే కొత్త లుక్‌తో సిద్ధమయ్యారు. అమెజాన్ అడవుల నేపథ్యంలో అడ్వెంచరస్ యాక్షన్ మూవీగా తెరకెక్కనుంది. కేఎల్ నారాయణ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ శరవేగంగా జరుగుతోంది.

పక్కా పండగ సినిమా



గోపీచంద్ నటించిన మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ 'విశ్వం'. శ్రీనువైట్ల దర్శకత్వంలో టీ.జీ. విశ్వప్రసాద్, వేణు దోనేపూడి నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను గోపీచంద్ మీడియాతో పంచుకున్నారు.

"పక్కా పండగ సినిమా ఇది. థియేటర్లు ప్రేక్షకుల నవ్వుల్తో నిండిపోతాయి. ఈ సినిమా అవుట్‌పుట్ అనుకున్నదానికంటే రెండింతలు బాగా వచ్చింది. ఒక్క సెకండ్ కూడా బోర్ కొట్టకుండా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుంది. దేశం ఎదుర్కొంటున్న ఓ కీలక సమస్యను ఇందులో చూపించాం. అదేంటన్నది థియేటర్లలోనే చూడాలి. శ్రీనువైట్లకు ఇది కమ్‌బ్యాక్ ఫిల్మ్ అవుతుంది. ఆయన టైమింగ్‌ను అందుకోవడానికి నాకు రెండు రోజులు పట్టింది. నా సినిమాల్లో.. 'లౌక్యం' తర్వాత ఆ స్థాయి వినోదం ఇందులోనే ఉంది. సినిమాలో నా పాత్ర పేరు 'విశ్వం'. ప్రతీ పాత్రకూ ప్రాధాన్యం ఉంటుంది. యాక్షన్, కామెడీ, సెంటిమెంట్, ఎమోషన్స్.. ఇలా అన్నీ చక్కగా కుదిరాయి. కావ్యథాపర్ పాత్ర వైవిధ్యంగా ఉంటుంది. చేతన్ భరద్వాజ్ అద్భుతమైన సంగీతం ఇచ్చారు. ఇందులో ఉన్న ట్రైన్ ఎపిసోడ్ గురించే అందరూ మాట్లాడుతున్నారు. 'వెంకీ' సినిమాలోని ట్రైన్ ఎపిసోడ్ ఎంత వినోదాన్ని ఇచ్చిందో.. ఇందులో అంతకువిఎంచిన వినోదం పండుతుంది. ప్రొడ్యూసర్లు రాజీపడకుండా నిర్మించారు" అని చెప్పారు.

అందుకే ఈ టైటిల్



లైకా ప్రొడక్షన్స్

రజనీకాంత్ నటించిన యాక్షన్ ఎంటర్టైనర్ 'వేట్టయాన్'. 'జై భీమ్' ఫేమ్ టీ.జే. జ్ఞానవేల్ దర్శకత్వంలో సుభాస్కరన్ నిర్మించారు. నేడు ఈ చిత్రం విడుదలవుతోంది. బుధవారం చిత్ర బృందం నిర్వహించిన మీడియా సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దిల్‌రాజు మాట్లాడుతూ "ఈ సినిమా టైటిల్ విషయంలో ట్రోలింగ్స్ వస్తుండడం చూశా. సాధ్యమైనంత వరకూ టైటిల్స్‌ను స్థానిక భాషలోనే పెడుతున్నారు. సినిమాను సినిమాగా చూడండి" అని చెప్పారు. 'తెలుగు ప్రేక్షకులంతా 'వేట్టయాన్'ను చూసి విజయవంతం చేయండి" అని నిర్మాత సురేశ్‌బాబు కోరారు.

గేమ్ ఛేంజర్ విషయంలో అదే జరిగింది : దిల్‌రాజు

"గేమ్ ఛేంజర్‌కి డైరెక్టర్ టైటిల్ చెప్పినప్పుడు.. ఆ టైటిల్‌ను అన్ని భాషల్లో చెక్ చేశాం. పాన్ ఇండియా సినిమాకు టైటిల్ పెడితే అన్ని భాషల్లోకి అదే టైటిల్‌తో వెళ్లాలి. మనం అనుకునే పాన్ ఇండియా టైటిల్‌ను వేరే భాషల్లో రిజిస్టర్ చేసి ఉంటే చాలా సమస్య అవుతుంది. గేమ్ ఛేంజర్ విషయంలో అదే జరిగింది. ఈ టైటిల్ కోసం మళ్లీ అందరితో మాట్లాడి.. ఒప్పించి అప్పుడు అన్ని భాషల్లో ఒకేలా ఉండే టైటిల్‌ను ప్రకటించాం. పాన్ ఇండియాకు టైటిల్ పెట్టడం అంత సులభం కాదు" అని దిల్‌రాజు అన్నారు..

ఆ పంజాబీ అమ్మాయి ఎవరు?



నటి పూనమ్‌కౌర్, బుధవారం ఎక్స్ వేదికగా ఓ సంచలన ట్వీట్ చేశారు. "చిత్రపరిశ్రమలోని ఓ దర్శకుడు ఓ పంజాబీ నటిని గర్భవతిని చేశాడు. అబార్షన్ చేయించి ఆ అమ్మాయి కెరీర్‌ను సర్వనాశనం చేశాడు. అయితే ఆ వ్యక్తి.. రాజకీయ నాయకుడిగా మారిన నటుడు కాదు. ఓ దర్శకుడు. 'మా' (మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) తోడ్పాటుతో ఆ పంజాబీ అమ్మాయికి కాస్త సహాయం లభించింది. ఈ విషయంలోకి నన్ను, రాజకీయనాయకుడిగా మారిన ఓ నటుడ్ని అనవసరంగా లాగారు" అని ఎక్స్‌లో పేర్కొన్నారు. దాగుడు మూతలు ఆపి ఆ పంజాబీ అమ్మాయి పేరు బయట పెట్టాలంటూ నెటిజన్లు పూనమ్‌కౌర్‌ను ట్రోల్ చేస్తున్నారు. గతంలో దర్శకుడు త్రివిక్రమ్‌పై తను మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్‌లో ఫిర్యాదు చేశానని, కానీ వారు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఇటీవలే పూనమ్ వెల్లడించారు.

అద్భుతమైన కథతో...



సంయుక్త లీడ్‌రోల్‌లో ఓ చిత్రం ప్రారంభమైంది. యోగేశ్ కే.ఎం.సీ దర్శకత్వంలో రాజేశ్ దండా నిర్మిస్తున్నారు. బుధవారం ఈ సినిమాను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మాత రాజేశ్ దండా మాట్లాడుతూ "కమర్షియల్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం. త్వరలోనే మరిన్ని వివరాలు ప్రకటిస్తాం" అని చెప్పారు. "ఈ సినిమా కథ అద్భుతంగా ఉంటుంది. ఇటువంటి స్క్రిప్ట్‌లో భాగం అయినందుకు అదృష్టంగా భావిస్తున్నాను" అని సంయుక్త మీనన్ అన్నారు. "ఇందులో యాక్షన్ ఘట్టాలకు అధిక ప్రాధాన్యత ఉంటుందని" అని దర్శకుడు యోగేశ్ తెలిపారు.







పదో 'సారీ' అవే రేట్లు!

రెపో రేట్లు మళ్లీ యథాతథం.. భవిష్యత్‌పై తటస్థ వైఖరి

వచ్చేసారి తగ్గించే చాన్స్.. ఆర్‌బీఐ ద్రవ్యపరపతి విధాన సమీక్ష



ముంబై: వడ్డీ భారం నుంచి ఊరట కోరుకుంటున్న రుణగ్రహీతలకు మరోసారి నిరాశే ఎదురైంది. గృహ, వాహన, వ్యక్తిగత రుణాల వడ్డీరేట్లు మరికొంత కాలం గరిష్ఠ స్థాయిలోనే కొనసాగనున్నాయి. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) బుధవారం ప్రకటించిన ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో కీలక రెపోరేట్లను యథాతథంగా కొనసాగించింది. రెపో రేటును 6.5 శాతం వద్ద యథాతథంగా కొనసాగించడం వరుసగా ఇది పదో సారి. ఫలితంగా బ్యాంక్‌లు రెపో అనుసంధానిత రుణాల వడ్డీరేట్లను మరికొంత కాలం ప్రస్తుత స్థాయిలోనే కొనసాగించనున్నాయి. అయితే ఆర్‌బీఐ ఇప్పటివరకు అనుసరిస్తూ వస్తున్న కఠిన పరపతి విధాన వైఖరిని మాత్రం 'తటస్థ' స్థాయికి సడలించింది. తద్వారా తదుపరి సమీక్షల్లో రెపోరేటును తగ్గించేందుకు ఆర్‌బీఐ ద్వారాలు తెరిచిందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ఆర్‌బీఐ తదుపరి ద్రవ్యపరపతి విధాన సమీక్ష డిసెంబరు 4-6 తేదీల్లో జరుగనుంది. ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అధ్యక్షతన ద్రవ్య విధాన కమిటీలోని (ఎంపీసీ) ఆరుగురు సభ్యుల్లో ఐదుగురు రెపోరేటును యథాతథంగా కొనసాగించాలని ఓటేయగా.. ఒకరు మాత్రం తగ్గింపునకు మొగ్గుచూపారు. పరపతి విధాన వైఖరిని తటస్థ స్థాయికి తగ్గించాలని మాత్రం ఏకగ్రీవంగా నిర్ణయించారు. పరపతి విధాన వైఖరిని సడలించినప్పటికీ, వృద్ధికి మద్దతిస్తూనే ద్రవ్యోల్బణాన్ని ప్రభుత్వ నిర్దేశిత స్థాయికి కట్టడి చేయడంపై నిస్సందేహంగా తమ దృష్టి కొనసాగుతుందని ఆర్‌బీఐ గవర్నర్ పేర్కొన్నారు. వడ్డీరేట్లపై ఆర్‌బీఐ వైఖరిని మార్చుకోవడం 2019 జూన్ తర్వాత ఇదే తొలిసారి. ఆర్‌బీఐ చివరిసారిగా 2023 ఫిబ్రవరిలో రెపోరేటును 6.25 శాతం నుంచి 6.5 శాతానికి పెంచింది. కాగా, వినియోగదారుల ధరల ఆధారిత ద్రవ్యోల్బణాన్ని 4 శాతానికి కట్టడి చేయాలని ఆర్‌బీఐకి కేంద్రం లక్ష్యాన్ని నిర్దేశించింది.

జీడీపీ వృద్ధి అంచనా 7.2 శాతం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధిరేటు అంచనాను ఆర్‌బీఐ గతంలో ప్రకటించిన 7.2 శాతంగానే కొనసాగించింది. భారత్ వృద్ధి పథంలో నిలకడగా ముందుకు సాగుతోందని, ప్రైవేట్ వినియోగం, పెట్టుబడులు సమిష్టిగా వృద్ధి చెందుతున్నాయని ఆర్‌బీఐ పేర్కొంది. ఈ జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో వృద్ధిరేటు 15 త్రైమాసికాల కనిష్ఠ స్థాయి 6.7 శాతానికి పరిమితం కాగా.. రెండో త్రైమాసికంలో 7 శాతం, క్యూ3, క్యూ4లో 7.4 శాతం చొప్పున నమోదు కావచ్చని ఆర్‌బీఐ భావిస్తోంది. కాగా, ఈసారి జీడీపీ వృద్ధి 6.5-7 శాతం స్థాయిలో ఉండవచ్చని పలు ఆర్థిక సంస్థలు అంచనా వేశాయి.

ద్రవ్యోల్బణం అంచనా 4.5 శాతం

ఈ ఆర్థిక సంవత్సరంలో రిటైల్ ద్రవ్యోల్బణం సగటు అంచనాను సైతం ఆర్‌బీఐ గతంలో ప్రకటించిన 4.5 శాతంగానే కొనసాగించింది. వరుసగా రెండు నెలలు 4 శాతం దిగువనే నమోదైన ద్రవ్యోల్బణం మళ్లీ ఈనెలలో కాస్త ఎగబాకే అవకాశం ఉన్నప్పటికీ మున్ముందు ఆహార ధరలు తగ్గుముఖం పట్టవచ్చని దాస్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సారి వర్షాలు సమృద్ధిగా కురవడంతో ఖరీఫ్ సీజన్‌లో పంట దిగుబడి మెరుగుపడనుందని, రిజర్వాయర్లు కళకళలాడుతుండటంతో రబీ సీజన్ దిగుబడి కూడా ఆశాజనకంగానే ఉంటుందని ఆర్‌బీఐ భావిస్తోంది. కాగా, పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ముడిచమురుతో పాటు ఇతర కమోడిటీ ధరలు గణనీయంగా పెరిగే ప్రమాదం మాత్రం పొంచి ఉందని ఆర్‌బీఐ హెచ్చరించింది.

ఎన్‌బీఎఫ్‌సీలకు వార్నింగ్

నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ) విభాగం దూకుడు తగ్గించాలని ఆర్‌బీఐ గవర్నర్ హెచ్చరించారు. కొన్ని ఎన్‌బీఎఫ్‌సీల పెట్టుబడిదారులు వ్యాపారాన్ని దూకుడుగా పెంచే దిశగా సంస్థలను ఒత్తిడి చేస్తున్నాయని.. ఇది వ్యాపారంలో అనుచిత పద్ధతులకు దారితీస్తోందన్నారు. అలాంటి కంపెనీలపై క్రమశిక్షణ చర్యలు చేపట్టేందుకు వెనుకాడబోమని దాస్ స్పష్టమైన సంకేతాలిచ్చారు. ఎన్‌బీఎఫ్‌సీలకు చెందిన కొన్ని విభాగాలు, సూక్ష్మ రుణాల రంగం దూకుడుగా వృద్ధి చెందుతుండటం భవిష్యత్‌లో దేశ ఆర్థిక స్థిరత్వానికి ముప్పుగా పరిణమించవచ్చన్నారు. వినియోగ అవసరాల కోసమిచ్చే రుణాలు, మైక్రోఫైనాన్స్, క్రెడిట్ కార్డుల విభాగంలో మొండిబాకీల ఒత్తిడి పెరిగే అవకాశాలున్నందున ఈ విభాగాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నట్లు దాస్ చెప్పారు.

యూపీఐ లైట్ పరిమితి రూ.5,000కు పెంపు

దేశంలో డిజిటల్ చెల్లింపులను మరింతగా ప్రోత్సహించేందుకు ఆర్‌బీఐ తాజాగా మరో నిర్ణయం తీసుకుంది. యూపీఐ లైట్ వ్యాలెట్‌లో గరిష్ఠంగా జమ చేయగలిగే సొమ్ము పరిమితిని రూ.2,000 నుంచి రూ.5,000కు పెంచుతున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించింది. అంతేకాదు, యూపీఐ ద్వారా నెరిపే లావాదేవీ గరిష్ఠ పరిమితిని సైతం రూ.500 నుంచి రూ.1,000కి పెంచింది. యూపీఐ లైట్ వ్యాలెట్‌లో సొమ్ము జమ చేసుకోవడం ద్వారా వినియోగదారులు యూపీఐ పిన్ ఎంటర్ చేయనవసరం లేకుండానే చెల్లింపులు జరుపవచ్చు.

యూపీఐ123పే పరిమితి 10,000కు పెంపు

యూపీఐ123పే ద్వారా లావాదేవీ గరిష్ఠ పరిమితిని కూడా రూ.5,000 నుంచి రూ.10,000కు పెంచుతున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. ఫీచర్ ఫోన్లలో యూపీఐ సేవలు వినియోగించుకునేందుకు వీలుగా 2022 మార్చిలో యూపీఐ123పేని అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం ఇది తెలుగు సహా 12 భాషల్లో అందుబాటులో ఉంది.

15 నుంచి హ్యూండయ్ మెగా ఐపీఓ

విలువ రూ.27,870 కోట్లు.. ఒక్కో షేరు ధర రూ.1,865-1,960



న్యూఢిల్లీ: దేశీయ ఈక్విటీ మార్కెట్ చరిత్రలోనే అతి పెద్ద ఐపీఓ వచ్చేవారం మార్కెట్‌కు వస్తోంది. దక్షిణ కొరియా ఆటోమొబైల్ దిగ్గజం హ్యూండయ్ మోటార్ కంపెనీ భారత అనుబంధ సంస్థ హుండయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్‌ఎంఐఎల్) రూ.27,870 కోట్ల సమీకరణ కోసం ఈ నెల 15న ఐపీఓ జారీ చేస్తోంది. ఇందుకోసం ఒక్కో వాటాను రూ.1,865-1,960 ధరల శ్రేణితో జారీ చేస్తోంది. 2022 మే నెలలో ఎల్ఐసీ జారీ చేసిన రూ.21,000 కోట్ల ఐపీఓనే ఇప్పటి వరకు భారత చరిత్రలో అతి పెద్ద ఇష్యూ. హెచ్ఎంఐఎల్ ఐపీఓ ఆ రికార్డును తిరగరాయనుంది. కంపెనీ అభివృద్ధిలో వాటాదారులు, ఇన్వెస్టర్లకు కూడా భాగస్వామ్యం కల్పించాలనే యోచనతో ఈ ఐపీఓ తలపెట్టినట్టు హెచ్ఎంఐఎల్ ఎండీ, సీఈఓ ఉన్సూ కిమ్ చెప్పారు. ఈ ఐపీఓ ఈ నెల 17న ముగుస్తుంది. భారత ఆటోమొబైల్ చరిత్రలోనూ ఇదే అతి పెద్ద ఐపీఓ అని భావిస్తున్నారు.

అదానీ ఎంటర్‌ప్రైజెస్ రూ.16,600 కోట్ల క్యూఐపీ

అదానీ గ్రూప్ మరోసారి క్యూఐపీ ద్వారా పెద్ద మొత్తంలో నిధులు సమీకరిస్తోంది. గ్రూప్ ప్రధాన కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏఈఎల్) బుధవారం రూ.16,600 కోట్ల క్యూఐపీని జారీ చేసింది. ఈ క్యూఐపీ ఇష్యూ ధరను రూ.3,117.4750గా నిర్ణయించారు. ఈ ఇష్యూ ఫ్లోర్ ప్రైస్‌పై మదుపరులకు ఐదు శాతం డిస్కౌంట్ కూడా ఇచ్చే అవకాశం ఉంది. బుధవారం జరిగిన కంపెనీ ఫండ్ రైజింగ్ కమిటీ ఈ క్యూఐపీకి ఆమోద ముద్ర వేసింది. లిస్టెడ్ కంపెనీలు క్యూఐపీ ద్వారా సెబీ అనుమతి లేకుండానే నిధులు సమీకరించవచ్చు.

వరుణ్ బెవరేజెస్ క్యూఐపీ ఇష్యూ

క్యూఐపీ ద్వారా షేర్లు విక్రయించి రూ.7,500 కోట్లు సమీకరించాలని వరుణ్ బేవరేజెస్ భావిస్తోంది. బుధవారం జరిగిన కంపెనీ డైరెక్టర్ల బోర్డు సమావేశం ఇందుకు ఆమోదం తెలిపింది. అయితే ఈ నిధుల సమీకరణ వాటాదారుల ఆమోదానికి లోబడి ఉంటుంది. ఈ నిధులను కంపెనీ వ్యాపార విస్తరణ, ఇప్పటికే ఉన్న రుణాల చెల్లింపుల కోసం వినియోగించనుంది. పెప్సికో కంపెనీ శీతల పానియాల్లో 90 శాతం వరుణ్ బేవరేజెస్‌లోనే ఉత్పత్తి అవుతాయి.

ఫోర్టిస్ హెల్త్‌కేర్ రూ.1,500 కోట్ల ఎన్‌సీడీ ఇష్యూ

ఫోర్టిస్ హెల్త్‌కేర్ లిమిటెడ్ (ఎఫ్‌హెచ్ఎల్) మరోసారి నిధుల సమీకరణకు సిద్ధమైంది. ప్రైవేట్ ప్లేస్‌మెంట్ పద్ధతిలో నాన్ కన్వర్టబుల్ డిబెంచర్లు (ఎన్‌సీడీలు) జారీ చేయడం ద్వారా రూ.1,500 కోట్లు సమీకరించాలని నిర్ణయించింది. బుధవారం జరిగిన కంపెనీ బోర్డు సమావేశం ఇందుకు ఆమోదం తెలిపింది. ఐదేళ్ల కాల పరిమితి ఉండే ఈ ఎన్‌సీడీలను కంపెనీ బీఎస్ఈలో లిస్ట్ చేస్తుంది.

లాభాల పరుగుకు బ్రేక్

ముంబై: స్టాక్ మార్కెట్ పరుగుకు బుధవారం మళ్లీ బ్రేక్ పడింది. రోజంతా లాభాలతో ట్రేడైన సూచీలు, ట్రేడింగ్ చివర్లో లాభాల స్వీకరణ అమ్మకాల ప్రభావంతో నష్టపోయాయి. సెన్సెక్స్ 167.71 పాయింట్ల నష్టంతో 81,467.1 వద్ద, నిఫ్టీ 31.20 పాయింట్ల నష్టంతో 24,981.95 వద్ద ముగిశాయి. బుధవారం వెలువడిన ద్రవ్య, పరపతి విధాన సమీక్షలోనూ ఆర్‌బీఐ కీలక రెపోరేటును యథాతథంగా వదిలి వేయడం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది.

హైదరాబాద్‌లో జడ్ఎస్ కార్యాలయం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): గ్లోబల్ మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్, టెక్నాలజీ కంపెనీ జడ్ఎస్ హైదరాబాద్‌లో నూతన కార్యాలయం ప్రారంభించింది. బెంగళూరు, చెన్నై, ఢిల్లీ ఎన్‌సీఆర్, పుణెల్లో జడ్ఎస్ కార్యాలయాలు ఇప్పటికే ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా 35 కార్యాలయాల్లో మొత్తం 13 వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. హైదరాబాద్‌కు కార్యకలాపాలు విస్తరించడంతో స్థానిక ప్రతిభావంతులకు కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయని జడ్ఎస్ రీజినల్ మేనేజింగ్ ప్రిన్సిపల్ మోహిత్ సూద్ అన్నారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	76,690 ▼	70,300 ▼	1,00,000 ▼
ముంబై	75,010 ▼	68,710 ▼	88,660 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



10వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	525
వరంగల్	512	గోదావరి	525
చిత్తూరు	538	విశాఖపట్నం	525
		డజను గుడ్లు రూ.	78

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	114	విజయవాడ	120
వరంగల్	114	గుంటూరు	123
కరీంనగర్	114	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	114	చిత్తూరు	124
కర్నూలు	114	నెల్లూరు	124
విశాఖపట్నం	115	అనంతపురం	124
గోదావరి	120		

ఇ-గేమింగ్ పరిశ్రమ భవిష్యత్ భేష్

ఈజీఎఫ్ సీఈఓ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : దేశీయ ఇ-గేమింగ్ పరిశ్రమకు మంచి భవిష్యత్ ఉందని 'ఇ-గేమింగ్ ఫెడరేషన్ (ఈజీఎఫ్) సీఈఓ అనురాగ్ సక్సేనా చెప్పారు. ప్రస్తుతం 310 కోట్ల డాలర్ల (సుమారు రూ.26,027 కోట్లు) స్థాయిలో ఉన్న దేశీయ ఇ-గేమింగ్ పరిశ్రమ వచ్చే ఐదేళ్లలో 892 కోట్ల డాలర్ల స్థాయికి చేరే అవకాశం ఉందన్నారు. అయితే ఈ పరిశ్రమ అభివృద్ధికి పటిష్ఠమైన నియంత్రణ వ్యవస్థ అవసరమని ఆయన స్పష్టం చేశారు. 'ప్రస్తుతం మన దేశంలో పటిష్ఠమైన నియంత్రణ వ్యవస్థ లేని కారణంగా ఇ-గేమింగ్ పేరుతో కొన్ని విదేశీ కంపెనీలు అక్రమంగా ఇ-గాంబ్లింగ్‌ను పెంచి పోషిస్తూ వినియోగదారులు, పరిశ్రమతో పాటు దేశ భద్రతకూ ప్రమాదకరంగా మారాయి' అన్నారు. 2018-23 మధ్య కాలంలో మన దేశ ఇ-గేమింగ్ పరిశ్రమలో పనిచేసే నిపుణల సంఖ్య 20 రెట్లు పెరిగిందన్నారు. హైదరాబాద్ ఇ-గేమింగ్ పరిశ్రమకు ప్రధాన కేంద్రంగా ఎదుగుతోందన్నారు. నగరంలో 4,369 స్టార్టప్ కంపెనీలుంటే అందులో 77 గేమింగ్ స్టార్టప్ కంపెనీలన్నారు.

మార్కెట్లో మెర్సిడెస్ ఎల్‌డబ్ల్యూబీ ఇ-క్లాస్ కారు



లగ్జరీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ లాంగ్‌వీల్ బేస్ (ఎల్‌డబ్ల్యూబీ) ఇ-క్లాస్ కారును మార్కెట్లోకి తెచ్చింది. ఇ-క్లాస్ ఎల్‌డబ్ల్యూబీల్లో ఇప్పటికి ఇదే అత్యంత అధునాతనమైన కారు అని కంపెనీ తెలిపింది. మూడు వేరియెంట్లలో అందుబాటులో ఉండే ఈ కారు ప్రారంభ ధర రూ.78.5 లక్షలు కాగా టాప్ వేరియెంట్ ధర రూ.92.5 లక్షలు.

హ్యాట్రిక్ పతకం ఖరారు



- సెమీస్‌లో భారత పురుషుల జట్టు
- ఆసియా టీటీ



ఆస్తానా: ఆసియా టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో భారత జట్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. మహిళల జట్టు జపాన్‌తో జరిగిన సెమీస్‌లో ఓడి కాంస్య పతకంతో నిష్క్రమించగా, పురుషుల జట్టు సెమీఫైనల్లోకి ప్రవేశించి కనీసం కంచు పతకం ఖాయం చేసుకుంది. బుధవారం జరిగిన పురుషుల క్వార్టర్‌ఫైనల్స్‌లో భారత్ 3-1తో కజకిస్థాన్‌పై గెలిచింది. తొలి సింగిల్స్‌లో గెరాసిమెంకోకు మానవ్ ఠక్కర్ షాకిచ్చాడు. రెండో సింగిల్స్‌లో హర్మీత్ దేశాయ్ పరాజయం పాలయ్యాడు. ఈ దశలో శరత్ కమల్ నెగ్గడంతో భారత్ 2-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. నాలుగో మ్యాచ్‌లో మరోసారి బరిలోకి దిగిన హర్మీత్ 3-2తో గెరాసిమెంకోపై నెగ్గి, భారత్‌కు సెమీస్ బెర్త్‌తో పాటు కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేశాడు. ఆసియా టీటీలో భారత పురుషుల జట్టు గత రెండు పోటీల్లో వరుసగా కాంస్యాలు సాధించింది.

అమ్మాయిల ఓటమి: భారత అమ్మాయిలు సెమీఫైనల్స్‌లో 1-3తో జపాన్ చేతిలో ఓడి కాంస్య పతకంతో సరిపెట్టుకున్నారు. ఆకుల శ్రీజ సెమీస్‌లో బెంచ్‌కే పరిమితమైంది. ఐహిక ముఖర్జీ తొలి మ్యాచ్‌లో 2-3తో హరిమోటో చేతిలో ఓడింది. రెండో మ్యాచ్‌లో మనికా బాత్రా 3-0తో సత్సుకి ఓడోపై నెగ్గింది. మూడో మ్యాచ్‌లో విఎమ ఐటో 3-0తో సుత్రిత ముఖర్జీపై నెగ్గింది. నాలుగో మ్యాచ్‌లో మనికా బాత్రా 1-3తో మివా చేతిలో ఓడడంతో భారత్ పోటీల నుంచి నిష్క్రమించింది.

నితీశ్ తుఫాన్

86 పరుగులతో బంగ్లా ఓటమి

భారత్‌దే సిరీస్


నితీశ్ కుమార్ (34 బంతుల్లో 76)

న్యూఢిల్లీ: తెలుగు ఆటగాడు నితీశ్ కుమార్ రెడ్డి (34 బంతుల్లో 4 ఫోర్లు, 7 సిక్సర్లతో 76) తుఫాన్ ఇన్నింగ్స్‌కు రింకూ సింగ్ (29 బంతుల్లో 5 ఫోర్లు 3 సిక్స్‌లతో 53) మెరుపు హాఫ్ సెంచరీ తోడైన వేళ బంగ్లాదేశ్‌తో రెండో టీ20లో టీమిండియా 86 రన్స్‌తో ఏకపక్ష విజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో టీ20 ఉండగానే సొంతం చేసుకుంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో తొలుత భారత్ 20 ఓవర్లలో 221/9 స్కోరు చేసింది. హార్దిక్ పాండ్యా (19 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 32) మరోసారి దూకుడు ప్రదర్శించాడు. రిషద్ 3, టస్కిన్, ముస్తాఫిజుర్, తన్జిమ్ తలా రెండేసి వికెట్లు పడగొట్టారు. ఛేదనలో బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 135/9 స్కోరుకే పరిమితమైంది. మహ్మదుల్లా (41) ఒక్కడే రాణించాడు. వరుణ్, 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నితీశ్ చెరో రెండు వికెట్లు తీశారు.


రింకూ (53)

బంగ్లా విల..విల..: భారీ స్కోరు ఛేదనలో భారత బౌలర్ల ధాటికి మహ్మదుల్లా మినహా ఏ ఒక్క బంగ్లా బ్యాటరూ ఎదురు నిలవలేకపోయారు. పర్వేజ్‌ను బౌల్డ్ చేయడం ద్వారా బంగ్లా పతనానికి అర్ష్‌దీప్ నాంది పలకగా..అనంతరం ఒక్కో భారత బౌలర్ ప్రత్యర్థి బ్యాటర్లను వరుసగా పెవిలియన్‌కు చేర్చారు.

నితీశ్ ఆకాశమే హద్దుగా.. : భారత ఇన్నింగ్స్‌లో ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ ఆటే హైలైట్. పవర్‌ప్లేలోనే టాప్-3 బ్యాటర్లు అవుటైన దశలో ఏమాత్రం ఒత్తిడి లేకుండా బంగ్లాదేశ్ బౌలర్లను ఆడేసుకున్నాడు. కీపర్ లిట్టన్ క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన నితీశ్ ఆపై ప్రత్యర్థి బౌలర్ల భరతం పట్టాడు. రింకూసింగ్‌తో కలిసి భారత స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. స్పిన్నర్ రిషద్ వేసిన పదో ఓవర్లో నితీశ్ 4,6,6,6తో కదం తొక్కడంతో మొత్తం 24 రన్స్ లభించాయి. ఇదే ఊపులో టస్కిన్ ఓవర్లో బౌండరీ ఆపై సింగిల్‌తో నితీశ్ రెండో టీ20లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. ఇక మెహిదీహసన్ వేసిన 13వ ఓవర్లో నితీశ్ 6,4,6,6తో విరుచుకుపడడంతో స్టేడియం యావత్తూ ఫ్యాన్స్ హోరుతో దద్దరిల్లింది. అయితే తదుపరి ఓవర్లో నితీశ్‌ను క్యాచవుట్ చేసిన ముస్తాఫిజుర్ బంగ్లాదేశ్‌కు అతిపెద్ద రిలీఫ్ ఇచ్చాడు. దాంతో 109 పరుగుల నాలుగో వికెట్ భాగస్వామ్యం ముగిసింది. కానీ రింకూకు తోడైన హార్దిక్ ఎడాపెడా షాట్లతో బంగ్లా బౌలర్లను బెంబేలెత్తించాడు. మరోవైపు తన్జిమ్ బౌలింగ్‌లో 4,4,6తో రింకూ అర్ధ శతకం సాధించాడు. రింకూ ఇన్నింగ్స్‌కు టస్కిన్ తెరదించగా..తదుపరి పరాగ్ కూడా భారీ షాట్లతో చెలరేగాడు.

టీ20లలో బంగ్లాపై భారత్‌కిది (86 పరుగులు) అతి పెద్ద విజయం

ఓ మ్యాచ్‌లో భారత బౌలర్లు ఏడుగురు వికెట్లు తీయడం ఇదే తొలిసారి.

ఒకే టీ20లో 70+ పరుగులు, 2 వికెట్లు సాధించిన తొలి భారత ఆటగాడు నితీశ్

స్కోరుబోర్డు

భారత్ : శాంసన్ (సి) షంటో (బి) టస్కిన్ 10, అభిషేక్ శర్మ (బి) తన్జిమ్ 15, సూర్యకుమార్ (సి) షంటో (బి) ముస్తాఫిజుర్ 8, నితీశ్ (సి) మెహిదీహసన్ (బి) ముస్తాఫిజుర్ 74, రింకూ సింగ్ (సి) జాకెర్ (బి) టస్కిన్ 53, హార్దిక్ (సి) మెహిదీహసన్ (బి) రిషద్ 32, పరాగ్ (సి) మహ్మదుల్లా (బి) తన్జిమ్ 15, సుందర్ (నాటౌట్) 0, వరుణ్ (సి) పర్వేజ్ (బి) రిషద్ 0, అర్ష్‌దీప్ (సి) లిట్టన్ (బి) రిషద్ 6, మయాంక్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు : 7 ; మొత్తం 20 ఓవర్లలో 221/9 ; వికెట్లపతనం :** 1-17, 2-25, 3-41, 4-149, 5-185, 6-213, 7-214, 8-214, 9-220; **బౌలింగ్:** మెహిదీహసన్ 3-0-46-0, టస్కిన్ 4-0-16-2, తన్జిమ్ 4-0-50-2, ముస్తాఫిజుర్ 4-0-36-2, రిషద్ 4-0-55-3, మహ్మదుల్లా 1-0-15-0.

బంగ్లాదేశ్: పర్వేజ్ (బి) అర్ష్‌దీప్ 16, లిట్టన్ (బి) వరుణ్ 14, షంటో (సి) హార్దిక్ (బి) సుందర్ 11, తౌహిద్ (బి) అభిషేక్ 2, మెహిదీహసన్ (సి) సబ్/బిష్ణోయ్ (బి) పరాగ్ 16, మహ్మదుల్లా (సి) రియాన్ (బి) నితీశ్ 41, జాకెర్ (సి) సుందర్ (బి) మయాంక్ 1, రిషద్ (సి) హార్దిక్ (బి) వరుణ్ 9, తన్జిమ్ (సి) హార్దిక్ (బి) నితీశ్ 8, టస్కిన్ (నాటౌట్) 5, ముస్తాఫిజుర్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం 20 ఓవర్లలో 135/9; వికెట్లపతనం:** 1-20, 2-40, 3-42, 4-46, 5-80, 6-83, 7-93, 8-120, 9-127; **బౌలింగ్:** అర్ష్‌దీప్3-0-26-1, నితీశ్4-0-23-2, సుందర్ 1-0-4-1, వరుణ్ 4-0-19-2, అభిషేక్ 2-0-10-1, మయాంక్ 4-0-30-1, రియాన్ 2-0-16-1.

మెరిసిన హర్మన్, మంధాన



- 82 పరుగులతో లంక చిత్తు
- మహిళల టీ20 వరల్డ్‌కప్

నేటి మ్యాచ్
బంగ్లాదేశ్ X వెస్టిండీస్
రా. 7.30 నుంచి

దుబాయ్: కీలక మ్యాచ్‌లో బ్యాటర్లు, బౌలర్లు సమష్టిగా చెలరేగడంతో.. మహిళల టీ20 వరల్డ్‌కప్‌లో భారత్ భారీ విజయాన్ని నమోదు చేసింది. హర్మన్‌ప్రీత్ కౌర్ (27 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో 52 నాటౌట్), స్మృతి మంధాన (38 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 50) అదిరే హాఫ్ సెంచరీలతో.. బుధవారం గ్రూప్-ఎలో జరిగిన మ్యాచ్‌లో భారత్ 82 పరుగుల తేడాతో శ్రీలంకను చిత్తు చేసింది. రన్‌రేట్‌ను మెరుగుపర్చుకొన్న హర్మన్ సేన గ్రూప్‌లో రెండో స్థానానికి ఎగబాకింది. తొలుత భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 172 పరుగుల భారీ స్కోరు చేసింది. షఫాలీ వర్మ (40 బంతుల్లో 4 ఫోర్లతో 43) కూడా రాణించింది. ఛేదనలో లంక 19.5 ఓవర్లలో 90 పరుగులకు ఆలౌటైంది. కవిష (21), అనుష్క (20) టాప్ స్కోరర్లు. అరుంధతి, శోభన చెరో 3 వికెట్లు పడగొట్టగా.. రేణుక 2 వికెట్లు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా హర్మన్ నిలిచింది.

దెబ్బకొట్టిన రేణుక..: లంక భారీ ఛేదనలో ఇన్నింగ్స్ రెండో బంతికే ఓపెనర్ గుణరత్నె (0)ను డకౌట్ చేసిన రేణుక.. తన తర్వాతి ఓవర్‌లో హర్షిత (3)ను పెవిలియన్ చేర్చింది. రెండో ఓవర్‌లో చమరి ఆటపట్టు (1)ను శ్రేయాంక అవుట్ చేసి కోలుకోలేని దెబ్బకొట్టింది. దీంతో లంక 6/3తో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో కవిష, అనుష్క ఆదుకొనే ప్రయత్నం చేశారు. కానీ, శోభన బౌలింగ్‌లో అనుష్కను రిచా స్టంపౌట్ చేయడంతో.. నాలుగో వికెట్‌కు 37 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. 12వ ఓవర్‌లో నీలాక్షిక (8), కవిషను అరుంధతి అవుట్ చేయడంతో.. లంక 58/6తో పరాజయం దిశగా పయనించింది.

బ్యాటర్ల జోరు..: టాపార్డర్ బ్యాటర్లు హర్మన్, మంధాన బ్యాట్‌లు ఝుళిపించడంతో.. భారత్ సవాల్ విసరగలిగే స్కోరు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న భారత్‌కు ఓపెనర్లు షఫాలీ, మంధాన శుభారంభాన్నిచ్చారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 77 బంతుల్లో 98 పరుగుల భాగస్వామ్యంతో పటిష్ఠ పునాది వేయగా.. డెత్ ఓవర్లలో కెప్టెన్ హర్మన్ దూకుడుతో టీమ్ స్కోరు 170 పరుగులు దాటింది. పవర్‌ప్లేలో భారత్ 41/0తో నిలిచింది. కాగా, 13వ ఓవర్‌లో ఆటపట్టు బౌలింగ్‌లో భారత్‌కు గట్టిదెబ్బ తగిలింది. మంధానను రనౌట్ చేసిన ఆటపట్టు.. ఆ తర్వాతి బంతికి షఫాలీని పెవిలియన్ చేర్చింది. జెమీమా రోడ్రిగ్స్ (16) స్వల్ప స్కోరుకే వెనుదిరిగినా.. చివరి ఓవర్లలో హర్మన్ భారీ షాట్లతో విరుచుకుపడింది. కౌర్ దెబ్బకు లంక బౌలర్లు చివరి 5 ఓవర్లలో 59 పరుగులు సమర్పించుకొన్నారు.

80 పరుగులతో సౌతాఫ్రికా గెలుపు

దక్షిణాఫ్రికా టీ20 వరల్డ్ కప్‌లో రెండో విజయాన్ని నమోదు చేసింది. గ్రూప్-బిలో జరిగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికా 80 పరుగుల తేడాతో స్కాట్లాండ్‌ను ఓడించింది. దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 5 వికెట్లకు 166 పరుగులు చేసింది. కాప్ (43), బ్రిట్స్ (43), లారా వొల్వార్డ్ (40) రాణించారు. ఛేదనలో స్కాట్లాండ్ 17.5 ఓవర్లలో 86 పరుగులకు కుప్పకూలింది.

స్కోరు బోర్డు

భారత్: షఫాలీ (సి) గుణరత్నె (బి) ఆటపట్టు 43, మంధాన (రనౌట్) 50, హర్మన్‌ప్రీత్ (నాటౌట్) 52, జెమీమా (సి) ప్రబోధిని (బి) కాంచన 16, రిచా (నాటౌట్) 6; **ఎక్స్‌ట్రాలు:5; మొత్తం: 20 ఓవర్లలో 172/3; వికెట్ల పతనం:** 1-98, 2-98, 3-128; **బౌలింగ్:**ప్రియదర్శిని 2-0-11-0, సుగంధిక 3-0-29-0, ప్రబోధిని 3-0-32-0, కవిష 2-0-11-0, రణవీర 3-0-26-0, ఆటపట్టు 4-0-34-1, కాంచన 3-0-29-1.

శ్రీలంక: విష్మి గుణరత్నె (సి/సబ్) రాధ (బి) రేణుక 0, ఆటపట్టు (సి) దీప్తి (బి) శ్రేయాంక 1, హర్షిత (సి) రిచా (బి) రేణుక 3, కవిష (సి) రేణుక (బి) అరుంధతి 21, అనుష్క (స్టంప్) రిచా (బి) శోభన 20, నీలాక్షిక (సి) షఫాలీ (బి) అరుంధతి 8, కాంచన (సి/సబ్) రాధ (బి) అరుంధతి 19, సుగంధిక (సి) రిచా (బి) శోభన 1, ప్రియదర్శిని (సి/సబ్) రాధ (బి) శోభన 1, ప్రబోధిని (సి) మంధాన (బి) దీప్తి 9, రణవీర (నాటౌట్) 2; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 19.5 ఓవర్లలో 90 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-0, 2-4, 3-6, 4-43, 5-57, 6-58, 7-61, 8-65, 9-86; **బౌలింగ్:** రేణుక 4-0-16-2, శ్రేయాంక 4-0-15-1, దీప్తి 3.5-0-16-1, అరుంధతి 4-0-19-3, శోభన 4-0-19-3.

భారత యూత్ క్లీన్‌స్వీప్

రెండో టెస్ట్‌లోనూ ఆసీస్‌పై ఘన విజయం

చెన్నయ్ : స్పిన్నర్లు అన్‌మోల్‌జీత్ సింగ్, మహ్మద్ ఎనాన్.. 20 వికెట్లలో 16 పడగొట్టడంతో ఆస్ట్రేలియాతో జరిగిన రెండో యూత్ టెస్ట్‌లో భారత అండర్-19 జట్టు ఇన్నింగ్స్ 120 పరుగులతో ఘన విజయం సాధించింది. అంతేకాదు రెండు టెస్ట్‌ల సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. బుధవారం, మూడో రోజు ఆస్ట్రేలియా 17 వికెట్లు కోల్పోవడం గమనార్హం. భారత్ మొదటి ఇన్నింగ్స్ స్కోరు 492 రన్స్‌కు జవాబుగా..ఓవర్‌నైట్ 142/3తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన పర్యాటక జట్టు 277 పరుగులకు ఆలౌటైంది. దాంతో ఫాలోఆన్ చేపట్టిన ఆస్ట్రేలియా అండర్-19 భారత స్పిన్నర్ల ధాటికి రెండో ఇన్నింగ్స్‌లో 95 పరుగులకే కుప్పకూలింది.

రూట్, బ్రూక్ శతక మోత

ఇంగ్లండ్ 492/3


రూట్, బ్రూక్

ముల్తాన్: జో రూట్ (176 బ్యాటింగ్), హ్యారీ బ్రూక్ (141 బ్యాటింగ్) శతకాల మోత మోగించడంతో పాకిస్థాన్‌తో తొలి టెస్ట్‌లో ఇంగ్లండ్ దీటుగా బదులిస్తోంది. ఆటకు మూడో రోజు క్రితం రోజు స్కోరు 96/1తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఇంగ్లండ్ 3 వికెట్లకు 492 పరుగులు చేసింది. పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్ స్కోరు 556 పరుగులకు ఇంగ్లండ్ ఇంకా 64 రన్స్ దూరంలో ఉంది.

గవాస్కర్ రికార్డు బద్దలు..: టెస్టుల్లో అత్యధికంగా 35 శతకాలు బాదిన ఐదో బ్యాటర్‌గా రూట్ రికార్డుల కెక్కాడు. ఈ క్రమంలో 34 సెంచరీలు చేసిన గవాస్కర్, లారా, జయవర్ధనె, యూనిస్ ఖాన్‌లను దాటేశాడు. కాగా, ఇంగ్లండ్ తరఫున టెస్టుల్లో అత్యధిక పరుగులు సాధించిన కుక్ (12,472)ను రూట్ (12,578) అధిగమించాడు.

లక్ష్యసేన్, కిరణ్ ముందంజ

వాంటా (ఫిన్లాండ్): ఆర్కిటిక్ సూపర్ ఓపెన్ 500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత షట్లర్లు లక్ష్యసేన్, కిరణ్ జార్జ్ ముందంజ వేశారు. బుధవారం ముగిసిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో లక్ష్యసేన్‌కు వాకోవర్ లభించింది. మరో సింగిల్స్ మ్యాచ్‌లో యువ షట్లర్ కిరణ్ 23-21, 21-18తో వాంగ్ జు వీ (చైనీస్ తైపీ)పై గెలిచాడు.

అలాస్కన్‌కు ముంబా షాక్

లండన్ : టేబుల్ టాపర్ అలాస్కన్ నైట్స్‌కు అప్‌గ్రాడ్ ముంబా మాస్టర్స్ షాకిచ్చింది. గ్లోబల్ చెస్ లీగ్‌లో భాగంగా బుధవారం జరిగిన హోరాహోరీ మ్యాచ్‌లో ముంబా మాస్టర్స్ 10-9తో అలాస్కన్ నైట్స్‌పై నెగ్గింది. ఈ విజయంతో ముంబా జట్టు నాకౌట్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. ఇతర మ్యాచ్‌ల్లో..త్రివేణి కాంటినెంటల్ కింగ్స్ 12-9తో గ్యాంజీస్ గ్రాండ్‌మాస్టర్స్‌ని, ఆల్పైన్ పైపర్స్ 11-6తో అమెరికన్ గ్యాంబిట్స్‌ని ఓడించాయి.

సంగారెడ్డిలో నవజాత శిశువు కిడ్నాప్

» ప్రభుత్వాస్పత్రి నుంచి ఎత్తుకెళ్లిన నలుగురు మహిళలు
» ప్రత్యేక బృందాలతో గాలిస్తున్న పోలీసులు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 9: సంగారెడ్డిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)లో ఓ నవజాత శిశువు అపహరణకు గురైంది. బుధవారం తెల్లవారుజామున పుట్టిన ఆడపిల్లను గుర్తు తెలియని నలుగురు మహిళలు మధ్యాహ్నం ఎత్తుకెళ్లారు. సంగారెడ్డి జిల్లా మనూర్ మండలం దూదికొండకు చెందిన నసీమా(25) ప్రసవం నిమిత్తం మంగళవారం అర్ధరాత్రి ఎంసీహెచ్‌లో చేరారు. వైద్యులు బుధవారం తెల్లవారుజామున సిజేరియన్ చేయగా నసీమా ఆడపిల్లను ప్రసవించింది. అయితే, నసీమా తల్లి మున్నీబీ, అత్త హమీదా ఆ పసికందును ఎత్తుకుని బుధవారం మధ్యాహ్నం ఆస్పత్రి కారిడార్‌లో కూర్చున్నారు. నసీమా కుమారుడు కూడా వారి వద్దే ఉన్నాడు. ఈ క్రమంలో హమీదా ఆస్పత్రి ఎంఐసీయూలో ఉన్న నసీమా వద్దకు వెళ్లింది. ఆ సమయంలో మున్నీబీ వద్దకు వచ్చిన నలుగురు గుర్తు తెలియని మహిళలు(ముఖానికి మాస్కులు ధరించారు).. ఆమె దృష్టి మళ్లించి రెండు నిమిషాల్లో పసికందును తీసుకెళ్లిపోయారు. వెంటనే తేరుకున్న మున్నీబీ కేకలు వేయగా ఆస్పత్రి సిబ్బంది అప్రమత్తమయ్యారు. పసికందును కిడ్నాప్ చేసి తిరిగి వెళుతున్న క్రమంలో ఆస్పత్రి పార్కింగ్ వద్ద నలుగురు మహిళలూ నల్లటి బుర్కాలు ధరించారు. ఆ నలుగురిలో ఇద్దరు ఆటోలో, ఇద్దరు ద్విచక్రవాహనంలో వెళ్లిపోయారు. ఆస్పత్రి సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వగా.. ఘటనా స్థలికి చేరుకున్న ఎస్పీ రూపేష్.. సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించారు. సీసీ ఫుటేజీలో కనిపించిన ఆటో నెంబరు ద్వారా సంబంధిత ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా మహిళలను పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో వదిలేసినట్టు తెలిపాడు. దీంతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసిన పోలీసులు.. పసిబిడ్డను కిడ్నాప్ చేసిన మహిళల కోసం గాలిస్తున్నారు.

పచ్చని కొడంగల్‌ను విషపూరితం చేయడమే సీఎం లక్ష్యం

» ఫార్మా కంపెనీ తెస్తే సీఎం ఇంటిని ముట్టడిస్తాం
» మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి

కొత్తకోట, అక్టోబరు 9: కొడంగల్‌లో ఫార్మా కంపెనీ ప్రారంభానికి ప్రభుత్వం ముందుకు వస్తే సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి హెచ్చరించారు. ఫార్మా కంపెనీకి వ్యతిరేకంగా బుధవారం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం పోలేపల్లి గ్రామం నుంచి చేపట్టాల్సిన పాదయాత్రకు ముందే మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డిలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఉదయం తమ పాదయాత్రకు అనుమతి ఇచ్చి యాత్ర ప్రారంభమైన తరువాత పోలీసులు భగ్నం చేయడం ఏమిటని ప్రశ్నించారు. పచ్చని పంట భూములతో ఉన్న కొడంగల్ ప్రాంతాన్ని విషపూరితం చేయాలని రేవంత్ రెడ్డి లక్ష్యంగా ఉందని ఆరోపించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం సీఎం తలుచుకుంటే మంచి కంపెనీలు ముందుకు వస్తాయని, వాటిని ఎందుకు ఇక్కడికి మంజూరు చేయడం లేదో చెప్పాలని పేర్కొన్నారు.





నియామక పత్రాలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న జనం; మాట్లాడుతున్న సీఎం రేవంత్

ప్రజా ప్రభుత్వాన్ని పడగొడతామంటున్నారు

తెలంగాణ సమాజంపై ఎందుకింత కోపం?.. రెండుసార్లు కొరివి దెయ్యాన్ని తెచ్చుకున్నాం

» ఆ దెయ్యం పేదలను పట్టించుకోలేదు
» నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించలే
» మేం నోటిఫికేషన్లు వేస్తే అడ్డుకుంటున్నారు
» బీఆర్ఎస్‌కు మళ్లీ అధికారం రాదు..
» తెలంగాణ పునర్నిర్మాణంలో టీచర్లే కీలకం
» ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజలు రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చారని, కానీ.. బీఆర్ఎస్ మాత్రం తమ ప్రజా ప్రభుత్వాన్ని పడగొడతామంటోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇది న్యాయమా? తెలంగాణ సమాజంపై ఆ పార్టీకి ఎందుకింత కోపం? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌కు మళ్లీ అధికారం రాదని, తెలంగాణ ప్రజలు ఇవ్వరని అన్నారు. తండ్రీ కొడుకుల ఉద్యోగాలను ఊడగొట్టినందుకే మీకు ఉద్యోగాలు వచ్చాయంటూ నూతనంగా ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులనుద్దేశించి వ్యాఖ్యానించారు. బుధవారం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి.. వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొట్లాడి సాధించుకున్న రాష్ట్రంలో కోరి.. రెండుసార్లు కొరివి దెయ్యాన్ని తెచ్చుకున్నామని, మళ్లీ అలాంటిది జరగదని అన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్‌ను అడ్డుకోవడానికీ కొన్ని కొరివి దెయ్యాలు ప్రయత్నించాయని, కేసులు వేసి కుట్రలు చేశాయని ఆరోపించారు. గత ప్రభుత్వ నిరుద్యోగుల గురించి, పేదల గురించి ఆలోచించలేదని, కానీ.. తన కూతురు కవిత ఎంపీగా ఓడిపోగానే కేసీఆర్ ఆరు నెలల్లోనే ఎమ్మెల్సీ పదవి ఇచ్చారని విమర్శించారు. తెలంగాణ వచ్చిన మూడేళ్ల తరువాత డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారని, ఆ తరువాత రెండేళ్లకు నియామక ప్రక్రియ పూర్తి చేశారని అన్నారు. తాము మాత్రం పేదల మేలుకోసం విశ్రాంతి లేకుండా శ్రమిస్తున్నామని చెప్పారు. నిరుద్యోగుల నమ్మకాన్ని నిలబెడుతూ అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లోనే 30 వేల కొలువులు భర్తీ చేసి నియామక పత్రాలు అందజేశామని తెలిపారు. 65 రోజుల్లో డీఎస్సీ నియామక ప్రక్రియ పూర్తి చేశామన్నారు.

దసరా పండుగ ముందే వచ్చినట్లు ఉంది..

డీఎస్సీ విజేతలను చూస్తే దసరా పండుగ ముందే వచ్చినట్లు అనిపిస్తోందని సీఎం రేవంత్ అన్నారు. తెలంగాణ పునర్నిర్మాణంలో టీచర్లే కీలకమని, తెలంగాణ వారధులు, నిర్మాతలు వారేనని, పేద విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దే బాధ్యత వారిపైనే ఉందని పేర్కొన్నారు. నిరుపేదలు బంగారం అమ్మి ప్రైవేటు పాఠశాలలకు పిల్లల్ని పంపే పరిస్థితి మారాలని, కొత్తగా నియమితులైన ప్రభుత్వ ఉపాధ్యాయులే ఈ పరిస్థితికి కారణాలను అన్వేషించాలని సూచించారు. "నేను ప్రభుత్వ బడిలోనే చదువుకున్నా. ముఖ్యమంత్రిని అయ్యాను. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, కేశవరావు, కోదండరాం వంటి ఎందరో పెద్దలు ప్రభుత్వ బడిలోనే చదివారు. అబ్దుల్ కలాం కూడా ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే రాష్ట్రపతి అయ్యారు. మీలాంటి టీచర్లు చెప్పిన చదువుతోనే ఈ స్థాయికి వచ్చాం. జాతి నిర్మాతలను తీర్చిదిద్దిన క్షేత్రం ప్రభుత్వ బడి" అని సీఎం రేవంత్ అన్నారు. తెలంగాణలో 30 వేల ప్రభుత్వ పాఠశాలలు ఉంటే.. వాటిలో 24 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. ప్రైవేటు యాజమాన్యంలో 10 వేల పాఠశాలలు ఉంటే.. వాటిలో మాత్రం 34 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని చెప్పారు. "ప్రైవేటు స్కూళ్లలో మీకంటే ఎక్కువ చదువుకున్నవారు, మీకన్నా గొప్ప వ్యక్తులు, అనుభవం ఉన్నవారు బోధిస్తున్నారా?" అని ప్రశ్నించారు.

పుస్తెలు అమ్మి ప్రైవేటు స్కూల్‌కు పంపుతున్నారు..

గ్రామాల్లో సైతం ప్రభుత్వ బడికి వెళ్లడమంటే నామోషీగా భావిస్తున్నారని సీఎం రేవంత్ తప్పుబట్టారు. ఉపాధి హామీ కూలికి పోయినవారు కూడా తాము తిన్నా, తినకపోయినా.. పుస్తెలు అమ్మి అయినా తమ పిల్లలను ప్రైవేటు స్కూల్‌కు పంపాలనుకుంటున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితి ఎందుకు నెలకొన్నదో టీచర్లు ఆలోచించాలన్నారు. "అన్ని నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు ప్రారంభిస్తున్నాం. ఈ నెల 11న దీనికి శ్రీకారం చుడుతున్నాం. విద్యకు బడ్జెట్‌లో రూ.21 వేల కోట్లు కేటాయించాం. ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా ఆధునికీకరిస్తున్నాం. విద్యార్థులకు సాంకేతిక శిక్షణ ఇచ్చి.. ఉద్యోగ అవకాశాలు పెంపొందిస్తాం" అని సీఎం అన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించేందుకు యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీని ప్రారంభించామని, వారికి గల్ఫ్, మిడిల్ ఈస్ట్ వంటి దేశాల్లో ఉద్యోగాలు వచ్చేలా కృషి చేస్తున్నామని చెప్పారు. ఒలింపిక్స్ వేదికల్లో దేశం పరిస్థితి ఏంటో చూశామని, నాలుగు కోట్లు జనాభా ఉన్న దక్షిణ కొరియాకు ఒలింపిక్స్‌లో 32 పతకాలు వస్తే.. 140 కోట్ల జనాభా ఉన్న భారత్‌కు ఒలింపిక్స్‌లో ఎందుకు అన్ని పతకాలు రాలేదని సీఎం ప్రశ్నించారు. యువత మత్తుకు, వ్యసనాలకు బానిసలై.. తప్పుదోవ పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వచ్చే ఒలింపిక్స్‌లో తెలంగాణ అథ్లెట్లకు బంగారు పతకాలు రావాలని ఆకాంక్షించారు.

జాబ్ క్యాలెండర్ అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం..

దేశంలో జాబ్ క్యాలెండర్ ప్రకటించి అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడానికి ఎన్ని ఆర్థిక ఇబ్బందులు వచ్చినా ముందుకే పోతామన్నారు. ప్రపంచంతో పోటీపడే విధంగా తెలంగాణ సమాజాన్ని నిలబెట్టడానికి అందరం కలిసి నడుద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యుడు అభిషేక్ సింఘ్వీ, ప్రభుత్వ సలహాదారు కేశవరావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా.. ఉపాధ్యాయులుగా ఎంపికైన వారితో ముఖ్యమంత్రి ప్రతిజ్ఞ చేయించారు.

నా మనుమరాలు పెళ్లికి రండి..!
సీఎంను కలిసి ఆహ్వానించిన మల్లారెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి బుధవారం ఆయన నివాసంలో కలిశారు. తన మనవరాలు పెళ్లికి రావాలంటూ ఆయన్ను ఆహ్వానించారు. మల్లారెడ్డి వెంట ఆయన అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి కూడా ఉన్నారు.

రైతుల ఖాతాల్లో 25 వేల కోట్లు జమ

» గత పదేళ్ల కష్టాల నుంచి విముక్తి: కోదండరెడ్డి
» వ్యవసాయ కమిషన్ ఛైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది తిరగకముందే రైతుల ఖాతాల్లో రూ. 25 వేల కోట్లు జమ చేసినట్లు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కమిషన్ ఛైర్మన్‌గా ఇటీవల నియమితులైన సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎం. కోదండరెడ్డి తెలిపారు. ఆయన బుధవారం బీఆర్‌కే భవన్‌లో వ్యవసాయ కమిషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి, వ్యవసాయశాఖ అడిషనల్ డైరెక్టర్ విజయకుమార్, రైతుసంఘం నాయకులు శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ.. రైతులకు ఒక పంటకు పెట్టుబడి సాయం అందించడంతోపాటు రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేశామని అన్నారు. రైతులను రుణ విముక్తులను చేయడంతోపాటు వ్యవసాయ సంక్షేమ కార్యక్రమాల ద్వారా వారికి తోడునీడగా ఉంటామని కోదండరెడ్డి చెప్పారు.

మండలి చీఫ్ విప్‌గా పట్నం బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): శాసనమండలి చీఫ్ విప్‌గా ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ మహేందర్‌రెడ్డి తోటి సభ్యులకు చేదోడు వాదోడుగా ఉంటారని ఆకాంక్షించారు. మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చట్ట సభల ద్వారా ప్రజలకు అందుబాటులో తీసుకువచ్చేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

నేను బీఆర్ఎస్ మండలి ఛైర్మన్‌ను కాను : గుత్తా

హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తాను బీఆర్ఎస్ మండలి ఛైర్మన్‌ను కానని, ఈ పదవిని తీసుకున్న తర్వాత తనకు ఏ పార్టీతోనూ సంబంధం ఉండదని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అలాగే పట్నం మహేందర్‌రెడ్డినీ అధికారిక చీఫ్ విప్‌గానే చూడాలన్నారు. మహేందర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ అనంతరం గుత్తా సుఖేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఉద్యోగ నియామకాలపై ఇప్పుడు మాట్లాడుతున్న బీఆర్ఎస్ వారు.. అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారని ప్రశ్నించారు. ఎమ్మెల్యేల ఫిరాయింపుల అంశంలోనూ ఆ ప్రభుత్వం ఏం చేసిందో గుర్తు చేసుకుంటే మంచిదన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలోనూ ఒక్కొక్కరుగా చేరిన తర్వాతనే విలీనం చేసుకున్నారన్నారు. తలసాని.. టీడీపీ ఎమ్మెల్యేగా ఉండీ ప్రభుత్వంలో మంత్రిగా చేరలేదా అని గుర్తు చేశారు.

ఆ అవినీతిలో మంత్రి తుమ్మలకూ భాగముందంటారా?

హైదరాబాద్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల కార్పొరేషన్ పదేళ్ల బడ్జెట్ మొత్తం రూ.63 కోట్లయితే, రూ. వందకోట్ల అవినీతి జరిగిందని ఆరోపణలు చేయడం తగదని బీఆర్ఎస్ నేత వాసుదేవరెడ్డి తెలిపారు. దివ్యాంగుల కార్పొరేషన్ ఛైర్మన్ వీరయ్య ఏమాత్రం అవగాహన లేకుండా అవివేకంతో మాట్లాడుతున్నారని విమర్శించారు. 2014లో బీఆర్ఎస్ తొలి ప్రభుత్వంలో దివ్యాంగులశాఖ మంత్రిగా ప్రస్తుత వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కొనసాగారని, మీ ఆరోపణల ప్రకారం ఆ అవినీతిలో ఆయనకూ భాగస్వామ్యం ఉందంటారా? అని ప్రశ్నించారు. తనపై మాజీ మంత్రులు హరీశ్‌రావు, కొప్పుల ఈశ్వర్‌లపై వీరయ్య చేసిన నిరాధారమైన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నానని వాసుదేవరెడ్డి తెలిపారు. .

లిఫ్ట్ ఇరిగేషన్ పేరుతో వేలకోట్ల ఖర్చు సరికాదు

» బీజేపీ సీనియర్ నేత మర్రి శశిధర్ రెడ్డి

న్యూఢిల్లీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల పేరుతో వేలకోట్లు ఖర్చు చేయడం సరికాదని బీజేపీ సీనియర్ నేత మర్రి శశిధర్ రెడ్డి తెలిపారు. నారాయణపేట - కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి ప్రత్యామ్నాయం ఆలోచించాలని సూచించారు. మర్రి చెన్నారెడ్డి ట్రస్ట్ కార్యదర్శిగా సీఎం రేవంత్ రెడ్డికి తాను ఈమేరకు ఒక లేఖ రాశానని తెలిపారు. లక్ష ఎకరాలకు నీరు అందించే లక్ష్యంతో నారాయణపేట - కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారన్నారు. దీనికి రూ. 4,350 కోట్ల ఖర్చు, మూడువేల ఎకరాల భూమి అవసరమని తెలిపారు. వరద నీటి ఆధారంగా కట్టే ప్రాజెక్టులు అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటాయని కచ్చితంగా చెప్పలేమని అభిప్రాయ పడ్డారు. రేవంత్ రెడ్డికి తాను రాసిన లేఖలో ఎన్నో అత్యుత్తమమైన మార్గాలు సూచించానని, అందులో దివంగత హనుమంతరావు సూచించిన చతుర్విధ జల విధానంలోని "వాటర్ షెడ్ డెవలప్‌మెంట్ స్కీమ్" ఒకటన్నారు. ఎకరానికి రూ. 5 వేల ఖర్చుతో భూగర్భ జలాలను పుష్కలంగా పెంపొందించవచ్చని తెలిపారు.

నేడు, రేపు భారీ వర్షాలు

» పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ

హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో గురు, శుక్రవారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈనెల 11న నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, యాదాద్రి, మహబూబాబాద్, వరంగల్, వికారాబాద్, నారాయణపేట, మహబూబ్‌నగర్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటలకు 30-40 కిలోమీటర్ల వేగంతో వీచే ఈదురుగాలులతో కూడిన తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని తెలిపింది.

'రియల్' విల్లాలు కనిపించడం లేదా?

» చెరువులను కబ్జా చేసిన 30 రియల్ ఎస్టేట్ సంస్థలు
» విల్లాలు కట్టి వేల కోట్ల వ్యాపారం
» వారి జోలికి ఎందుకు వెళ్లరు..
» నేను చెప్పింది తప్పని నిరూపిస్తే ఆత్మహత్య చేసుకుంటా
» బాధితులకు ఇళ్లు కట్టివ్వడానికి ఎమ్మెల్యేలు ముందుకు రావాలి
» నా ఐదేళ్ల జీతం మొత్తం ఇవ్వడానికి రెడీ
» బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): చెరువులను ఆక్రమించారంటూ పేద, మధ్య తరగతి వర్గాల ఇళ్లను కూల్చివేస్తోన్న రేవంత్ సర్కారుకు చెరువులను పూర్తిగా కబ్జా చేసి నిర్మించిన బహుళ అంతస్తుల భవనాలు, విల్లాలు కనిపించడం లేదా అని బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ప్రశ్నించారు. ఆక్రమణలకు పాల్పడి వేల కోట్ల వ్యాపారం చేస్తున్నవారి జోలికి ఎందుకు వెళ్లడం లేదని నిలదీశారు. ఐటీ కారిడార్, ఇతర ప్రాంతాల్లో 30 రియల్ ఎస్టేట్ కంపెనీలు చెరువుల్లో భారీ ప్రాజెక్టులు నిర్మించాయని పేర్లతో సహ వెల్లడించిన ఆయన.. తాను చెప్పిన దాంట్లో అవాస్తవమున్నట్టు రేవంత్, కేసీఆర్, కేటీఆర్‌లు నిరూపిస్తే అక్కడే ఆత్మహత్య చేసుకుంటానన్నారు. రాజకీయ నాయకుడి రాజీనామా అంటే ప్రజలు జోక్ అనకుంటారని, అందుకే ఆత్మహత్య చేసుకుంటానని సవాలు చేసినట్లు ఆయన చెప్పారు. "నా గెలుపు డిఫరెంట్. నా ఆలోచన విధానం డిఫరెంట్. నేను ప్రజల మనసు గెలిచిన తప్ప.. ఓట్లు కొని లీడర్ కాలేదు" అని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పుడు 'డ్యామేజెస్, ప్యాకేజెస్, పర్సంటేజెస్' విధానం నడుస్తోందని ఆయన ఆరోపించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకటరమణారెడ్డి మాట్లాడారు. "చెరువులు కబ్జాకు గురయ్యాయని ఇటీవల పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా డిప్యూటీ సీఎం వివరించారు. కానీ, ఆక్రమించినవారి పేర్లను వెల్లడించలేదు. కామారెడ్డి ఎమ్మెల్యేను అయినా నాకు ఆ వివరాలు తెలుసు. సీఎం, డిప్యూటీ సీఎంకు తెలియదా.. తెలిసినా చెప్పలేదా.. చెప్పకపోవడంలో ఆంతర్యమేంటి" అని ప్రశ్నించారు. చెరువుల రికార్డుల నిర్వహణ, భవనాలకు అనుమతుల జారీలో బీఆర్ఎస్ సర్కారు ఇష్టారాజ్యంగా వ్యవహరించిందని వెంకటరమణారెడ్డి ఆరోపించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులిచ్చిన అధికారులను సస్పెండ్/అరెస్ట్ చేయాలని, వారి ఆస్తులను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. చెరువులు, మూసీ వెంట ఇళ్లు కోల్పోయినోళ్లకు ఇళ్లు కట్టించేందుకు ఎమ్మెల్యేలంతా ముందుకు రావాలని వెంకటరమణారెడ్డి కోరారు. "నాకు నెలకు రూ.2.75 లక్షల జీతం. 10 నెలలుగా తీసుకున్న మొత్తంతో పాటు మరో నాలుగేళ్ల రెండు నెలలు వచ్చే వేతనాన్ని ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాను" అని ప్రకటించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం సభ్యులు కూడా ముందుకు రావాలని, శాసన సభ్యుల ఐదేళ్ల వేతనం రూ.200 కోట్లతో పేదలకు ఇళ్లు నిర్మించి ఇద్దామని అన్నారు.



అరెస్ట్ అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

ఎమ్మార్పీఎస్ నిరసన ఉద్రిక్తం

» ఇందిరా పార్కు సిగ్నల్ వద్ద ర్యాలీ అడ్డగింత
» మందకృష్ణ మాదిగ సహా పలువురి అరెస్టు

కవాడిగూడ, బౌద్ధనగర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా 11వేల మందికి ఉపాధ్యాయ నియామక పత్రాలు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ ఎమ్మార్పీఎస్ బుధవారం చేపట్టిన నిరసన ఉద్రిక్తతకు దారి తీసింది. ఎమ్మార్పీఎస్ శ్రేణులు, పోలీసుల మధ్య వాగ్వాదం, తోపులాటలు, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ సహా పలువురు నేతల అరెస్టులతో సాగింది. హైదరాబాద్, పార్సీగుట్టలోని ఎమ్మార్పీఎస్ కేంద్ర కార్యాలయం నుంచి ఇందిరా పార్కు వరకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన ర్యాలీని ఇందిరా పార్కు సిగ్నల్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఎమ్మార్పీఎస్ శ్రేణులు, పోలీసులు మధ్య మొదలైన వాగ్వాదం తోపులాటకు దారి తీసింది. పరిస్థితి అదుపు తప్పుతుండడంతో మంద కృష్ణ మాదిగ సహా పలువురిని పోలీసులు అరెస్టు చేసి వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు. అరెస్టు సందర్భంగా మంద కృష్ణ మాదిగ విలేకరులతో మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలు ఇవ్వడం వల్ల ఎంతో మంది మాదిగలకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు తీర్పును అమలు చేస్తామని అసెంబ్లీలో ప్రకటించిన ముఖ్యమంత్రి మాదిగలను మోసం చేశారని మండిపడ్డారు. మాలల ఒత్తిడికి తలొగ్గి మాదిగలకు నమ్మకం ద్రోహం చేసిన ముఖ్యమంత్రికి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాలలకు కొమ్ముకాస్తుందని మరోసారి రుజువైందని ఆరోపించారు. అక్టోబరు 15న ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించి ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని మంద కృష్ణ తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిండ్ నరేష్ మాదిగ, జాతీయ కార్యదర్శి తిప్పారపు లక్ష్మణ్, ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టు కార్యదర్శి నంబాల ఎక్కడ?

ఆశన్న, కమలేశ్‌ల జాడేది?.. అబూజ్‌మడ్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారా?

» నేటికీ సమాచారం లేకపోవడంతో అనుమానాలు
» ఇంకా 9 మంది మృతుల వివరాలు ప్రకటించని ఛత్తీస్‌గఢ్ సర్కారు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు బతికే ఉన్నారా? లేక ఎన్‌కౌంటర్‌లో చనిపోయారా? ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్‌లో ఎన్‌కౌంటర్ జరిగి ఆరు రోజులవుతోంది. ఆ ఘటనలో మృతి చెందిన 9 మంది పేర్లను ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఇప్పటివరకూ ప్రకటించలేదు. దీంతో చనిపోయినవారిలో మావోయిస్టు పార్టీ అగ్రనాయకులు ఉన్నారేమోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈనెల 4వ తేదీన ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతానికి సమీపంలోనే నంబాల కేశవరావు ఉన్నట్లు తెలిసింది. విశ్వసనీయంగా తెలిసిన సమాచారం మేరకు.. ఈ ఏడాది అక్టోబరులో మావోయిస్టు పార్టీ 20 ఏళ్ల వ్యవస్థాపక సంబరాలు జరుపుకోవాలని భారీగా ప్రణాళిక వేశారు. ఇందుకోసం మావోయిస్టు సైన్యం పీఎల్‌జీఏతో సైనిక విన్యాసాలు, ఉత్సవాలు, కళాప్రదర్శనలు భారీగా నిర్వహించాలని కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి నంబాల కేశవరావు, మరో ఇద్దరు కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యులు హాజరయ్యారు. వారిలో మావోయిస్టు మిలటరీ కమిషన్ ఇన్‌చార్జి ఆశన్న, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు కమలేశ్ ఆలియాస్ నాగరాజు ఉన్నారు. సహజంగా పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శికి మూడంచెల భద్రత ఉంటుంది. తొలి అంచెలో పీఎల్‌జీఏ సెక్యూరిటీ, రెండో అంచెలో సీ6 బెటాలియన్ రక్షణ వలయంగా పనిచేస్తుంది. మూడో దశలో రెగ్యులర్ దళాలు ఉంటాయి. అయితే, 4వ తేదీన జరిగిన ఎన్‌కౌంటర్‌లో సీ6 బెటాలియన్‌లో పనిచేసేవారు 21 మంది మరణించారు. అయితే, ఆయుధ ప్రయోగం, సైనిక వ్యవహారాల్లో సీ6 టీమ్ ఉత్తమమైనదే అని తెలిసింది. కఠినమైన శిక్షణ, నేర్పరితనం, యుద్ధ వ్యూహాల అములులో వారు సుదీర్ఘ శిక్షణ తీసుకొని ఉంటారు. ముందస్తు సమాచారం.. పక్కా వ్యూహంతోనే స్నైపర్స్‌ను వాడి సెంట్రీని దెబ్బకొట్టిన తర్వాత నేరుగా మిలటరీ క్యాంపునకు ఐటీబీపీ, బీఎస్ఎఫ్ బలగాలను పంపించి ఫైరింగ్ చేయించారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ బలగాలు ముందే ప్రధాన కార్యదర్శి ఉన్న స్పాట్‌కు చేరుకొని ఆయనకు రక్షణగా ఉన్న టీమ్‌ను అంతమొందించి ఉంటారని ఆ పార్టీ మిలటరీ వ్యవహారాలపై అవగాహన ఉన్న నేత ఒకరు చెప్పారు. ఆ తర్వాత సీ6 టీమ్‌పై దాడి చేసినప్పుడు ఆ బృందం చెల్లాచెదురయి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలో నంబాల, ఆశన్న, కమలేశ్‌లను సజీవంగా పట్టుకొన్నారా? లేక వారిని కూడా చంపేశారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉంటే, ఎన్‌కౌంటర్ మృతుల్లో 9 మంది వివరాలు బహిర్గతం చేయకపోవడం అనేక కొత్త అనుమానాలకు తావిస్తోంది. ఈ వివరాలను వెల్లడించడానికి కేంద్ర హోం శాఖవద్ద ఏదైనా వ్యూహం ఉందా? దసరా సందర్భంగా లేదా మరో సందర్భంలో ఏమైనా ప్రకటన చేసే ఉద్దేశ్యం ఉందా? అన్న ప్రశ్నలు ఎదురవుతున్నాయి. ఎన్‌కౌంటర్‌లు జరిగిన తర్వాత సంబంధిత స్పాట్‌నుంచి కీలక నేతలు తప్పించుకున్న తర్వాత రెండు మూడు రోజుల్లో సమాచారం మావోయిస్టు పార్టీకి తెలిసిపోతుంది. అదీ సాధ్యంకాకపోతే ప్రజాసంఘాల వారికి కబురు వెళ్తుంది. కానీ, ఈ సారి అలా జరగలేదు. ఇటు పార్టీకి, అటు ప్రజాసంఘాలకు ఏ సమాచారం లేదు. మరోవైపు ఈ ఎన్‌కౌంటర్‌పై ఇప్పటి వరకు పార్టీ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడకపోవడంతో నంబాల ఉనికిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఈవీఎంలపై మాట్లాడటానికి సిగ్గుండాలి..

» 2019లో వైసీపీ ఎలా గెలిచింది?
» అభివృద్ధి సాఫీగా జరగాలంటే 'జమిలి' అవసరం
» మీడియా భేటీలో ఏపీ సీఎం చంద్రబాబు

అమరావతి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): '2019లో వైసీపీ ఎలా గెలిచింది? వాళ్లు ఈవీఎంల మాయతోనే గెలిచారా?' అని ఏపీ సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. ఏపీ, హరియాణా ఎన్నికల్లో ఈవీఎంల మాయతో గెలిచారని కొందరు వైసీపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను మీడియా ప్రతినిధులు ప్రస్తావించగా.. ఆయన ఈ మేరకు స్పందించారు. 'ఇటువంటి చెత్త మాటలు మాట్లాడేందుకు సిగ్గుండాలి. రాష్ట్రానికి వీళ్లే అరిష్టం' అని మండిపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ సుపరిపాలన వల్లే హరియాణాలో బీజేపీకి ఘన విజయం సిద్ధించిందన్నారు. లోక్‌సభ, అసెంబ్లీలకు జమిలి ఎన్నికలు కచ్చితంగా అవసరమని చంద్రబాబు ఉద్ఘాటించారు. 'ఏడాదికి 4 సార్లు ఏవో ఎన్నికలు వస్తుండేసరికి ప్రభుత్వాలకు వాటి పనే సరిపోతోంది. ఒకేసారి పార్లమెంటు, అసెంబ్లీ, స్థానిక ఎన్నికలు అయిపోతే తర్వాత పరిపాలన మీద దృష్టి పెట్టి పనిచేయవచ్చు. నేను ఈ ప్రతిపాదనకు మద్దతు ఇస్తున్నాను' అని తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కంకటాల మల్లిక్. చిత్రంలో మాపూరి వెంకటరమణ, మురళీకృష్ణ, కృష్ణ ప్రసాద్

సీఎంఆర్ షాపింగ్ మాల్‌పై దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

» సోషల్ మీడియా ప్రచారంలో వాస్తవం లేదు
» ది వైజాగపటం క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్
» ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేశాం
» సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ

విశాఖపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రజాదరణ పొందుతున్న సీఎంఆర్ షాపింగ్ మాల్స్‌పై కొందరు ఇటీవల సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని, మార్ఫింగ్ ఫొటోలతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని వాటిని ఎవరూ నమ్మవద్దని ది వైజాగపటం క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కంకటాల మల్లిక్ కోరారు. అసోసియేషన్ తరఫున ఆయన మాట్లాడుతూ, సీఎంఆర్ సంస్థల ప్రతిష్ఠను దెబ్బతీసే దురుద్దేశంతో ఇదంతా చేస్తున్నారని ఆరోపించారు. దీనిని వస్త్ర వ్యాపారులంతా ఖండిస్తున్నామన్నారు. సోషల్ మీడియాలో వచ్చేదంతా వాస్తవం కాదని, నిర్ధారించుకోవాలని సూచించారు. సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ మాట్లాడుతూ సోషల్ మీడియాలో సీఎంఆర్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారంపై ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో సీఎంఆర్ షాపింగ్ మాల్స్ ఉన్న ప్రతిచోట పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. తెలిసీ తెలియక ఈ పోస్టును ఇతరులకు షేర్ చేసినా సైబర్ క్రైమ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. సీఐఐ ఏపీ వైస్ ఛైర్మన్ మురళీకృష్ణ మాట్లాడుతూ, సీఎంఆర్ గ్రూపు వ్యాపారంలోనే కాకుండా సేవా కార్యక్రమాల్లో కూడా ముందుంటుందని, వారిపై తప్పుడు ప్రచారం చేయడం తగదని అన్నారు. మతపరమైన అంశాలను జోడించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అటువంటి వాటివల్ల శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని, అలాంటి పనులు తగవని వీసీసీఐ అధ్యక్షులు సుదర్శన స్వామి అన్నారు. ఈ అంశంపై పోలీసులకు ఫిర్యాదు చేసినందున విచారణ జరుగుతున్నదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ పూర్వపు అధ్యక్షులు పైడా కృష్ణప్రసాద్ కోరారు.

మిగిలిన అర్హులందరికీ వారంలో రుణమాఫీ

» మూడ్రోజుల్లోగా రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు

» జనవరి నుంచి రేషన్‌లో సన్నబియ్యం: కోమటిరెడ్డి

» నల్లగొండలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



నల్లగొండ టౌన్, అక్టోబరు 9: వారం, పది రోజుల్లో అర్హులైన మిగతా రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయనున్నట్లు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఒకేసారి 22 లక్షల మంది రైతులకు రూ.18 వేల కోట్ల రుణాలు మాఫీ చేశామని వెల్లడించారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని అర్జాలబావి వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ.. నల్లగొండ జిల్లాలో గత సీజన్‌లో సైతం ధాన్యం కొనుగోలు చేసిన మూడ్రోజుల్లోనే రైతులకు చెల్లింపులు చేశామని, ఈ సీజన్‌లోనూ మూడ్రోజుల్లోనే వారి బ్యాంకు ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమ చేస్తామని తెలిపారు. రూ.2 లక్షల కన్నా ఎక్కువగా ఉన్న రైతుల రుణాలనూ వారం, పది రోజుల్లో మాఫీ చేస్తామని చెప్పారు. సన్న ధాన్యాన్ని ప్రోత్సహించడంలో భాగంగా ప్రత్యేకించి తమ ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తోందన్నారు. పేదలు కూడా సన్నబియ్యం తినాలనే ఉద్దేశంతో వచ్చే జనవరి నుంచి రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించిందని తెలిపారు. అన్ని సామాజికవర్గాల విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని రూ.200కోట్లతో ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లను కట్టిస్తున్నామని, తొలి విడతలో 20నియోజకవర్గాల్లో ఈ నెల 11వ తేదీన హాస్టల్ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలల్లో 70 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు.

'మూసీ' వ్యతిరేకత.. రాజకీయ లబ్ధి కోసమే

» విపక్షాలది అనవసర రాద్ధాంతం: శాస్త్రవేత్త ఎం.ఎన్.రెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మూసీ సుందరీకరణ ప్రాజెక్టుపై రాజకీయ ప్రయోజనాల కోసమే ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నాయని ప్రముఖ భూగర్భ శాస్త్రవేత్త, ఉస్మానియా వర్సిటీ జియాలజీ విభాగం మాజీ అధిపతి ప్రొఫెసర్ ఎం.ఎన్.రెడ్డి ఆరోపించారు. మూసీ సుందరీకరణకు గత ముఖ్యమంత్రులు చెన్నారెడ్డి, వైఎస్సార్, కేసీఆర్‌లు ప్రయత్నించి వివిధ కారణాలతో విఫలం అయ్యారని పేర్కొన్నారు. ఈసారి ఎలాగైనా చేయాలన్న లక్ష్యంతో సీఎం రేవంత్ చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నారని, ఈ విషయంలో ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేయకూడదని ఎం.ఎన్. రెడ్డి హితవు పలికారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు.

14 నుంచి గ్రూప్-1 మెయిన్స్ హాల్‌టికెట్లు

» 21-27 వరకు పరీక్షలు..అరగంట ముందే హాల్‌లోకి

హైదరాబాద్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్ పరీక్షల హాల్ టికెట్లను ఈ నెల 14వ తేదీ నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అధికారులు తెలిపారు. పరీక్ష ప్రారంభం అయ్యే ఒక రోజు ముందు వరకు ఇవి అందుబాటులో ఉంటాయని, అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవాల్సిందిగా సూచించారు. ఈ నెల 21 నుంచి 27వ తేదీల మధ్య గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరుగనున్నాయి. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ పరీక్షలకు అభ్యర్థులు కనీసం 30 నిమిషాల ముందుగా పరీక్ష హాల్‌లోకి చేరుకోవాల్సి ఉంటుందని అధికారులు ప్రకటించారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల వరకు అనుమతిస్తామని, ఆ తర్వాత వచ్చే వారిని అనుమతించబోమని స్పష్టం చేశారు. మెయిన్స్‌లో భాగంగా ప్రతీ అభ్యర్థి ఆరు పేపర్లకు సంబంధించి పరీక్షలను రాయాల్సి ఉంటుంది. ప్రతీ పరీక్ష హాల్‌లో అభ్యర్థుల కోసం వాల్ క్లాక్‌లను ఏర్పాటు చేస్తున్నారు. పరీక్షలకు సంబంధించిన ఏమైనా సాంకేతిక సమస్యలు, ఇతర అనుమానాలుంటే 040-23452185, 040-23452186, 040-23452187 నంబర్లకు కానీ, ఈ-మెయిల్‌లో కానీ సంప్రదించవచ్చని అధికారులు సూచించారు.

ఐటీడీఏల పరిధిలో 4 డయాగ్నస్టిక్స్ కేంద్రాలు

» తొలుత 60 టెస్టులు.. తర్వాత ఇమేజింగ్ సేవలు కూడా

హైదరాబాద్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ(ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ)ల పరిధిలో 4 టీ-డయాగ్నస్టిక్స్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సర్కారు నిర్ణయించింది. అందుకు సంబంధించి ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేసి పంపాలని వైద్యశాఖ ఉన్నతాధికారులను ఆదేశించింది. మన్ననూరు, భద్రాచలం, ఏటూరు నాగారం, ఉట్నూరు ఆ నాలుగు టీ-డయాగ్నస్టిక్స్ కేంద్రాలు ఏర్పాటు కాబోతున్నాయి. ఆ కేంద్రాల్లో తొలుత రక్త, మూత్ర సంబంధిత పరీక్షలు సహా 60 రకాల పరీక్షలు ఉచితంగా చేస్తామని వైద్యవర్గాలు వెల్లడించాయి. ఆ తర్వాత ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్, సీటీ స్కాన్ వంటి ఇమేజింగ్ సేవలతో పాటు ఈసీజీ సేవలను అందుబాటులోకి తీసుకొస్తారు. ఇమేజింగ్ సేవల సాధ్యాసాధ్యాలపై వైద్య అధికారుల బృందం అధ్యయనం చేయనుంది. ఆయా కేంద్రాల్లో కాంట్రాక్టు పద్ధతిలో స్పెషలిస్టు వైద్యులను తీసుకోనున్నారు.

బీసీ కమిషన్ పదవీకాలం మూడేళ్లు

» ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వెనకబడిన వర్గాల కమిషన్‌కు సంబంధించిన పదవీకాలం, జీతభత్యాలు, ఇతర వసతులపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి మూడేళ్ల వరకు బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులు పదవిలో కొనసాగుతారని తెలిపింది. టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యులకు ప్రస్తుతం ఉన్న జీతభత్యాలు, వసతులు బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులకూ వర్తిస్తాయని ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల 9న బీసీ కమిషన్ చైర్మన్‌గా నిరంజన్, సభ్యులుగా రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. అయితే కమిషన్ హోదా, పదవీకాలంతో పాటు జీతభత్యాలపై స్పష్టత ఇవ్వాలని కమిషన్‌కు సభ్య కార్యదర్శిగా ఉన్న బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ ప్రభుత్వాన్ని కోరగా బుధవారం ఈ మేరకు స్పందించింది.

భూముల అన్యాక్రాంతంపై సర్కారుకు నోటీసులు!

హైదరాబాద్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కోఠిలోని మహాత్మాగాంధీ స్మారక నిధి ట్రస్టుకు చెందిన భూములను ప్రైవేటు వ్యక్తుల పేరిట మ్యుటేషన్ చేయడంపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం, సీసీఎల్ఏ, సిద్దిపేట జిల్లా కలెక్టర్, ఆర్డీవో, సిద్దిపేట మండల తహసీల్దార్ తదితరులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ట్రస్టుకు చెందిన భూములను ప్రైవేటు వ్యక్తులపరం చేస్తున్నారంటూ సిద్దిపేట్ అర్బన్ మండలానికి చెందిన తుపాకులం బాలరంగం, అమ్ముల వెంకయ్య, పెండాల శ్రీనివాస రెడ్డి, ఎద్దురాజు, గండె అరుణ్‌కుమార్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. మండలంలోని పొన్నాల గ్రామం సర్వే నంబర్లు 241, 241ఏఏ లోని 5.34ఎకరాలను ప్రైవేటు వ్యక్తుల పేరిట మ్యుటేషన్ చేశారని వివరించారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుల ధర్మాసనం విచారణ చేపట్టింది. చట్టవ్యతిరేకంగా జరిగిన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని, ట్రస్టు భూములను కాపాడాలని పిటిషనర్ తరఫు న్యాయవాదులు కోరారు. వాదనలు విన్న ధర్మాసనం ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

2028 డిసెంబరు వరకూ పోషక బియ్యం

న్యూఢిల్లీ, అక్టోబరు 9: దసరా పండుగ వేళ దేశంలోని కోట్లాది మంది పేదలకు మేలు చేకూరుస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వారికి పోషకాహారం అందించే ఉద్దేశంతో తీసుకొచ్చిన పోషక బియ్యం సరఫరాను 2028 డిసెంబరు వరకూ కొనసాగించాలని నిర్ణయించింది. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై), ఇతర సంక్షేమ పథకాల కింద ఇచ్చే ఉచిత బియ్యంలో ఈ ఫోర్టిఫైడ్ రైస్‌ను కలిపేందుకు రూ.17వేల కోట్లకు పైగా ఖర్చు చేయనుంది. ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. కాగా, గుజరాత్‌లోని లోథాల్ వద్ద నేషనల్ మారిటైమ్ హెరిటేజ్ కాంప్లెక్స్ (ఎన్ఎంహెచ్‌సీ) అభివృద్ధి ప్రతిపాదనను కేబినెట్ ఆమోదించింది. ఈ ప్రాజెక్టు ద్వారా 15వేల మందికి ప్రత్యక్షంగా, 7వేల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని కేంద్రం ప్రకటించింది.

ఉద్యమంగా బహుజన బతుకమ్మ

వెలివాడలో ఉత్సవాలు నిర్వహించాం.. బతుకమ్మ వేడుకల్లో విమలక్క వ్యాఖ్య

హైదరాబాద్/రవీంద్రభారతి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): బతుకమ్మ పండుగ ఉత్సవం మాత్రమే కాదని ఉద్యమంలా బహుజన బతుకమ్మను నిర్వహిస్తున్నామని ప్రజాగాయని విమలక్క పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వెలివాడల్లో, నిరాకరించబడిన ప్రాంతాల్లో కూడా బతుకమ్మ ఆడించి చెరువులో నిమజ్జనం చేయించిన ఘనత బహుజన బతుకమ్మదని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో బహుజన బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. బతుకమ్మ, పర్యావరణం, మహిళల భద్రత, చెరువుల పరిరక్షణ అంశంపై నిర్వహించిన చర్చా కార్యక్రమంలో విమలక్క ప్రసంగించారు. బతుకమ్మ పండుగ ప్రకృతితో ముడిపడి ఉందని, ప్రకృతిని ప్రేమించే ఏకైక పండుగ బతుకమ్మ అన్నారు. బతుకమ్మ అంటేనే బహుజనుల సంస్కృతని చెప్పారు. కార్యక్రమంలో ప్రభుత్వ కార్యదర్శి వాణీప్రసాద్, మామిడి హరికృష్ణ పాల్గొన్నారు. కాగా, బతుకమ్మ సంబరాలు రాజ్‌భవన్‌లో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఆయన భార్య సుధాదేవ్ వర్మ పాల్గొన్నారు. మంత్రులు సురేఖ, సీతక్క, సీఎస్ శాంతికుమారి హాజరయ్యారు.



రవీంద్రభారతిలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో విమలక్క, తదితరులు

నోటిఫికేషన్లకు బ్రేక్!

(మొదటిపేజీ తరువాయి)

సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ కులాల వర్గీకరణలో న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా హైకోర్టు మాజీ న్యాయమూర్తితో కమిషన్ ఏర్పాటు చేయాలని, వర్గీకరణకు 2011 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. ఏకసభ్య కమిషన్‌కు అవసరమైన సమాచారాన్ని అన్ని విభాగాల నుంచి అందేలా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. జ్యుడీషియల్ కమిషన్.. క్షేత్రస్థాయి నుంచి విజ్ఞప్తులు, ఫిర్యాదులు స్వీకరించేందుకు వీలుగా ఉమ్మడి పది జిల్లాల్లో ఒక్కోరోజు పర్యటించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వర్గీకరణ అమలు, కులాల రీగ్రూపింగ్‌కు సంబంధించి మంత్రివర్గ ఉపసంఘానికి అందిన వినతులపై చర్చించారు. పంజాబ్, తమిళనాడు రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ అమలవుతున్న తీరు, హరియాణాలో తీసుకుంటున్న చర్యలను ఉపసంఘంలో సభ్యులుగా ఉన్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, శ్రీధర్ బాబు, సీతక్క, పొన్నం ప్రభాకర్.. ముఖ్యమంత్రికి వివరించారు.

బీసీ సర్వే పూర్తయితే స్థానిక సంస్థల ఎన్నికలు

రాష్ట్రంలో బీసీ సామాజిక, ఆర్థిక, కుల సర్వే ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సమీక్షలో బీసీ సామాజిక, ఆర్థిక, కుల సర్వేపై బిహార్, కర్ణాటకతోపాటు పలు రాష్ట్రాలు అనుసరించిన విధానాలను అధికారులు సీఎంకు వివరించారు. కాగా, సర్వే చేపట్టేందుకు అవసరమైన యంత్రాంగం తమ వద్ద లేనందున దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్.. ముఖ్యమంత్రిని కోరారు. అనంతరం రేవంత్ మాట్లాడుతూ.. బీసీల సామాజిక, ఆర్థిక, కుల సర్వేకు రాష్ట్ర ప్రణాళిక విభాగాన్ని కేటాయిస్తున్నట్లు తెలిపారు. బీసీ కమిషన్, రాష్ట్ర ప్రణాళిక విభాగానికి సమన్వయకర్తగా ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని నియమించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. కాగా బీసీల సామాజిక, ఆర్థిక, కుల సర్వేను 60 రోజుల్లోనే పూర్తిచేయాలని, డిసెంబరు 9లోపు నివేదికను సమర్పించాలని అన్నారు. ఈ సర్వే పూర్తయితే వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లవచ్చని పేర్కొన్నారు.


సచివాలయంలో ఎస్సీవర్గీకరణ, బీసీ కులగణనపై సమీక్ష నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు పొన్నం, దుద్దిళ్ల, దామోదర, ఉత్తమ్, సీతక్క, సలహాదారులు కేకే, వేం నరేందర్‌రెడ్డి

రాష్ట్రంలో ఎస్సీల లెక్క ఇదీ..

ఎస్సీ కులాల వర్గీకరణ నేపథ్యంలో రాష్ట్రంలో ఉన్న ఎస్సీల జనాభా, వారి అక్షరాస్యత వివరాలను ఎస్సీ సంక్షేమ శాఖ ప్రభుత్వానికి నివేదించింది. 2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణలో 54.08 లక్షల ఎస్సీ జనాభా ఉంది. మొత్తం జనాభాలో ఇది 15.45 శాతం. గ్రామీణ ప్రాంతాల్లో 75.40 శాతం, పట్టణ ప్రాంతాల్లో 24.60 శాతం చొప్పున ఎస్సీలు ఉన్నారు. ఇక రాష్ట్రంలో సాధారణ అక్షరాస్యత 66.54 శాతంగా ఉంటే.. ఎస్సీల అక్షరాస్యత 58.90 శాతం ఉంది. అంటే సాధారణం కంటే ఎస్సీలు 8.64 శాతం తక్కువ అక్షరాస్యతలో ఉన్నారు. కాగా, సాధారణ మహిళల అక్షరాస్యత రేటు 57.99 శాతం ఉండగా.. ఎస్సీ మహిళల అక్షరాస్యత రేటు 49.90 శాతంగా ఉంది. సాధారణ మహిళల కంటే ఎస్సీ మహిళలు 8.09 శాతం తక్కువ అక్షరాస్యతతో ఉన్నారు. తెలంగాణలో మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాలుండగా.. వీటిలో ఎస్సీ రిజర్వుడు అసెంబ్లీ స్థానాలు 19, ఎస్సీ రిజర్వుడు లోక్‌సభ స్థానాలు 3 ఉన్నాయి. రాష్ట్రంలో మొత్తం 12,769 గ్రామ పంచాయతీలు ఉండగా.. 769 గ్రామపంచాయతీల్లో దాదాపు 40 శాతానికి పైగా ఎస్సీ జనాభా ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా 620 రెవెన్యూ మండలాలు ఉండగా.. 340 మండలాల్లో దాదాపు 40 శాతానికి పైగా ఎస్సీ జనాభా ఉందని అధికారులు నివేదికలో పేర్కొన్నారు.

ఎల్ అండ్ టీ విరాళం రూ. 5.50 కోట్లు

ముఖ్యమంత్రి సహాయనిధికి ఎల్ అండ్ టీ సంస్థ.. రూ. 5.50 కోట్ల విరాళం ఇచ్చింది. సచివాలయంలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కలను కలిసిన ఆ సంస్థ చైర్మన్.. వారికి చెక్కును అందజేశారు.

మహిళలకు సీఎం సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

రాష్ట్రంలోని మహిళలకు సీఎం రేవంత్‌రెడ్డి సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. తీరొక్క పూలతో రూపొందించే ఘనమైన బతుకమ్మలతో ఆడిపాడే సంబురాల్లో ఆఖరి రోజైనా సద్దుల బతుకమ్మను వైభవంగా జరుపుకోవాలని సూచించారు. పెద్ద బతుకమ్మ సందర్భంగా ట్యాంక్‌బండ్‌తో పాటు రాష్ట్రంలోని చెరువులన్నింటి వద్ద ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి కోమటిరెడ్డి సైతం మహిళలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

దీపావళికి 2 డీఏలు!

(మొదటిపేజీ తరువాయి)

చుట్టూ తిరుగుతున్నా.. సర్కారు సానుకూలంగా స్పందించడంలేదంటూ వారు అసంతృప్తిగా ఉన్నారు. అయితే ప్రభుత్వం మాత్రం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఉద్యోగుల డిమాండ్లపై ఆచితూచి వ్యవహరిస్తోంది. ఆర్థికేతర సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని, ఆర్థికపరమైన వాటిని అంశాల వారీగా పరిష్కరిస్తామని మంత్రులు చెబుతున్నారు. అయినా.. ఉద్యోగులు ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తూనే ఉన్నారు. బుధవారం కూడా ఉద్యోగ సంఘాల ఐకాస చైర్మన్ మారెం జగదీశ్వర్, కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు నేతృత్వంలో సీఎంవోకు వెళ్లారు. సీఎం ముఖ్యకార్యదర్శిని కలిసి తమ డిమాండ్లపై చర్చించారు. కాగా, ఉద్యోగులకు ఒక డీఏ చెల్లింపునకు నెలకు రూ.100 కోట్లకు పైగా అవుతుందని, ఈ లెక్కన ఏడాదికి రూ.1200 కోట్లు అవుతుందని అంచనా వేస్తున్నారు. అదే నాలుగు డీఏలు అమలు చేస్తే.. ఏరియర్స్‌తో కలిపి రూ.7900 కోట్ల భారం ప్రభుత్వంపై పడుతుందని అధికారులు లెక్కలు కడుతున్నారు. ఇదే విషయాన్ని ఉద్యోగ సంఘాల ప్రతినిధులతోనూ చెబుతున్నారు.

మూడు డీఏలైనా ఇవ్వాలి..

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై అధికారులు చెబుతున్న వివరాల నేపథ్యంలో.. ప్రస్తుతానికి ప్రభుత్వం నాలుగు డీఏలు చెల్లించకపోవచ్చనే భావన ఉద్యోగుల్లోనూ వ్యక్తమవుతోంది. దీంతో కనీసం మూడు డీఏలైనా విడుదల చేయాలని కోరుతున్నారు. తాము చేస్తున్న ఒత్తిడి నేపథ్యంలో దీపావళికి రెండు డీఏలను విడుదల చేయాలనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చినట్లు తెలుస్తోందని టీజీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్ రావు 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. కానీ, తాము మాత్రం మూడు డీఏలైనా ఇవ్వాల్సిందిగా కోరుతున్నామని చెప్పారు. డీఏల పెండింగ్ వల్ల ఒక సాధారణ ఉద్యోగి నెలకు రూ.10 వేల వరకు నష్టపోతున్నారని, రూ.70 వేల పైన వేతనం తీసుకునే ఉద్యోగి అయితే నెలకు రూ.15 వేల వరకు నష్టపోతున్నారని వివరించారు. పీఆర్సీ జాప్యం వల్ల మరో రూ.15 వేలు నష్టపోతున్నారని, ఇవన్నీ అమలు చేస్తే ప్రతి ఉద్యోగికీ నెలకు రూ.30 వేల అదనపు వేతనం అందుతుందని తెలిపారు.


ఫ్రాన్స్ ఏరోస్పేస్ కంపెనీల ప్రతినిధులతో శ్రీధర్ బాబు

ఏరోస్పేస్ కంపెనీలకు అత్యుత్తమ గమ్యస్థానం తెలంగాణ!

» ఫ్రెంచ్ ఏరోస్పేస్ పరిశ్రమల సంఘం ప్రశంసలు

» ఐటీ మంత్రితో 90 మంది ప్రతినిధుల భేటీ

» తెలంగాణ గడ్డ.. ఏరోస్పేస్ కంపెనీలకు అడ్డా..

» పెట్టుబడులు పెట్టండి: శ్రీధర్‌బాబు

హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏరోస్పేస్ రంగంలో పెట్టుబడులకు తెలంగాణ అత్యుత్తమ గమ్యస్థానమని ఫ్రెంచ్ ఏరోస్పేస్ పరిశ్రమల సంఘం ప్రశంసించింది. ఇప్పటికే ఇక్కడ ప్రముఖ అంతర్జాతీయ కంపెనీలు పెట్టుబడులు పెట్టి విజయవంతంగా కొనసాగుతున్నాయని గుర్తుచేసింది. సంఘం నేతృత్వంలో ఫ్రాన్స్ ఏరోస్పేస్ కంపెనీలకు చెందిన 90 మంది ప్రతినిధుల బృందం బుధవారం నగరంలో పర్యటించింది. రాష్ట్రంలో ప్రస్తుతమున్న కంపెనీలతో పాటు పెట్టుబడులకున్న అవకాశాలను పరిశీలించింది. అనంతరం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో సమావేశమైంది. హైదరాబాద్‌లోని ఫ్రాన్స్ డిప్యూటీ కాన్సుల్ పాస్కల్ లోరియో అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏరోస్పేస్ రంగంలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. సఫ్రాన్, ఎయిర్‌బస్, బోయింగ్, లోఖీడ్ మార్టిన్, జీఈ ఏవియేషన్, రేథియాన్ లాంటి ప్రపంచ దిగ్గజ ఏరోస్పేస్ కంపెనీలు ఇప్పటికే తెలంగాణలో కొనసాగుతున్నాయని గుర్తుచేశారు. నగరంలో ఫ్రెంచ్ కంపెనీలతో ఎప్పటినుంచో వ్యాపార సంబంధాలు కొనసాగుతున్నాయన్నారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఫ్రెంచ్ ఎయిర్‌పోర్ట్ ఆపరేటర్ ఏడీపీ వాటాదారుగా ఉందని గుర్తుచేశారు. మేకిన్ ఇండియా పథకంలో భాగంగా సి-295 ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్ట్ కోసం టాటా భాగస్వామ్యంతో ఎయిర్‌బస్ హైదరాబాద్‌లో కీలకమైన భాగాలు, సబ్‌సిస్టమ్‌లు తయారు చేస్తోందని చెప్పారు. హైదరాబాద్‌కు చెందిన ధ్రువ స్పేస్, స్కైరూట్ వంటి అంతరిక్ష స్టార్టప్‌లు ఇప్పటికే ఫ్రెంచ్ భాగస్వాములతో కలిసి పనిచేస్తున్నాయని మంత్రి వివరించారు. ఏరోస్పేస్ రంగంలో తెలంగాణలో ఉన్న అనుకూలతలకు గాను కేంద్ర పౌర విమానయాన శాఖ నుంచి నాలుగుసార్లు అత్యుత్తమ పురస్కారం దక్కిందని మంత్రి తెలిపారు. పాస్కల్ లోరియో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని వివిధ రంగాల్లో ఫ్రెంచ్ కంపెనీలు భారీ పెట్టుబడులు పెట్టాయన్నారు. ఏరోస్పేస్ రంగాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ప్రశంసించారు. ఇండియన్ టెర్రెయిన్ ఫ్యాషన్స్ సంస్థ తెలంగాణలో దుస్తుల ఉత్పత్తి పరిశ్రమను ఏర్పాటు చేయాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆ సంస్థ యాజమాన్యాన్ని కోరారు. ఇప్పటికే ఆదిలాబాద్ జిల్లాలో 80 వేల మంది రైతుల నుంచి సేకరించిన సేంద్రియ పత్తితో ఆ సంస్థ ఏటా 4 కోట్ల మీటర్ల వస్త్రాలను తయారు చేస్తోందని ఆయన వెల్లడించారు. బంజారాహిల్స్‌లో కంపెనీ నెలకొల్పిన షోరూంను మంత్రి శ్రీధర్‌బాబు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డితో కలిసి బుధవారం ప్రారంభించారు.

రెండు ముక్కలుగా 'రెవెన్యూ'?

వేర్వేరు విభాగాలుగా భూపరిపాలన, సాధారణ పాలన!.. భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభించే అవకాశం

హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖను రెండుగా విభజించి.. సాధారణ పాలన, భూపరిపాలన అనే వేర్వేరు విభాగాలుగా విడగొట్టాలనే ప్రతిపాదనలు వస్తున్నాయి. రెవెన్యూ శాఖ పనితీరుపై ప్రజల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆ శాఖను విభజించడం ద్వారా పారదర్శకతకు పెద్ద పీట వేయొచ్చనే వాదనలు వినిపిస్తున్నాయి. అందులో భాగంగా.. రెవెన్యూకు అనుబంధంగా ఉన్న రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలను ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్‌లో కలిపేసి.. ధ్రువీకరణ పత్రాల జారీ, సంక్షేమ పథకాల అమలు, ప్రొటోకాల్ వంటి కార్యక్రమాలను రెవెన్యూలోనే సాధారణ పాలనా విభాగానికి అప్పగించాలంటూ వస్తున్న సూచనలను ప్రభుత్వం పరిశీలిస్తున్నట్టు సమాచారం. ఇలా చేయడం ద్వారా భూ సమస్యలను పరిష్కరించడంతోపాటు మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉందని, పని విభజన చేయడం ద్వారా రెవెన్యూ ఉద్యోగులపై ఒత్తిడి కూడా తగ్గుతుందని కొంత మంది రెవెన్యూ అధికారులు అభిప్రాయ పడుతున్నారు. ఉదాహరణకు.. మండల తహసీల్దారు కార్యాలయంలో భూసంబంధిత పాలనకు ఒక అధికారిని, అభివృద్ధి, సంక్షేమం ఇతర కార్యక్రమాలకు మరో అధికారిని కేటాయించడం ద్వారా ఇద్దరు తహసీల్దార్లతో మెరుగైన పాలన అందించే అవకాశం ఉంటుందని వారు పేర్కొంటున్నారు. ప్రస్తుతం మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు.. ఆర్ఐ నుంచి ఆర్డీవో వరకు.. ఎన్నికలు వచ్చినా, విపత్తులు, జనాభా లెక్కలు, తనిఖీలు, అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు, ప్రొటోకాల్.. ఇలా అన్నీ రెవెన్యూ అధికారుల ప్రమేయంతోనే జరుగుతున్నాయి. దీంతో భూ సంబంధిత సమస్యల పరిష్కారం, సేవలు ఆలస్యమవుతున్నాయనే విమర్శలున్నాయి. రిజిస్ట్రేషన్, రెవెన్యూ విభాగాల మధ్య నేటికీ సమన్వయం లేదు. రెవెన్యూలో మ్యుటేషన్ పెండింగ్ ఉన్నా రిజిస్ట్రేషన్ అధికారులు తమకేమీ సంబంధం లేదన్నట్లు రిజిస్ట్రేషన్లు చేస్తూ ఉంటారు. దీని వల్ల కొన్ని కేసుల్లో న్యాయపరమైన చిక్కులు తలెత్తుతున్నాయి. ఉన్నత స్థాయిలోనూ రెవెన్యూకు, రిజిస్ట్రేషన్ విభాగాలకు వేర్వేరుగా కార్యదర్శులు ఉన్నారు. అవసరం లేకపోయినా ఇది కొనసాగుతోందనే విమర్శలు కూడా ఉన్నాయి. కాగా.. 2014లో ప్రపంచ బ్యాంకు ల్యాండ్ గవర్నెన్స్ అసెస్‌మెంట్ ఫ్రేమ్ వర్క్ కింద నిపుణుల కమిటీ చేసిన సిఫారసుల్లో.. భూపాలన కోసం, భూదస్త్రాల నిర్వహణకు ఏకీకృత భూపరిపాలనా వ్యవస్థను తీసుకురావాలని పేర్కొంది.

అవగాహన ఉన్న అధికారులేరీ?

మండల స్థాయి రెవెన్యూ అధికారుల్లో చాలా మంది పదోన్నతుల ద్వారా జూనియర్ అసిస్టెంట్ నుంచి తహసీల్దార్‌గా బాధ్యతలు తీసుకుంటున్నారు. దీనివల్ల వారికి రెవెన్యూ చట్టాల మీద సరైన అవగాహన.. న్యాయపరమైన చిక్కులు ఎదురైతే వాటిని అధిగమించేందుకు తగిన పాలనా నైపుణ్యం, అర్హతలు లేకపోవడం వల్ల.. కోర్టు కేసులు, భూ సమస్యలు పెరుగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. తహసీల్దారుగా పని చేసే వ్యక్తికి న్యాయపరమైన అవగాహన కూడా ఉండాలనే నిబంధన పెట్టి.. భూచట్టాలపై సమగ్ర అవగాహన ఉండే వ్యక్తులను నియమిస్తే చాలా వరకు భూ సమస్యలను పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందనే అభిప్రాయాలను కొంత మంది ఉన్నతాధికారులు వ్యక్తం చేస్తున్నారు.

రూ.79.57 కోట్ల పంట నష్ట పరిహారం విడుదల

» గత నెలలో భారీ వర్షాలకు 79 వేల ఎకరాల్లో నష్టం

» రైతుల ఖాతాల్లోనే నిధులు జమ చేస్తాం: మంత్రి తుమ్మల

» పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశం



హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): గత నెలలో కురిసిన భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు రూ.79.57కోట్ల పరిహారాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎకరాకు రూ.10వేల చొప్పున రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 28 జిల్లాల్లో 79,574 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని తెలిపారు. కాగా, ఈ ఏడాది మార్కెట్‌కు 25.33 లక్షల టన్నుల పత్తి వచ్చే అవకాశం ఉందని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని మార్కెటింగ్ శాఖ అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు. సచివాలయంలో వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్కెట్‌లో పత్తి విక్రయాల పర్యవేక్షణకు జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో కమిటీలను ఏర్పాటు చేసి, వాటి సజావుగా విక్రయాలు జరిగేట్లు పర్యవేక్షించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా టెండర్లలో పాల్గొన్న 319 జిన్నింగ్ మిల్లులను గుర్తింపు కొనుగోలు కేంద్రాలుగా ప్రకటించే అధికారాన్ని ఆయా జిల్లాల కలెకర్లకు అప్పగించాలని పేర్కొన్నారు. రైతులు ఏ కేంద్రానికి వెళ్తే త్వరగా అమ్ముకునేందుకు అవకాశం ఉందనే వివరాలను రైతులకు తెలియజేయాలన్నారు. పత్తిని విక్రయించే రైతులు తప్పనిసరిగా వారి ఆధార్ కార్డును కొనుగోలు కేంద్రానికి తీసుకువెళ్లాలని, ఆధార్‌తో అనుసంధానమై ఉన్న బ్యాంకు ఖాతాకు నగదు చెల్లింపులు ఉంటాయని తెలిపారు. కాగా, మరో 7 వ్యవసాయ మార్కెట్ కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్లు, పాలకవర్గ సభ్యులుగా ఎంపికైన వారికి మంత్రి తుమ్మల శుభాకాంక్షలు తెలిపారు.

'ధరణి' పోర్టల్‌తో దగా

ఆపరేటర్‌తో కలిసి 36 ఎకరాల ప్రభుత్వ భూమిని బదలాయించిన తహసీల్దార్.. 'రైతుబంధు' సొమ్ము స్వాహా

జైలులో ఆపరేటర్.. తహసీల్దార్‌కు 14 రోజుల రిమాండ్


తహసీల్దార్ జయశ్రీ

హుజూర్‌నగర్, అక్టోబరు 9: 'ధరణి' పోర్టల్ ద్వారా అక్రమంగా ప్రభుత్వ భూమిని బదలాయించి రూ.14 లక్షల రైతుబంధు' లబ్ధి పొందిన తహసీల్దార్‌కు హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి 14 రోజుల రిమాండ్ విధించారు. ఈ కేసులో ఆమెతో కలిసి అక్రమాలకు పాల్పడిన ధరణి ఆపరేటర్ ఇప్పటికే జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. ప్రస్తుతం నల్లగొండ జిల్లా అనుముల మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న వజ్రాల జయశ్రీ 2019 నుంచి 2023 వరకు హుజూర్‌నగర్‌లో విధులు నిర్వహించారు. ఆ సమయంలో ఆమె ఉన్నతాధికారులకు తెలియకుండా సుమారు 36.23 ఎకరాల ప్రభుత్వ భూమిని 'ధరణి' కంప్యూటర్ ఆపరేటర్ జగదీశ్ కుటుంబసభ్యులకు బదలాయించారు. నిబంధనలకు విరుద్ధంగా భూముల బదలాయింపుపై బూరుగడ్డ గ్రామస్థులు సూర్యాపేట జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయటంతో ఆర్డీవోతో ప్రాథమిక విచారణ జరిపించారు. 'ధరణి' ఆపరేటర్ జగదీశ్ కుటుంబసభ్యులు పేరిట రూ. 1కోటీ 56లక్షల విలువైన 36.23 ఎకరాల భూమిని బదలాయించినట్లు గుర్తించారు. అక్రమంగా 'ధరణి' పోర్టల్ ద్వారా డిజిటల్ పట్టాలు పొందిన కంప్యూటర్ ఆపరేటర్ కుటుంబసభ్యులకు రైతుబంధు' కింద రూ.14,63,004 లబ్ధి చేకూరగా ఆ మొత్తాన్ని జయశ్రీ, జగదీశ్ పంచుకున్నట్లు తేల్చారు. ఆర్డీవో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి తహసీల్దార్ జయశ్రీని బుధవారం అరెస్టు చేసి హుజూర్‌నగర్ కోర్టులో ప్రవేశపెట్టగా.. జూనియర్ సివిల్ జడ్జి ఆమెకు 14 రోజుల రిమాండ్ విధించారు. జయశ్రీని హుజూర్‌నగర్ సబ్ జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఇదే కేసులో ఇప్పటికే ఆపరేటర్ వత్సవాయి జగదీశ్ హుజూర్‌నగర్ జైలులో శిక్ష అనుభవిస్తున్నారు.



ప్రోటీన్లపై పరిశోధనలకు పట్టం!

- రసాయన శాస్త్రంలో ముగ్గురికి నోబెల్ బహుమతి
- డేవిడ్ బేకర్, హస్సాబిస్, జంపర్‌కు దక్కిన గౌరవం

స్టాక్‌హోం, అక్టోబరు 9: ఈ ఏడాది కూడా రసాయన శాస్త్రంలో ముగ్గురు శాస్త్రవేత్తలను ప్రతిష్ఠాత్మక నోబెల్ బహుమతి వరించింది. ప్రోటీన్ల నిర్మాణానికి సంబంధించిన పరిశోధనలకుగానూ డేవిడ్ బేకర్, డెమిస్ హస్సాబిస్, జాన్ జంపర్‌లను ఈ ఏడాది నోబెల్ పురస్కారానికి ఎంపిక చేసినట్టు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ బుధవారం ప్రకటించింది. కంప్యుటేషనల్ ప్రోటీన్ డిజైన్‌కుగానూ బేకర్‌కు, ఆ ప్రోటీన్ల నిర్మాణాన్ని అంచనా వేసినందుకుగానూ డెమిస్, జంపర్... నోబెల్ అందుకోనున్నారు. డేవిడ్ బేకర్ అమెరికాలో సియాటిల్‌లోని వాషింగ్టన్ యూనివర్సిటీలో పనిచేస్తున్నారు. హస్సాబిస్, జంపర్ ఇద్దరూ లండన్‌లోని గూగుల్ డీప్‌మైండ్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. వారికి ప్రతిష్ఠాత్మక అవార్డుతోపాటు రూ.8.90 కోట్లు ప్రైజ్‌మనీ దక్కనుంది. దీనిలో.. కంప్యుటేషనల్ ప్రోటీన్ డిజైన్ చేసిన బేకర్‌కు సంగం ప్రైజ్‌మనీ ఇవ్వనుండగా.. మిగతా సగాన్ని హస్సాబిస్, జంపర్ పంచుకోనున్నారు. క్వాంటమ్ డాట్‌ల ఆవిష్కరణకుగానూ గతేడాది కూడా ముగ్గురు శాస్త్రవేత్తలు మౌంగి బవెండి, లూయిస్ బ్రూస్, అలెక్సీ ఎకిమోవ్ రసాయనశాస్త్రంలో నోబెల్ బహుమతి అందుకున్నారు. 2003లో బేకర్ ఒక కొత్త ప్రోటీన్‌ను రూపొందించారు. ఆ తర్వాత దాని ఆధారంగా అతని పరిశోధన బృందం రకరకాలుగా దాదాపు 200 మిలియన్ల కొత్త ప్రోటీన్లను ఉత్పత్తి చేసింది. వీటిలో ఔషధాలు, వ్యాక్సిన్లు, నానో పదార్థాలు, చిన్నసెన్సర్లుగా ఉపయోగించగల ప్రోటీన్లు కూడా ఉన్నాయి. కాగా... బేకర్ బృందం రూపొందించిన ఈ 200 మిలియన్ల ప్రోటీన్ల నిర్మాణాన్ని అంచనా వేయగలిగే కృత్రిమ మేధస్సు (ఏఐ) నమూనాను హస్సాబిస్, జంపర్ రూపొందించారు. అమినో ఆమ్ల క్రమం, ప్రోటీన్ల నిర్మాణం మధ్య సంబంధాలను కనుగొనేందుకు వారు చేసిన పరిశోధనలకుగానూ ఈ అవార్డుతో గౌరవిస్తున్నామని రసాయన శాస్త్ర నోబెల్ కమిటీ ఛైర్మన్ హీనర్ చెప్పారు.

సహారా ఎడారిలో వరదలు!

మొరాకో, అక్టోబరు 9: ప్రపంచంలోనే అతిపెద్ద ఎడారి సహారాలో అత్యంత అరుదైన దృశ్యం కనిపించింది. ఉత్తర ఆఫ్రికాలోని మొరాకోలో ఆగస్టు, సెప్టెంబరులో కురిసిన భారీ వర్షాలకు సహారా ఎడారిలో వరద నీరు ప్రవహించింది. ఆగ్నేయ మొరాకోలోని ఎడారి ప్రాంతంలో వర్షం పడడమంటే చాలా అరుదైన ఘటన. మొరాకో ప్రభుత్వ సమాచారం మేరకు సెప్టెంబరులో రెండురోజుల పాటు కురిసిన వర్షం.. చాలా ప్రాంతాల్లో ఏడాది సగటును మించిపోయింది. ఇక్కడ ఏటా 250 మి.మీ. కంటే తక్కువగా సగటు వర్షపాతం నమోదవుతుంటుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. రాజధాని రబత్‌కు 450 కి.మీ. దూరంలోని ఓ గ్రామంలో 24 గంటల్లోనే 100 మి.మీ. వర్షం కురిసిందని.. ఇది అత్యంత అరుదైన పరిణామమని పేర్కొన్నాయి. భారీ వర్షాలతో సహారాలో వరదలు వచ్చాయని అధికారులు తెలిపారు. ఈ దృశ్యాలను చాలా మంది వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కాగా, ఇంతటి భారీ వర్షాలు కురవడం గడిచిన 30-50 ఏళ్లలో ఇదే తొలిసారని మొరాకో వాతావరణ శాఖ తెలిపింది.

సన్నబియ్యం 67% ఇవ్వలేం!

58% ఔట్ టర్న్‌పై రూ.300 నష్టపరిహారం ఇవ్వాలి.. భట్టి నేతృత్వంలోని క్యాబినెట్ సబ్‌కమిటీకి రైస్‌మిల్లర్ల స్పష్టీకరణ

- మిల్లర్ల సమస్యలు పరిష్కరిస్తాం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సన్న ధాన్యం మిల్లింగ్ చేస్తే 67 శాతం బియ్యం రికవరీ రాదని, 58 శాతమే వస్తుందని రైస్‌మిల్లర్లు.. మంత్రివర్గ ఉపసంఘానికి తెలిపారు. ఈ మేరకు సన్న బియ్యం ఔట్ టర్న్ నష్టశాతాన్ని ప్రభుత్వం భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. మిల్లింగ్ ప్రక్రియ, సీఎంఆర్ డెలివరీ సజావుగా సాగాలంటే.. క్వింటాలుకు రూ.300 చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరారు. కాస్ట్‌షీట్ ప్రకారం ధాన్యం నిల్వలపై తరుగుదల కింద 1 శాతం డ్రైయేజ్ చార్జీలను మిల్లర్లకు చెల్లించాలని, ఆరేళ్ల బకాయిలు కూడా విడుదల చేయాలని అన్నారు. రైస్‌మిల్లుల్లో ధాన్యం నిల్వ చేసినందుకుగాను ప్రతి నెలా క్వింటాలుకు రూ.2.40 చొప్పున ప్రతి సీజన్‌లో రెండు నెలలకు కస్టోడియన్ చార్జీలు, బియ్యం రవాణా, బ్లెండింగ్ చార్జీలు చెల్లించాలని కోరారు. ధాన్యం మిల్లింగ్ చేసినందుకుగాను మిల్లర్‌కు క్వింటాలుకు ముడి బియ్యానికి రూ.10, బాయిల్డ్ రైస్‌కు రూ.20 చొప్పున చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ధాన్యం ప్రొక్యూర్‌మెంట్ పాలసీని రూపొందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం



రైస్‌మిల్లర్లతో భేటీ అయిన భట్టి, ఉత్తమ్, శ్రీధర్‌బాబు

బుధవారం రాష్ట్ర పౌరసరఫరాల భవన్‌లో రైస్‌మిల్లర్లతో సమావేశమైంది. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, కన్వీనర్ డీఎస్ చౌహాన్ పాల్గొన్న ఈ భేటీలో మిల్లర్లు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. రైస్‌మిల్లర్లు తిరిగి ఇచ్చే గోనెసంచులను కార్పొరేషన్ తీసుకోవాలని, వీటిపై మార్కెట్ రేటు చెల్లించాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో నాణ్యత ప్రమాణాలు లేని ధాన్యం సేకరిస్తున్నారని, తద్వారా డ్యామేజీ, డిస్కలర్, ఇమ్మెచ్యూర్, గ్రైన్స్ అధిక నూకలు వచ్చి ఔట్ టర్న్ దెబ్బతింటుందని తెలిపారు. మార్కెట్ కమిటీ గోదాముల్లో ధాన్యం నిల్వ చేస్తే.. అద్దె మాఫీ చేయాలని, కార్పొరేషన్ నిల్వచేసే ధాన్యానికి స్టాక్ ఇన్సూరెన్స్ చేయాలని రైస్‌మిల్లర్లు సూచించారు. రాష్ట్రంలో 2 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లింగ్ చేయగలిగిన సామర్థ్యం ఉందని, దీనికి అనుగుణంగా గోదాములు, అనుబంధ వ్యవస్థలను అభివృద్ధి చేయాలని కోరారు. 95 శాతం రైస్‌మిల్లర్లు పీడీఎస్ వ్యవస్థలో భాగస్వాములుగా ఉన్నారని, ప్రభుత్వం కూడా మిల్లర్ల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సన్నధాన్యం సేకరణ 17% తేమతో సాధ్యం కాదని, 14% తేమతో ప్రొక్యూర్‌మెంట్ చేయాలని కోరారు. రైతులకు క్వింటాలుకు రూ.500 ప్రోత్సాహకం ఇచ్చినట్లుగానే.. ఔట్ టర్న్ తక్కువ వస్తున్న నేపథ్యంలో మిల్లర్లకు కూడా క్వింటాలుకు రూ.300 ప్రోత్సాహకం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. 2025 మార్చిలోగా సన్నబియ్యం సేకరణ పూర్తిచేయాలన్నారు. ప్రతి మిల్లర్‌కు తన సామర్థ్యం మేరకే ధాన్యం ఇచ్చి.. మిగిలిన ధాన్యాన్ని కార్పొరేషన్ గోదాముల్లో నిల్వచేసుకొని ధాన్యం సేకరణ ముగిసిన తర్వాత నిర్ణయం తీసుకోవాలని సూచించారు. విద్యుత్ చార్జీలు, స్పేర్ పార్టులు, నిర్వహణ ఖర్చులు, డీజిల్ రేట్లు పెరుగుతూఉన్నాయని మిల్లర్లు ఆందోళన వ్యక్తం చేశారు. రైస్‌మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క హామీ ఇచ్చారు. ప్రొక్యూర్‌మెంట్ సమస్యలపై అధ్యయనం చేసి మంత్రివర్గం పలు సిఫారసులను ఆమోదం కోసం సీఎం రేవంత్‌కి అందజేస్తుందని తెలిపారు.

ధరాభారం వద్దు.. ఖజానా కళకళలాడాలి!

- ఆదాయ మార్గాలను అన్వేషించాలి
- శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- అధికారులతో సమీక్షలో డిప్యూటీ సీఎం

హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): "ప్రజలపై ధరల భారం పడకూడదు.. కానీ, ఖజానాకు ఆదాయం పెరగాలి. అలాంటి మార్గాలను అన్వేషించండి" అని ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ధరలు పెంచకుండా రాబడి పెరిగే మార్గాలను కనుగొనాలన్నారు. రాష్ట్ర ఖజానాకు ఆదాయాన్ని పెంచే అంశంపై నిర్దిష్ట ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. బుధవారం సచివాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో భట్టి సమీక్ష సమావేశం నిర్వహించారు. గతంలో నిర్దేశించుకున్న ప్రణాళికలు, వాటి ప్రగతిని నివేదించాలని అధికారులకు చెప్పారు. మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ కంటే అధిక ధరలతో మద్యం విక్రయాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని బలోపేతం చేయాలని చెప్పారు. రాష్ట్ర ఖజానాకు ఆదాయం పెంచేందుకు వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. అందుకోసం ప్రత్యేకంగా ఉమ్మడి సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఇసుక రీచ్‌ల ద్వారా ఖజానాకు గరిష్ఠ ఆదాయం సమకూరేందుకు ఏం చేయాలనేదానిపై నివేదిక ఇవ్వాలన్నారు.

మూసీ పరివాహక ప్రజల బాగు కోసమే..

మూసీ పరివాహక ప్రజల బాగు కోసమే.. మూసీ ప్రక్షాళన, అభివృద్ధి విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలు, దూరదృష్టిని నదీ పరివాహక ప్రాంతాల వాసులకు వివరించాలని భట్టి అధికారులకు చెప్పారు. మూసీ రివర్ ఫ్రంట్ రీహాబిలిటేషన్‌పై పురపాలక శాఖ ఉన్నతాధికారులతో పాటు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజల్ని బీఆర్‌ఎస్ సర్కారులా గాలికి వదిలేయబోమన్నారు. వారికి ఏ సాయం చేయడానికైనా సిద్ధంగా ఉన్నామని చెప్పారు. మూసీ గర్భంలో నివసిస్తున్న ప్రజలను అక్కడి నుంచి దూరంగా పంపించబోమని చెప్పారు. మూసీకి దగ్గరలో ఉన్న ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. ప్రతిపక్ష పార్టీలు బాధ్యతగా వ్యవహరించాలని, ప్రజల్లో అపోహలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తే హైదరాబాద్ నగరానికి నష్టం చేసిన వారవుతారని భట్టి అన్నారు. నిర్మాణాత్మకమైన సూచనలు ఇస్తే తాము స్వీకరిస్తామని చెప్పారు.



నీ మాటలే నిన్ను పడగొడతాయి

- ఆ గ్యారెంటీలే నీకు గోరీ కడతాయి
- రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ ధ్వజం
- అసలైన కొరివిదయ్యం రేవంతేనని వ్యాఖ్య

హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : "నిన్ను పడగొడతామని ఎవరో అన్నట్టు సానుభూతి రాజకీయాలు మొదలు పెడుతున్నావు.. సీఎంగా నీకు కొలువిచ్చిన నిరుద్యోగులే నీకు కొరివి పెడతారు. పదినెలలైనా కొత్త నియామకాల ఊసే లేదు. విద్యార్థులు, నిరుద్యోగులు నీ మోసాన్ని అర్థం చేసుకున్నారు. రేవంత్‌రెడ్డి.. నీ మాటలే నిన్ను పడగొడతాయి. నీ గ్యారంటీలే నీకు గోరీ కడతాయి" అని మాజీ మంత్రి హరీశ్‌రావు హెచ్చరించారు. కేసీఆర్ హయాంలో 1.60లక్షల ఉద్యోగాలిచ్చామని, తాము ప్రారంభించిన 30వేల నియామకాల ప్రక్రియను పూర్తి చేసి కాంగ్రెస్ గొప్పగా చెప్పుకోవడం సిగ్గుచేటని బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. బీఆర్‌ఎస్ సర్కారు కట్టిన ఇంటికి రంగులేసి.. అంతా మేమే చేశామంటూ అబద్ధాలు చెబుతావా? అది నోరా? మోరా? అని ధ్వజమెత్తారు. తెలంగాణ ద్రోహులు తప్ప ఆయన్ను ఎవరూ కొరివి దయ్యమని విమర్శించరని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమంలో రేవంత్ లాంటి ఎన్నో కొరివి దయ్యాలను తుద ముట్టించి ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను నిజం చేసిన ఉద్యమసూరీడు కేసీఆర్ అని స్పష్టం చేశారు. సమాజాన్ని తీర్చిదిద్దాల్సిన టీచర్ల మెదళ్లలో అసభ్యకరమైన భాషను ఎక్కించే ప్రయత్నం చేస్తున్న సంస్కారహీన సీఎంకు ఇంతకంటే మంచి మాటలు ఏం వస్తాయని అన్నారు. తెలంగాణకు పట్టిన అసలు సిసలు కొరివిదయ్యం రేవంతేనని పేర్కొన్నారు. గంట కూడా విశ్రాంతి లేకుండా పని చేస్తున్నానని రేవంత్ చెప్పేది నిజమే అయితే.. రాష్ట్ర ప్రజలకు ఇన్ని కష్టాలెందుకు వస్తాయని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో ఓడిపోయిన వారికి పదవులు ఇవ్వలేదా? ఇదేమైనా కొత్తనా? నువ్విపుడు ఓడిపోయిన వారికి పదవులు ఇవ్వలేదా? కవిత ఎమ్మెల్సీగా ఓట్లతోనే గెల్చిందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

నిక్మర్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ



పుణెలోని నిక్మర్ యూనివర్సిటీ-ఎంటెక్, ఎంబీఏ, ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ (బీబీఏ/బీబీఏ ఆనర్స్- ఎంబీఏ), పీజీ డిప్లొమా, ఎం ప్లాన్, బీటెక్, బీఆర్క్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంటెక్, ఎంబీఏ, ఎంప్లాన్ ప్రోగ్రామ్‌ల వ్యవధి రెండేళ్లు. పీజీ డిప్లొమా వ్యవధి ఏడాది. బీటెక్ వ్యవధి నాలుగేళ్లు. బీఆర్క్ వ్యవధి అయిదేళ్లు. ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ వ్యవధి అయిదేళ్లు. ప్రోగ్రామ్‌ను అనుసరించి నిక్మర్ యూనివర్సిటీ యూజీ, పీజీ స్థాయిల్లో నిర్వహించే కామన్ అడ్మిషన్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు-సీట్లు

- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో అడ్వాన్స్‌డ్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్ 720, అడ్వాన్స్‌డ్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ 150, ఫ్యామిలీ బిజినెస్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ 30, రియల్ ఎస్టేట్ అండ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్ 150, సస్టయినబుల్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ 30, ఎన్విరాన్‌మెంటల్ సస్టయినబిలిటీ 30 సీట్లు ఉన్నాయి.
- ఎంబీఏ(7 ఛాయిస్ బేస్డ్ ఇమ్మర్సివ్ స్పెషలైజేషన్స్) ప్రోగ్రామ్‌లో 60 సీట్లు ఉన్నాయి. ఇందులో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్, సప్లయ్ చెయిన్ మేనేజ్‌మెంట్, బిజినెస్ అనలిటిక్స్, మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్, పీపుల్ అండ్ కమ్యూనికేషన్స్, మార్కెటింగ్ అనలిటిక్స్ అండ్ డిజిటల్ స్ట్రాటజీస్, ఫైనాన్షియల్ స్ట్రాటజీస్ స్పెషలైజేషన్‌లు ఉంటాయి.
- ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ ప్రోగ్రామ్‌లో 60 సీట్లు ఉన్నాయి.
- పీజీ డిప్లొమా ఇన్ క్వాంటిటీ సర్వేయింగ్ అండ్ కాంట్రాక్ట్ మేనేజ్‌మెంట్‌లో 90 సీట్లు ఉన్నాయి
- బీటెక్ సివిల్ ఇంజనీరింగ్‌లో 60 సీట్లు ఉన్నాయి.
- బీఆర్క్‌లో 40 సీట్లు ఉన్నాయి.
- మాస్టర్ ఆఫ్ ప్లానింగ్(అర్బన్ ప్లానింగ్)లో 30 సీట్లు ఉన్నాయి.
- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ 42, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ 18 సీట్లు ఉన్నాయి.

అర్హత

- ఎంటెక్, ఎంబీఏ, పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి స్పెషలైజేషన్‌ను అనుసరించి డిగ్రీ(ఇంజనీరింగ్/ఆర్కిటెక్చర్/ప్లానింగ్/సైన్స్/ ఆర్ట్స్/ కామర్స్/మేనేజ్‌మెంట్/మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్/అగ్రికల్చర్/ఫార్మసీ) ఉత్తీర్ణులై ఉండాలి.
- ఎంప్లాన్ ప్రోగ్రామ్‌నకు డిగ్రీ(ఆర్కిటెక్చర్/సివిల్ ఇంజనీరింగ్/ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్/కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ/ప్లానింగ్/అర్బన్ డిజైనింగ్) లేదా మాస్టర్స్ డిగ్రీ(జియో ఇన్ఫర్మాటిక్స్/ జాగ్రఫీ/ఎకనామిక్స్/సోషియాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి.
- బీటెక్, బీఆర్క్, ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి ప్రథమ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. 2023, 2024 సంవత్సరాల్లో ఇంటర్‌స్థాయి కోర్సు పూర్తిచేసినవారు; ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు అప్లయ్ చేసుకోవచ్చు.
- గేట్/సీయూఈటీ పీజీ/ఎంహెచ్ సెట్/క్యాట్/ఎక్స్ఏటీ/మ్యాట్/ఎస్‌మ్యాట్/జీఆర్ఈ/జీమ్యాట్/ఏటీఎంఏ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు పీజీ నిక్మర్ కామన్ అడ్మిషన్ టెస్ట్(పీజీ ఎన్‌క్యాట్) రాయనవసరం లేదు.
- శాట్/యూజీఏటీ/ఐపీ మ్యాట్/సీయూఈటీ యూజీ స్కోర్ ఉన్నవారు యూజీ నిక్మర్ కామన్ అడ్మిష్ టెస్ట్(యూజీ ఎన్‌క్యాట్) రాయనవసరం లేదు.

అడ్మిషన్ టెస్ట్-ఎంపిక ప్రక్రియ

- **డిగ్రీ స్థాయి ప్రోగ్రామ్‌లకు:** మొత్తం ఎంపిక ప్రక్రియకు 150 మార్కులు నిర్దేశించారు. అడ్మిషన్ టెస్ట్‌లో ఇంగ్లీష్ లాంగ్వేజ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, టెస్ట్ ఆఫ్ రీజనింగ్, జనరల్ నాలెడ్జ్ అంశాలనుంచి ఒక్కోదానిలో 25 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. పర్సనల్ ఇంటర్వ్యూకి 50 మార్కులు కేటాయించారు.
- బీఆర్క్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి మాత్రం నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్(నాటా) లేదా ఎన్‌టీఏ నిర్వహించే జేఈఈ పేపర్ 2 స్కోర్‌ను ప్రామాణికంగా తీసుకుంటారు. అకడమిక్ మెరిట్‌కు 50 శాతం, జాతీయ పరీక్ష స్కోర్‌కు 50 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
- **పీజీ స్థాయి ప్రోగ్రామ్‌లకు:** మొత్తం ఎంపిక ప్రక్రియకు 250 మార్కులు నిర్దేశించారు. అడ్మిషన్ టెస్ట్‌కు 150 మార్కులు కేటాయించారు. ఇందులో క్వాంటిటేటివ్ అండ్ అనలిటికల్ ఎబిలిటీ నుంచి 60 మార్కులకు, డేటా ఇంటర్‌ప్రిటేషన్ నుంచి 30 మార్కులకు, వెర్బల్ అండ్ జనరల్ ఎబిలిటీ నుంచి 60 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు. పర్సనల్ ఇంటర్వ్యూకి 50 మార్కులు, రేటింగ్ ఆఫ్ అప్లికేషన్‌కు 50 మార్కులు ఉంటాయి. అడ్మిషన్ టెస్ట్‌లో సాధించిన మార్కుల ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి ఆర్ఏ స్కోర్ ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **పీజీ దరఖాస్తు ఫీజు:** సింగిల్ ప్రోగ్రామ్‌నకు రూ.2,000; రెండు ప్రోగ్రామ్‌లకు రూ.2,200; మూడు ప్రోగ్రామ్‌లకు రూ.2,400
- **యూజీ దరఖాస్తు ఫీజు:** సింగిల్ ప్రోగ్రామ్‌నకు రూ.1,000; రెండు ప్రోగ్రామ్‌లకు రూ.1200; మూడు ప్రోగ్రామ్‌లకు రూ.1,400
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** డిసెంబరు 20
- **నిక్మర్ కామన్ అడ్మిషన్ టెస్ట్(యూజీ/పీజీ) తేదీలు:** 2025 జనవరి 18 నుంచి జనవరి 31 వరకు
- **ఫలితాలు విడుదల:** 2025 ఫిబ్రవరి 7
- **ట్యూషన్ ఫీజు ఫస్ట్ ఇన్‌స్టాల్మెంట్ చెల్లించేందుకు చివరి తేదీ:** 2025 ఫిబ్రవరి 21
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** 2025 జూలై 14 నుంచి
- **వెబ్‌సైట్:** nicmar.ac.in

ఫోరెన్సిక్ సైన్సెస్ వర్సిటీలో ఎమ్మెస్సీ



గుజరాత్-గాంధీనగర్‌లోని నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ (ఎన్ఎఫ్ఎస్‌యూ)- ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఫోరెన్సిక్ డెంటిస్ట్రీ, ఫోరెన్సిక్ నర్సింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో 20 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్, నేషనల్ ఫోరెన్సిక్ అడ్మిషన్ టెస్ట్(ఎన్ఎఫ్ఏటీ) 2024 స్కోర్, కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ ఫీజు సెమిస్టర్‌కు రూ.65,000

అర్హత: ఫోరెన్సిక్ డెంటిస్ట్రీకి బ్యాచిలర్ ఆఫ్ డెంటల్ సర్జరీ(బీడీఎస్); ఫోరెన్సిక్ నర్సింగ్‌కు బ్యాచిలర్ ఆఫ్ సైన్స్(బీఎస్సీ)నర్సింగ్ ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 55 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఉండాలి. డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా/నర్సింగ్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు తప్పనిసరి.

ఎన్ఎఫ్ఏటీ 2024 వివరాలు: పరీక్షలో 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100. తప్పుగా గుర్తించిన సమాధానానికి పావు మార్కు కోత విధిస్తారు. స్పెషలైజేషన్‌ను అనుసరించి బీడీఎస్/బీఎస్సీ నర్సింగ్ సిలబస్; రీజనింగ్/ఆప్టిట్యూడ్; బేసిక్స్ ఆఫ్ ఫోరెన్సిక్ సైన్సెస్; ఫోరెన్సిక్ డెంటిస్ట్రీ/ఫోరెన్సిక్ నర్సింగ్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం గంటన్నర.

- **ఎన్ఎఫ్ఏటీ 2024 ఫీజు:** రూ.2000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 30
- అడ్మిషన్ టెస్ట్ తేదీని త్వరలో ప్రకటిస్తారు
- **పరీక్ష కేంద్రం:** ఎన్ఎఫ్ఎస్‌యూ క్యాంపస్, గాంధీనగర్
- **అభ్యర్థుల మొదటి మెరిట్ లిస్ట్ విడుదల:** డిసెంబరు 12
- **మొదటి కౌన్సెలింగ్, రెండో మెరిట్ లిస్ట్ విడుదల:** డిసెంబరు 19
- **రెండో కౌన్సెలింగ్ తేదీ:** డిసెంబరు 26
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** 2025 జనవరి 1
- **వెబ్‌సైట్:** www.nfsu.ac.in

ఉదయ్‌పూర్ ఐఐఎంలో ఎంబీఏ

ఉదయ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎంయూ)- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇది ఫుల్ టైం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. ఇందులో గ్లోబల్ సప్లయ్ చెయిన్ మేనేజ్‌మెంట్, డిజిటల్ ఎంటర్‌ప్రైజ్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కోదానిలో మూడు టర్మ్‌లు ఉంటాయి. అకడమిక్ మెరిట్, నిర్దేశిత జాతీయ పరీక్ష స్కోర్, అనుభవం ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.



ప్రోగ్రామ్ వివరాలు: గ్లోబల్ సప్లయ్ చెయిన్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌లో మేనేజ్‌మెంట్ ఫండమెంటల్స్(ఫౌండేషన్, ఫంక్షనల్, ఇంటిగ్రేటివ్, స్కిల్ బిల్డింగ్, డొమైన్), సప్లయ్ చెయిన్ పర్‌స్పెక్టివ్స్(లాజిస్టిక్స్, స్ట్రాటజిక్ సోర్సింగ్ అండ్ ప్రొక్యూర్‌మెంట్, గ్లోబల్ సప్లయ్ చెయిన్ మేనేజ్‌మెంట్, అడ్వాన్స్‌డ్ అనలిటిక్స్), అడ్వాన్స్‌డ్ బిజినెస్ జీఎస్‌సీఎం కోర్సులతోపాటు ప్రాజెక్ట్ వర్క్‌లు, క్యాప్‌స్టోన్ సిమ్యులేషన్, ఎలక్టివ్స్ ఉంటాయి.

- డిజిటల్ ఎంటర్‌ప్రైజ్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌లో ఫండమెంటల్స్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, ఫండమెంటల్స్ ఆఫ్ డిజిటల్ ఎంటర్‌ప్రైజ్, డేటా అనలిటిక్స్ అండ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్, డిజిటల్ ఇండస్ట్రీ ప్రాక్టీసెస్, సాల్వింగ్ బిజినెస్ ప్రాబ్లమ్స్(ప్రాజెక్ట్‌లు) కోర్సులు ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అయిదేళ్ల నుంచి నిర్వహించిన జీమ్యాట్/జీఆర్ఈ స్కోర్ లేదా 2021 నుంచి నిర్వహించిన క్యాట్ స్కోర్ తప్పనిసరి. 2025 ఫిబ్రవరి 28 నాటికి కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలి.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 20
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** నవంబరు 11
- **వెబ్‌సైట్:** iimu.ac.in

జాబ్ కార్నర్

కొంకణ్ రైల్వేలో అప్రెంటిస్‌లు

ఖాళీలు: 190

నవీ ముంబయిలోని కొంకణ్ రైల్వే కార్పొరేషన్ లిమిటెడ్... కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. గ్రాడ్యుయేట్ అప్రెంటిస్: 80
2. డిప్లొమా అప్రెంటిస్(టెక్నీషియన్): 80
3. జనరల్ స్ట్రీమ్ గ్రాడ్యుయేట్స్: 30

విభాగాలు: మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్
అర్హత: విభాగాన్ని అనుసరించి డిప్లొమా, డిగ్రీ, బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
శిక్షణ కాలం: ఒక సంవత్సరం
స్టయిపెండ్: నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.4500, డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.4000.
దరఖాస్తు ఫీజు: రూ.100; ఎస్సీ/ఎస్టీ/మహిళ/పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.
ఎంపిక ప్రక్రియ: విద్యార్హతల్లో సాధించిన మార్కులు, ధ్రువపత్రాల పరిశీలన, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: నవంబరు 2
వెబ్‌సైట్: https://konkanrailway.com/


సిడ్బీలో జూనియర్ లెవల్ ఆఫీసర్లు

భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వశాఖకు చెందిన లఖ్‌నవూలోని స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(సిడ్బీ)... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 3
విభాగాలు: మిడ్ ఆఫీస్(మార్కెట్ రిస్క్ మేనేజర్), ఆపరేషనల్ రిస్క్ మేనేజర్.
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ/సీఎఫ్ఏ, బీఈ/బీటెక్, ఎంబీఏ/ఎంఎంఎస్/ఎంఎస్/పీజీడీఎం(ఫైనాన్స్), ఎమ్మెస్సీ/ఎంఏ(మేథ్స్)/స్టాటిస్టిక్స్/ఎకనామిక్స్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: 35 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
పని ప్రదేశం: ముంబయి
ఎంపిక ప్రక్రియ: మెరిట్ లిస్ట్, షార్ట్ లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా
దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 18
వెబ్‌సైట్: www.sidbi.in/en/

ఈఎస్ఐసీలో సీనియర్ రెసిడెంట్స్

ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఈఎస్ఐసీ) హాస్పిటల్- బెంగళూరులోని ఈఎస్ఐసీ మెడికల్ కాలేజ్, పీజీఐఎంఎస్ఆర్ అండ్ మెడికల్ హాస్పిటల్...ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
ఖాళీలు: 13
విభాగాలు: ఎమర్జెన్సీ మెడిసిన్, ఎన్‌ఎంటీ, పీడియాట్రిక్స్(ఎన్ఐసీయూ)
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, ఎండీ/ఎంఎస్/డీఎన్‌బీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
జీతం: నెలకు రూ.67,700
వయోపరిమితి: 45 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ/పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.
ఇంటర్వ్యూ తేదీ: అక్టోబరు 15
వేదిక: అకడమిక్ బ్లాక్, ఈఎస్ఐసీ మెడికల్ కాలేజ్ అండ్ పీజీఎంఎస్ఆర్, రాజాజీనగర్, బెంగళూరు.
వెబ్‌సైట్: https://www.esic.gov.in/


లిటిల్స్



ఎదుటి వారిని హేళన చేసిన ఫలితం

ఒక ఊరిలో శేషయ్య అనే వ్యాపారి దగ్గర ఒక గుర్రం,ఒక గాడిద ఉండేవి.అతను తరచూ పక్క ఊరిలోని సంతకు వెళ్లి, సరుకులు కొని, వాటి మూటలు గాడిద మీద వేసుకుని, తాను గుర్రం మీద ఎక్కి తిరిగి ఇంటికి వచ్చేవాడు. ఒక పెద్ద పండగ కు ముందురోజు శేషయ్య పట్నానికి వెళ్లి, చాలా సరుకులు కొని, వాటన్నిటి మూటలు గాడిద మీద వేసి, ఎప్పటి లాగే తాను గుర్రం ఎక్కి కూర్చున్నాడు ఆ రోజు బరువులు చాలా ఎక్కువ అవడంతో, గాడిద తట్టుకోలేక నెమ్మదిగా నడుస్తూ, ఇబ్బంది పడుతోంది, ఆ విషయం గమనించిన గుర్రంగాడిదను చూసి నవ్వింది. గాడిద బాధ పడుతూ, కొంచెం బరువును పంచుకోమని గుర్రాన్ని ప్రాధేయ పడింది. దానికి గుర్రం' నేనేమీ గాడిదను కాదు బరువులు మోయడానికి.నేను మనుషులు స్వారీ చేయడానికే తప్ప, బరువులు మోయడం లాంటి తక్కువ స్థాయి పనులు చేయను' అని పరుషంగా మాట్లాడింది. ఆ మాటలు విని బాధ కలిగినా గాడిద చేసేదేమీ లేక ముందుకు నడిచింది. కొంత దూరం నడిచాక ఆ బరువులు మోయడం ఇక గాడిద వల్ల కాలేదు అది నీరసంతో ఒక్కసారిగా నించున్న చోటనే కుప్ప కూలిపోయి మరలా లేవలేక పోయింది. అపుడు వ్యాపారి చేసేదేమీ లేక గాడిద వీపు మీది బరువును గుర్రం మీదకు మార్చి, తవాటితో పాటు తాను కూడా గుర్రం మీదనే కూర్చున్నాడు. అపుడు గుర్రం ' పాపం గాడిద ఇంత బరువు మోయలేకనే ఇబ్బంది పడింది కాబోలు,అనవసరంగా అది సాయం అడిగినపుడు ఎగతాళి చేసి మాట్లాడాను. ఇపుడు యజమాని బరువు, సరుకుల వరువు మోస్తుంటే అర్థం అవుతుతంది గాడిద రోజూ ఎంత కష్టపడేదీ. మరెప్పుడూ సాయం అడిగిన ఎవరినీ హేళనగా మాట్లాడకూడదు' అనుకుంది.

దారి కనుక్కోండి



సరైన నీడ ఏది?



10 తేడాలు గుర్తించండి





డైలీ సుడోకు - 431

							8	2
	3	1		8		6		7
9		8			2	4		
7					6			
		5	8		3	2		
			1					5
		9	7			1		8
8		2		6		5	4	
4	1							

సుడోకు - 430 సమాధానం

3	6	9	7	2	1	4	8	5
4	7	2	3	8	5	9	1	6
5	1	8	6	9	4	7	2	3
7	8	3	4	6	9	1	5	2
1	9	5	8	3	2	6	4	7
2	4	6	1	5	7	8	3	9
9	3	1	5	7	8	2	6	4
6	2	4	9	1	3	5	7	8
8	5	7	2	4	6	3	9	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.